/manamnews
www.manamnews.com

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

తిరుపతి | శుక్రవారం • 7-4-2023 • సంపుటి:7 • సంచిక:92 • పేజీలు:8 • వెల:రూ.5

AMARAVATHI | ANANTHAPURAM | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHBUBNAGAR | WARANGAL | KHAMMAM


చైత్రమాసం, శుక్రవారం, తిథి: విదియ, ఉ.10.21 నుంచి రేపు ఉ.10.11 వరకు, నక్షత్రం: స్వాతి, మ.1.33 నుంచి రేపు మ.1.59 వరకు, వర్జ్యం: సా.7.15-8.53 వరకు, దుర్ముహూర్తం: ఉ.11.53-మ.12.42 వరకు, రాహుకాలం: ఉ.10.46-మ.12.18 వరకు

## అమాంతం పెరిగిన కొత్త కేసులు..

### 25 వేలు దాటిన క్రియాశీల కేసులు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: దేశంలో కరోనా వ్యాప్తి ఆందోళన కలిగిస్తోంది. ఒక్కరోజు వ్యవధిలో వెయ్యికిపైగా రోజువారీ కేసులు పెరగడం కలవరానికి గురిచేస్తోంది. నిన్న 1,60,742 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు చేయగా.. 5,335మందికి వైరస్ సోకిందని గురువారం కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. మందురోజు ..మిగతా 2లో



## వడ్డీరేట్లు యథాతథం

### ఆర్బీఐ కీలక నిర్ణయం..

ముంబయి, ఏప్రిల్ 6: మెజారిటీ నిపుణుల అంచనాలకు భిన్నంగా 'భారతీయ రిజర్వ్ ..మిగతా 2లో

# మాకు పొత్తుల్లేవు..

### పొత్తుల కోసం వెంపర్లాడం

### ప్రజలతోనే మా పొత్తు: సీఎం జగన్

నాపై పోరాటానికి తోడేళ్లన్నీ ఒక్కటయ్యాయి

జిత్తులు.. పొత్తులు.. కుయుక్తులతో వస్తున్నారు

నాకు ఉన్నది దేవుడి దయ.. ప్రజల మద్దతు

చేసేదే చెబుతా... చెప్పిందే చేస్తా

బాబు హయాం మొత్తం దోచుకో, తినుకో, పంచుకో

ఆయనకు స్కాములు తప్ప స్కీములు తెలియవు

సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి

చిలకలూరిపేటలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ప్రారంభం





అమరావతి, ఏప్రిల్ 6 (మనం న్యూస్): ఏపీలో రాజకీయ పొత్తులపై ముఖ్యమంత్రి కీలక వ్యాఖ్యలు చేసారు. తనకు పొత్తుల్లేవని.. తాను పొత్తుల కోసం వెంపర్లాడనని సీఎం తేల్చి చెప్పారు. తనకు పొత్తులు అంటే ఉంటేది ప్రజలతోనే అని స్పష్టం చేసారు. చిలకలూరిపేటలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ప్రారంభించిన ముఖ్యమంత్రి ప్రతిపక్షాల పైన ఫైర్ అయ్యారు. జిత్తులు.. పొత్తులు.. కుయుక్తులతో పొత్తులు పెట్టుకొని తోడేళ్ల అన్నీ ఒక్కటిగా తన మీద పోరాటనికి సిద్దం అవుతున్నాయని చెప్పారు. తనకు అంగ బలం.. అర్దం బలం లేవన్నారు. తనకు ఉన్నది దేవుడి దయ... ప్రజల మద్దతు అని జగన్ స్పష్టం చేసారు. చేసేదే చెబుతాను.. చెప్పిందే చేస్తాను: స్కాములు తప్ప స్కీములు తెలియని బాబులకు అధికారంలో ఉండగా దోచుకో పంచుకో తినుకో మాత్రమే అమలు చేసారని ముఖ్యమంత్రి జగన్ ఫైర్ అయ్యారు. వయసు ..మిగతా 2లో



## 1.3 లక్షల కానిస్టేబుల్ ఉద్యోగాలు

### కేంద్ర ప్రభుత్వం భారీ నోటిఫికేషన్..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగులకు శుభవార్త అందించింది. భారీగా సీఆర్‌పీఎఫ్ జవాన్ల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. అందులో మహిళలకు, మాజీ అగ్నివీరులకు రిజర్వేషన్ సైతం కల్పించింది. కేంద్ర ప్రభుత్వం భారీగా సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) కానిస్టేబుల్ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు సిద్ధమైంది. 1.3లక్షల సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. హోం ..మిగతా 2లో



## 2024లో మాదే విజయం

### హనుమాన్ స్ఫూర్తితో అవినీతిపై పోరాడాలి

### నైరాశ్యంలో విపక్షాలు..

### అందుకే నాకు సమాధి కడతామని వ్యాఖ్యలు

### ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: 2024లో ఎన్నికల్లో బీజేపీని ఎవరూ ఓడించలేరని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. భారతీయ జనతా పార్టీ 44వ వార్షికోత్సవం సందర్భంగా పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రధాని మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. అవినీతి, బంధుప్రీతి, శాంతిభద్రతల సమస్యపై పోరాటం చేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ..మిగతా 2లో



## కాంగ్రెస్‌లో కుదుపు..!

### బీజేపీలోకి ఏకే ఆంటోనీ తనయుడు

తిరువనంతపురం, ఏప్రిల్ 6: కాంగ్రెస్‌లో కుదుపు..! పార్టీ సీనియర్ నేత, గాంధీ కుటుంబ సన్నిహితుడు ఏకే ఆంటోనీ తనయుడు అనిల్ ఆంటోనీ బీజేపీలో చేరారు. కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, వి. మురళీధరన్, బీజేపీ కేరళ అధ్యక్షుడు కె.సురేంద్రన్ సమక్షంలో ఆయన కమలం గూటికి చేరారు. ప్రధాని నరేంద్ర మోదీపై బీబీసీ తీసిన డాక్యుమెంటరీని వ్యతిరేకిస్తూ చేసిన పోస్టు ..మిగతా 2లో

## ఆయనది నాలుకా, తాటిమట్టా?

### సీఎంపై నిందలు, విమర్శలు చేయడమే వారి పని

### చంద్రబాబుపై మంత్రి బొత్స ఫైర్..



అమరావతి, ఏప్రిల్ 6 (మనం న్యూస్): ఎంతసేపు సీఎం జగన్‌పై నిందలు, విమర్శలు చేయడమే చంద్రబాబు పనిగా పెట్టుకున్నారని మంత్రి బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. చంద్రబాబు హయాంలో ఉత్తరాంధ్రలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం అయినా జరిగిందా అంటూ ఆయన ప్రశ్నించారు. ఎవరి పనైపోయిందో వచ్చే ఎన్నికలే చెబుతాయన్నారు. కొద్దో గొప్పో టీడీపీకి ఉన్న ఉనికి వచ్చే ఎన్నికల్లో పోవడం ఖాయమని బొత్స పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలో అభివృద్ధి జరిగింది నాటి సీఎం వైఎస్సార్ హయాంలోనే అన్నది టీడీపీకి తెలియదా అంటూ ప్రశ్నించారు. ఇప్పుడు ఆ అభివృద్ధిని సీఎం జగన్ కొనసాగిస్తున్నారన్నారు. సీఎం జగ్న చంద్రబాబు వ్యక్తిగత విమర్శలు చేయడం దారుణమన్నారు. ఆయనది నాలుకా, తాటిమట్టా అంటూ మండిపడ్డారు. రుషి కొండ బోడి కొండ చేశారని పదే పదే విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. అక్కడ ఏమైనా ప్రైవేట్ కట్టడాలు, లేదంటే తాము వ్యక్తిగత కట్టడాలు ఏమైనా చేస్తున్నామా.. ప్రభుత్వ కట్టడాలకే కదా ఉపయోగిస్తోందిఅభివృద్ధి చేయడం తప్పా.. అంటూ ..మిగతా 2లో

## ఒక్కరికి సీటిస్తామంటే.. నలుగురు ఎమ్మెల్యేలు వస్తామంటున్నారు

### చాలా మంది వైసీపీ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారు

### టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు



అమరావతి, ఏప్రిల్ 6 (మనం న్యూస్): చాలా మంది వైకాపా ఎమ్మెల్యేలు టచ్‌లో ఉండటమే కాకుండా, ఎదురు తమకే బంపర్ ఆఫర్లు ఇస్తున్నారని టీడీపీ ఏపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒక్కరికి సీటిస్తామని హామీ ఇస్తే.. నలుగురు ఎమ్మెల్యేలు వస్తామంటూ తనకు ఫోన్లు చేస్తున్నారని తెలిపారు. మేం టీడీపీలోకి వెళ్లం.. వైసీపీతోనే మా జీవితం అంటూ గంభీరంగా చెప్పే వాళ్లే బంపర్ ఆఫర్ ప్రకటించిన జాబితాలో ముందున్నారని అచ్చెన్న స్పష్టం చేశారు. వైసీపీలో తమకు భవిష్యత్తు ఉండదని ఆ పార్టీ నేతలకు అర్థమైపోయిందన్నారు. తమతో టచ్‌లో ..మిగతా 2లో



## ఢిల్లీ లిక్కర్ స్కామ్..

### మూడో ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: ఢిల్లీ మద్యం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసుకు సంబంధించి రౌస్ అవెన్యూ సీబీఐ ప్రత్యేక కోర్టులో గురువారం ఈడీ మూడో ఛార్జిషీట్ వేసింది. ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న మాగుంట రాఘవ, రాజేశ్ జోషి, గౌతమ్ మల్హోత్రలపై ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఫిబ్రవరి 7న గౌతమ్ మల్హోత్ర, ఫిబ్రవరి 8న రాజేశ్ జోషి, మాగుంట రాఘవను ఫిబ్రవరి 10న అరెస్టు చేసినట్లు ఛార్జిషీట్‌లో ఈడీ పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి ..మిగతా 2లో

## పోలవరం ఎత్తు తగ్గించే ప్రసక్తే లేదు..



### నాదెండ్ల చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలు


### ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నారు

### ఇరిగేషన్ శాఖ మంత్రి అంబటి

అమరావతి, ఏప్రిల్ 6 (మనం న్యూస్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పోలవరం ప్రాజెక్టు ఎత్తుపై రకరకాల ప్రచారం సాగుతోంది.. ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తున్నారని కొందరు? యథావిధిగా ఉంటుందని మరికొందరు చెబుతున్న మాట.. అయితే, పోలవరం ప్రాజెక్టుపై వస్తున్న విమర్శలను తిప్పికొడుతూ.. ప్రాజెక్టు ఎత్తుపై క్లారిటీ ఇచ్చారు రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ..మిగతా 2లో

## పరాజయాలు ఎదుర్కొంటేనే విజయం తథ్యం

### జనసేన అధినేత పవన్ కల్యాణ్



వరంగల్, ఏప్రిల్ 6 (మనం న్యూస్): కళ మనుషులందరినీ ఒకటి చేస్తుందని.. అందుకే నాటు నాటు పాటకు ఆస్కార్ పురస్కారం దక్కిందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. నేర్చుకోవడం ఎప్పుడూ మానకూడదని.. అపజయాలే విజయానికి సోపానాలుగా మలచుకోవాలని విద్యార్థులకు సూచించారు. అపజయాలు ఎదురైతే ధైర్యంగా ఎదుర్కోవాలని, ఆత్మవిశ్వాసంతో అడుగులు వేయాలని నిర్దేశించారు.నెహ్రూ ఎంతో ముందుచూపుతో ఎన్ఐటీలను ప్రారంభించారన్నారు. వరంగల్ నిట్లో 3రోజుల పాటు జరగనున్న స్ప్రింగ్ స్ప్రీ వేడుకల్లో పాల్గొన్న పవన్ కల్యాణ్ విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. 'నేను సాధారణంగా విద్యా సంస్థల కార్యక్రమాలకు వెళ్లను. నా జీవితంలో కొన్ని సంఘటనలను మీతో పంచుకుంటా.. ..మిగతా 2లో



## వాకపల్లి సామూహిక అత్యాచారం కేసు కొట్టివేత..

సెషన్స్ జడ్జి-కమ్-స్పెషల్ కోర్టు న్యాయమూర్తి మొత్తం 13 మంది నిందితులను నిర్దోషులుగా ప్రకటించారు

2

### మంచిమాట

ధనం మీద ఆశ పెరిగే కొలది ఆరోగ్యం... బంధాలు... ప్రేమ... ఆప్యాయతలు... అన్నీ దూరమవుతాయి.

శుభోదయం

## నేటి నుంచి జగనన్నే మా భవిష్యత్తు

### కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేశాం

### ప్రపంచంలో ఎవరూ ఇలా ధైర్యంగా అడగలేరు

### వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి

2



## ఢిల్లీలో పవన్ పనులు హాస్యాస్పదం..



### తెలుగు ప్రజల గౌరవం తాకట్టు పెట్టొద్దు

### వైసీపీ ఎంపీ మార్గాని భరత్ రామ్

రాజమండ్రి, ఏప్రిల్ 6 (మనం న్యూస్): టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన పవన్ కల్యాణ్‌పై ..మిగతా 2లో



## మళ్లీ సుప్రీం మెట్లెక్కిన అమరావతి రైతులు

ఆర్-5 జోన్ వ్యవహారంపై పిటిషన్ దాఖలు

14న విచారణ చేపట్టే అవకాశం

2

# వడ్డీరేట్లు యథాతథం

(మొదటిపేజీ తరువాయి)

బ్యాంక్ (ఆర్బీఐ) వడ్డీరేట్ల పెంపు విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. రెపోరేటులో ఎలాంటి మార్పు చేయకుండా 6.50 శాతం వద్ద యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. ఎస్డీఎఫ్ రేటు 6.25 శాతం, ఎంఎస్ ఎఫ్ రేటు 6.75 శాతం, బ్యాంక్ రేటు 6.75శాతంగా కొనసాగుతాయని తెలిపారు. ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ గురువారం ప్రకటించారు. ఈ నిర్ణయానికి 'మాని టరీ పాలసీ కమిటీ' ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. 2023–24లో ఇదే తొలి ద్రవ్యపరపతి విధాన సమీక్ష. ఈ నెల 3వ తేదీన ఎంపీసీ సమీక్షా సమావేశం ప్రారంభమైంది. ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయ డమే లక్ష్యంగా ఆర్బీఐ గత ఏడాది మే నెల నుంచి కీలక వడ్డీరేట్లను పెంచుతూ వచ్చింది. ఇప్పటి వరకు రెపోరేటును 250 బేసిస్ పాయింట్లు పెంచింది. 2023 ఫిబ్రవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం 6.44 శాతంగా నమో దైంది. అంతక్రితం నెల ఇది 6.52 శాతంగా ఉంది. ద్రవ్యోల్బణం లక్షిత పరిధి అయిన ఆరు శాతానికి పైనే స్థిరంగా నమోదవుతున్న నేపథ్యంలో వడ్డీరేట్ల పెంపు ఆర్బీఐకి ఇప్పటి వరకు అనివార్యమైంది.

2023 ఆశాజనకంగా ప్రారంభమైందని శక్తికాంత దాస్ అన్నారు. సరఫరా వ్యవస్థలు మెరుగయ్యాయని.. ఆర్థిక కార్యకలాపాలు పుంజుకున్నాయని చెప్పారు. ఫైనాన్షియల్ మార్కెట్లు ఆశాజనకంగా ముందుకు సాగాయన్నారు. కానీ, మార్చి నెలలో పరిస్థితులు నాటకీయంగా అనూహ్య మలుపు తీసుకున్నాయని తెలిపారు. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లో బ్యాంకింగ్ రంగంలో వచ్చిన కుదుపు గందరగోళ పరిస్థితుల్ని సృష్టించిందని పేర్కొన్నారు. ఫలితంగా ఆర్థిక వ్యవస్థల స్థిరత్వంపై అనుమానాలు తెరపైకి వచ్చాయన్నారు. మరోవైపు ద్రవ్యోల్బణ కట్టడి కోసం ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు కీలక వడ్డీరేట్లను పెంచుతూనే ఉన్నాయన్నారు. ఇటీవలి నెలల్లో ద్రవ్యోల్బణం కొంత వరకు అదుపులోకి వచ్చినప్పటికీ.. ఇప్పటికీ లక్షిత పరిధి కంటే ఆవలే ఉందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రేట్ల పెంపు విషయంలో ఆయా కేంద్ర బ్యాంకులు కొంత నెమ్మదించినట్లు తెలిపారు. కానీ, పెంపు నుంచి ఇంకా పూర్తిగా విరమించలేదని గుర్తుచేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆర్బీఐ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచాలని నిర్ణయించిందని తెలిపారు.

## అమాంతం పెరిగిన కొత్త కేసులు..

(మొదటిపేజీ తరువాయి)

ఆ సంఖ్య 4,435గా ఉంది. కొత్త కేసులు క్రమంగా పెరుగుతుండటంతో క్రియాశీల కేసులు 25వేల మార్కు దాటాయి. మొత్తం కేసుల్లో బాధితుల వాటా 0.06 శాతంగా ఉంది. రికవరీ రేటు 98.75 శాతంగా నమోదైంది. తాజాగా కేంద్రం ఆరుగురు మరణించినట్లు ప్రకటించింది. దాంతో మొత్తం మృతుల సంఖ్య 5,30,929కి చేరింది. ఇప్పటివరకూ 220.66 కోట్ల టీకా డోసులు పంపిణీ అయ్యాయి. దేశంలో కొవిడ్ కేసులు మళ్లీ పెరగడానికి ఎక్స్‌బీబీ.1.16 వేరియంట్ కారణమై ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. వైరస్‌లో మ్యుటేషన్లు జరుగుతున్న కొద్దీ ఇటువంటి కొత్త వేరియంట్లు పుట్టుకొస్తూనే ఉంటాయన్నారు.

## 1.3 లక్షల కానిస్టేబుల్ ఉద్యోగాలు

(మొదటిపేజీ తరువాయి)

వ్యవహారాల మంత్రిత్వ శాఖ పేరిట.. మొత్తం జనరల్ డ్యూటీ(జీడీ) ఉద్యోగాలకు ప్రకటన విడుదలైంది. పురుషులతో పాటు మహిళలు కూడా ఇందులో అవకాశం కల్పించింది ప్రభుత్వం. ఉద్యోగాల భర్తీలో మాజీ అగ్నివీరులకు పది శాతం రిజర్వేషన్ ఇవ్వనున్నట్లు తెలిపింది.

**నోటిఫికేషన్ వివరాలు..**

మొత్తం 1,29,929 ఖాళీలు ఉన్నట్లు ప్రభుత్వం నోటిఫికేషన్‌లో తెలిపింది. అందులో పురుషులకు 1,25,262 పోస్టులు ఉన్నట్లు వెల్లడించింది. మహిళలకు 4667 ఉద్యోగాలను కేటాయించింది. పోస్ట్ జనరల్ సెంట్రల్ సర్వీస్, గ్రూప్ 'సి', నాన్ గెజిటెడ్ (నాన్ మినిస్టీరియల్ కంబాటెంట్)గా పోస్టులను ప్రభుత్వం వర్గీకరించింది. మూడో వేతన స్కేలు ప్రకారం.. రూ.21700– 69100 మధ్యలో జీతం ఉంటుంది. 2 సంవత్సరాల పాటు ప్రొబేషన్ పీరియడ్ ఉంటుంది.

**వయసు పరిమితులు..**

అభ్యర్థులు కచ్చితంగా 18 నుంచి 23 మధ్య వయసుల వారై ఉండాలి. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలకు ఐదు సంవత్సరాల వయసు సడలింపు ఉంటుంది. వెనుకబడిన వర్గాల వారికి మూడు సంవత్సరాల వయసు సడలింపు ఉంటుంది. మాజీ అగ్నివీరులకు మూడు సంవత్సరాల వయసు సడలింపు ఉంటుంది. ఫస్ట్ బ్యాచ్ మాజీ అగ్నివీరులకు ఐదు సంవత్సరాల సడలింపు ఉంటుంది

**విద్యార్హతలు..**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని గుర్తింపు పొందిన విద్యా సంస్థల నుంచి పదో తరగతి పూర్తిచేయాలి. మాజీ ఆర్మీ జవాన్లకు కూడా ఇదే అర్హత వర్తిస్తుంది.

**ఫిట్‌నెస్ పరీక్షలు..**

కేంద్ర ప్రభుత్వం సూచించిన ప్రకారం.. అభ్యర్థి శారీరకంగానూ, వైద్యపరంగానూ దృఢంగా, ఆరోగ్యంగా ఉండాలి. అభ్యర్థి కచ్చితంగా శారీరక సామర్థ్య పరీక్షను, రాత పరీక్షను పాస్ కావాల్సి ఉంటుంది. మాజీ అగ్నివీరులకు శారీరక సామర్థ్య పరీక్షల నుంచి మినహాయింపు ఉంటుంది.

## కాంగ్రెస్‌లో కుదుపు..!

(మొదటిపేజీ తరువాయి)

విషయంలో విభేదాలు తలెత్తడంతో ఈ ఏడాది జనవరిలో కాంగ్రెస్‌కు అనిల్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఆయన పార్టీలో రాష్ట్ర సోషల్ మీడియా విభాగాన్ని నిర్వహించేవారు. తాను చేసిన ట్వీట్‌ను వెనక్కి తీసుకోవాలంటూ వచ్చిన ఒత్తిడి నేపథ్యంలోనే రాజీనామా నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. 'చాలా మంది కాంగ్రెస్ నేతలు.. ఓ కుటుంబం కోసం పని చేయడమే తమ కర్తవ్యమని భావిస్తారు. కానీ.. ప్రజల కోసం పనిచేయాలని నేను నమ్ముతాన'ని అనిల్ ఆంటోనీ ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. రాబోయే 25 ఏళ్లలో భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చే విషయంలో ప్రధాని మోదీకి స్పష్టమైన విజన్ ఉందని పేర్కొన్నారు. మరోవైపు.. అనిల్ ఓ బహుముఖ ప్రజ్ఞాశాలి అని పీయూష్ గోయల్ కొనియాడారు. సుస్థిర అభివృద్ధిపై ఆయన, ప్రధాని మోదీ అభిప్రాయాలు ఒకేలా ఉన్నాయన్నారు. పార్టీలో కీలక పాత్ర పోషించడంతో పాటు దక్షిణాదిలో బీజేపీ ఎదుగుదలకు సహాయపడగలరని విశ్వసిస్తున్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా.. అనిల్ ఆంటోనీ కేరళలో పార్టీని విస్తరించగలరని, పెద్ద సంఖ్యలో ఓటర్లు, ముఖ్యంగా క్రైస్తవుల మద్దతు కూడగట్టగలరని బీజేపీ ఆశిస్తోంది.

## ఢిల్లీ లిక్కర్ స్కామ్..

(మొదటిపేజీ తరువాయి)

ఈడీ దాఖలు చేసిన అనుబంధ ఛార్జిషీట్‌పై ఈ నెల 14న సీబీఐ ప్రత్యేక కోర్టు విచారణ చేపట్టనుంది. కేసు దర్యాప్తునకు సంబంధించి ఈడీ అనుబంధ ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకోవాలో.. లేదో అనే విషయాన్ని సీబీఐ ప్రత్యేక కోర్టు తేల్చనుంది.

# మాకు పొత్తుల్లేవు..

(మొదటిపేజీ తరువాయి)

పెరిగినా బుద్ధి పెరిగినా.. సామాజిక అన్యాయం తప్ప న్యాయం తెలియని పరాన్న జీవులు ఇప్పుడు మీ బిడ్డను ఎదుర్కోలేక కుయుక్తులు పన్నుతారని మండిపడ్డారు. మంచి చేయటంలో సాటి రాలేక.. మంచి చేసామని చెప్పుకొనే మంచి లేక ఎత్తులు,పొత్తులు, కుయుక్తులు రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. బీ బిడ్డ ఒక్కడు ఒక వైపు.. నవరత్నాలతో మీ బిడ్డ ఎదురుగా వస్తుంటే.. మహిళల నుంచి వస్తున్న తోడును చూసి తట్టుకోలేక తోడేళ్లు అన్ని ఒక్కటవుతున్నాయని ముఖ్యమంత్రి ఫైర్ అయ్యారు.

**నాకు ఉన్నది.. వాళ్లకు లేనిది ఒక్కటే..**

తనకు వాళ్ల లాగా అంగ–అర్థం బలం ఉండకపోవచ్చన్నారు. కానీ, దేవుడి దయ, ప్రజల చల్లని ఆశీస్సులు తనకు ఉన్నాయని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. తాను పొత్తుల మీద ఆధారపడనని స్పష్టం చేసారు. తనకు కుయుక్తులు పన్నటం..అబద్ధాలు చెప్పటం..మోసం చేయటం..పన్నాగాలు తెలయవని పేర్కొన్నారు. ఏదైనా చేసేదే చెబుతానని.. చెప్పిందే చేస్తానని ముఖ్యమంత్రి స్పష్టం చేసారు. ప్రతీ ఇంటికి ఈ 46నెలల పాలనలో 2.05 లక్షల కోట్ల రూపాయాల మేరకు ప్రతీ ఇంటికి లబ్ది జరిగేలా చూసామని వివరించారు. మీ ఇంట మంచి జరిగితే మీ బిడ్డకు మీరే సైనికులుగా నిలవాలని ముఖ్యమంత్రి కోరారు. ప్రతీ ఇంట జరిగిన మంచి గురించి చర్చ జరగాలన్నారు. మంచి జరిగిన వారంతా తనకు సైనికులు కావాలని ముఖ్యమంత్రి జగన్ కోరారు.



మనది బతికించే ప్రభుత్వం

ప్రతి పేదవాడు వైద్యం కోసం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశ్యంతో నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఫ్యామిలీ డాక్టర్ విధానం అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. ఆరోగ్యశ్రీ అంటే వైయస్ఆర్ గుర్తొస్తారని, ఖరీదైన కార్పొరేట్ వైద్యాన్ని పేదలకు అందుబాటులోకి తీసుకువచ్చారని చెప్పారు. పేదలు ఆసుపత్రుల చుట్టూ, డాక్టర్ల చుట్టూ తిరగాల్సిన అవసరం ఇకపై ఉండదని, మీ గ్రామానికే, సమీపానికే అన్ని వైద్యసేవలు అందించే గొప్ప కార్యక్రమం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అన్నారు. ఈ విధానంలో సాధారణ వైద్య సేవలతో పాటు తల్లులు, బాలింతలకు వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. గతంలో వెయ్యి వ్యాధులకు ఆరోగ్య శ్రీ కింద అందే సేవలను ఇప్పుడు 558 వ్యాధులకు.. పక్క రాష్ట్రాల్లోని ఆస్పత్రుల్లోనూ అందేలా విస్తరించామని ముఖ్యమంత్రి జగన్ వివరించారు.

# వాకపల్లి సామూహిక అత్యాచారం కేసు కొట్టివేత..

విశాఖపట్నం, ఏప్రిల్ 6 (మనం న్యూస్): వాకపల్లి ఆదివాసీ మహిళల అత్యాచారం కేసును కొట్టేసింది విశాఖ సెషన్స్ కోర్టు. విచారణలో నేరం రుజువు కాలేదని తెలిపింది. బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని లీగల్ సెల్ అథారిటీని ఆదేశించింది. 2007 ఆగస్టులో విశాఖ జిల్లా జి.మాడుగుల మండలం వాకపల్లిలో ఈ ఘటన జరిగింది. కూంబింగ్ కోసం వెళ్లిన ప్రత్యేక పోలీసు బృందం అత్యాచారాలకు పాల్పడిందని కేసు నమోదు చేశారు. మానవహక్కులు, పౌర సంఘాలు కల్పించుకోవడంతో వివిధ దశల్లో విచారణ జరిగింది. అయితే, కేసు విచారణ దశలోనే ఇద్దరు మహిళలు మృతి చెందారు. నేరం రుజువు కాలేదంటూ కేసును కొట్టేసింది కోర్టు. అప్పటి దర్యాప్తు అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేసింది. కాగా, 2007 ఆగస్టు 20న విశాఖపట్నం జిల్లా జి.మాడుగుల మండలం నుర్మతి పంచాయితీ వాకపల్లి గ్రామంలో కూంబింగు పేరుతో గ్రేహౌండ్స్ పోలీసులు చొరబడి స్వైరవిహారం చేశారు. వాకపల్లి గ్రామంలోని కోండు తెగకు చెందిన 11 మంది ఆదివాసీ మహిళలను అత్యంత అమానుషంగా, ఘోరంగా అత్యాచారం చేశారని ఆరోపణలు వచ్చాయి.. బాధిత మహిళల్లో ఇద్దరు మరణించారు. ఆ సంఘటన జరిగిన నాటి నుండి అనేక ఆదివాసీ సంఘాలు, ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన చేయడంతో ఆరోజు వాకపల్లికి గ్రేహౌండ్స్ పోలీసులు వెళ్ళినట్టు ఒప్పుకోవడమే కాకుండా వారి వివరాలతో కూడిన జాబితా విడుదల చేశారు.. ఈ కేసును అణగదొక్కడానికి వైద్య వివేదికల చుట్టూ తిప్పాలని చూశారు. ఆ నివేదికను అడ్డుపెట్టుకొని రాష్ట్ర హోంశాఖ అసలు అత్యాచారమే జరగలేదని బుకాయించిందనే విమర్శలు వచ్చాయి.. ఆ గ్రామానికి వెళ్ళింది సామాన్యులు కాదు. ప్రతిఘటించడానికి వాళ్ల మామూలు వ్యక్తులు కారు. రాష్ట్ర ప్రభుత్వం కనుసైగలో పని చేస్తున్న సాయుధ గ్రేహౌండ్స్ పోలీసుల రూపంలో ఉన్న రాబందులు అంటూ ప్రజాసంఘాలు మండిపడ్డాయి.. అయితే, వాకపల్లి ఆదివాసీ మహిళల అత్యాచారం కేసును గురువారం కొట్టేసింది విశాఖ సెషన్స్ కోర్టు. విచారణలో నేరం రుజువు కాలేదని తెలిపింది. వాకపల్లి గ్యాంగ్ రేప్ కేసును విచారిస్తున్న అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి–కమ్–స్పెషల్ కోర్టు న్యాయమూర్తి మొత్తం 13 మంది నిందితులను నిర్దోషులుగా ప్రకటించారు. నిందితులు దోషులుగా గుర్తించబడలేదని న్యాయమూర్తి తెలిపారు. అప్పీల్ సమయం ముగిసిన తర్వాత బెయిల్ బాండ్లు రద్దు చేయబడతాయని, కేసుకు సంబంధించిన ఆధారాలు ఏదైనా ఉంటే, అప్పీల్ సమయం తర్వాత ధ్వంసం చేయాలని ఆదేశించినట్లు న్యాయమూర్తి తెలిపారు.

అయితే, ఈ కేసులో దర్యాప్తు అధికారులలో ఒకరైన శివానంద రెడ్డి సరైన విచారణను నిర్వహించడంలో విఫలమైనందుకు చర్య తీసుకున్నందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అపెక్స్ కమిటీకి రిఫర్ చేయాలని న్యాయమూర్తి ఆదేశించారు. విచారణ వైఫల్యం కారణంగా నిందితులు నిర్దోషులుగా విడుదలైనందున, తొమ్మిది మంది బాధితులు పరిహారం పొందేందుకు అర్హులని, తగు విచారణ తర్వాత పరిహారం పరిమాణాన్ని నిర్ణయించి, వారికి చెల్లించాల్సిన నష్టపరిహారాన్ని చెల్లించాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీని ఆదేశించినట్లు న్యాయమూర్తి తెలిపారు. 2007 నుండి లైంగిక వేధింపులు, ఇతర నేరాల బాధితులు. వాకపల్లికి చెందిన 11 మంది గిరిజన మహిళలు ఆగస్ట్ 20, 2007న ఎ.పి.పోలీసుల స్పెషల్ పార్టీ తమ గ్రామానికి వచ్చి తమపై అత్యాచారానికి పాల్పడ్డారని ఆరోపించింది. ఈ కేసును బతికున్న 11 మంది బాధితుల్లో తొమ్మిది మంది పోరాడుతున్నారు. బాధితుల నిరంతర ప్రయత్నం తర్వాత, విశాఖపట్నంలోని ఎస్సీ ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టం కింద ఏర్పాటైన ప్రత్యేక కోర్టు ద్వారా కేసును విచారించాలని 2017 ఆగస్టులో సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం విదితమే.

# పోలవరం ఎత్తు తగ్గించే ప్రసక్తే లేదు..

(మొదటిపేజీ తరువాయి)

అంబటి రాంబాబు. తాడేపల్లిలో మీడియాతో మాట్లాడిన ఆయన.. పోలవరం ఎత్తు తగ్గిస్తామని అధికారులు సంతకాలు పెట్టారని జనసేన నేత నాదెండ్ల మనోహర్ చెప్పాడు.. ఇలా పచ్చి అబద్ధాలు మాట్లాడటానికి బుద్ధి, జ్ఞానం ఉందా? అంటూ మండిపడ్డారు. ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా నాదెండ్ల మనోహర్ వ్యవహరిస్తున్నారని ఆరోపించిన ఆయన.. రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రిగా నేను సవాల్ చేస్తున్నాను.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్వయంగా అసెంబ్లీ వేదికపైనే చెప్పారు.. పోలవరం ఎత్తు తగ్గించే ప్రసక్తే లేదని అని గుర్తుచేశారు. పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు 41.15కు ఎత్తు కుదించారన్నది పచ్చి అబద్ధం అని తిప్పికొట్టారు అంబటి రాంబాబు. అధికారులు సంతకాలు చేశారని చేసిన తన వ్యాఖ్యలను నాదెండ్ల నిరూపిస్తే నేనే స్వయంగా పోలవరం ప్రాజెక్టు దగ్గరకు తీసుకుని వెళ్తానన్నారు. గొడవ చేయటానికి వెళ్తే పోలవరం ప్రాజెక్టు దగ్గరకు ఎందుకు అనుమతిస్తాం? అని ప్రశ్నించారు. ఇంతకు ముందు చంద్రబాబు రాత్రి ఏడు గంటలకు పోలవరం ప్రాజెక్టు దగ్గరకు వెళ్ళి గొడవ చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. డయాఫ్రమ్ వాల్ డ్యామేజ్ అయిన విషయం తెలియకే 2022 డిసెంబర్ నాటికి పోలవరం పూర్తి చేస్తామని.. గతంలో ఇరిగేషన్ శాఖా మంత్రిగా ఉన్న అనిల్ కుమార్ యాదవ్ ప్రకటించారని పేర్కొన్నారు మంత్రి అంబటి రాంబాబు. కాగా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడంలో ప్రజలను జగన్ సర్కార్ మోసం చేస్తోందని జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ఆరోపించిన విషయం విదితమే. ప్రాజెక్టును పూర్తి చేయాలన్న చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి లేదన్న ఆయన.. కేవలం రాజకీయంగా బురద జల్లేందుకు ప్రాజెక్టు అంశాన్ని వాడుకుంటున్నారనే విషయం కేంద్ర మంత్రి షెకావత్‌తో సమావేశం సందర్భంగా తెలిసి అవాక్కయ్యామన్నారు. ఇక, త్వరలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ పోలవరంలో పర్యటిస్తారని ప్రకటించిన ఆయన.. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అరాచకాలు, రాజ్యాంగ ఉల్లంఘనలు, శాంతి భద్రతలు క్షీణించడం వంటి విషయాలను.. పవన్ కల్యాణ్ ఢిల్లీ పర్యటనలో బీజేపీ పెద్దల దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపిన విషయం తెలిసిందే.

**బాబు వెళ్లమంటేనే వారాహి బ్యాచ్ ఢిల్లీ టూర్..**

ఈ మధ్యే హస్తినలో పర్యటించారు జనసేన అధినేత పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్ అయితే, వారి పర్యటనపై స్పందించిన మంత్రి అంబటి సెటైర్లు వేశారు. వారాహి బ్యాచ్ ఢిల్లీ టూర్‌కు వెళ్లింది అని ఎద్దేవా చేశారు.. చంద్రబాబు వెళ్లమంటే వారు వెళ్లారని అందరికీ తెలుసన్న ఆయన.. బీజేపీతో విడాకులు తీసుకోవటానికి వెళ్లాడా? లేక టీడీపీతో విడాకులు తీసుకుంటానని చెప్పడానికి వెళ్లాడా? అని ప్రశ్నించారు. వైసీపీ వ్యతిరేక ఓటు చీలకుండా ఉండటానికి పవన్ కల్యాణ్ ఒక రాజకీయ పార్టీ పెట్టాడు అని మండిపడ్డారు. పవన్‌కు కావాల్సిన ప్యాకేజి చంద్రబాబు దగ్గర ఉంది.. చంద్రబాబు పల్లకి మోసే వ్యూహాన్ని నాదెండ్ల మనోహర్ అమలు చేస్తున్నారు అంటూ ఫైర్ అయ్యారు. అసలు, 175 సీట్లులో పోటీ చేసే దమ్ము చంద్రబాబుకు ఉందా? అంటూ సవాల్ విసిరారు మంత్రి అంబటి రాంబాబు. ఇక, సింగిల్‌గా పోటీ చేసే ధైర్యం తనకు లేదని చంద్రబాబు ఒప్పుకున్నారని కామెంట్ చేశారు అంబటి చంద్రబాబు. నిర్దేశం మేరకే పవన్ ఢిల్లీ టూరని విమర్శించారు. చంద్రబాబును సీఎం చేసేందుకు పవన్ పార్టీ పెట్టారా? అని ప్రశ్నించారు. మరోవైపు.. జనసేన పార్టీ గ్రాఫ్ రోజురోజుకు పడిపోతుందన్న ఆయన.. పోలవరం ప్రాజెక్టుపై నాదెండ్ల మనోహర్ అజ్ఞానంతో మాట్లాడుతున్నారని విమర్శించారు.

## ఢిల్లీలో పవన్ పనులు హాస్యాస్పదం..

(మొదటిపేజీ తరువాయి)

వైఎస్సార్సీపీ ఎంపీ మార్గాని భరత్ రామ్ సీరియస్ కామెంట్స్ చేశారు. పవన్ చేసే పనులన్నీ హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. చంద్రబాబు, పవన్ ఇద్దరిలో విశ్వసనీయత అనేది లేదు అంటూ వ్యాఖ్యలు చేశారు. కాగా, ఎంపీ భరత్ గురువారం మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు అజెండాను పవన్ మోసుకుని ఢిల్లీ పెద్దల దగ్గరికి వెళ్లాడా? లేక వాళ్లే పిలిచారా అన్న విషయం తెలియాలి. ఢిల్లీ పెద్దలు పవన్కు అపాయింట్మెంట్ ఇవ్వట్లేదని ప్రజలు అనుకుంటున్నారు. తెలుగు ప్రజల గౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టొద్దు అంటూ హితవు పలికారు. పవన్ ఢిల్లీలో చేసే పనులన్నీ హాస్యాస్పదంగా ఉన్నాయి. మిత్రధర్మం పాటించని మిమ్మల్ని ఢిల్లీ పెద్దలు ఎందుకు గౌరవిస్తారు. చంద్రబాబు, పవన్ ఇద్దరిలో విశ్వసనీయత అనేది లేదు. బీజేపీ సిట్టింగ్ ఎమ్మెల్సీ మాధవ్‌ను మిత్రపక్షంగా గెలిపించే ప్రయత్నం కూడా జనసేన చేయకపోవడం విచిత్రంగా ఉంది. గతంలో పవన్.. పాచిపోయిన లడ్డులు అని చెప్పి బీజేపీ పెద్దలతో మళ్లీ ఏ ముఖం పెట్టుకుని ఢిల్లీ వెళ్లాడో చెప్పాలి. పవన్ రెండు కనిపిస్తే.. మళ్లీ మూడు రోజులు కనిపించడు. చంద్రబాబుపై ప్రజలకు ఏ మాత్రం నమ్మకం లేదు. రాష్ట్రంలో ప్రజలందరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తమ నమ్మకం, తమ భవిష్యత్తు అని అనుకుంటున్నారు. ఇదే నినాదంతో ఎన్నికలకు వెళ్లబోతున్నాము. రాష్ట్రంలో ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయి. డీబీటీ ద్వారా రెండు లక్షల కోట్ల రూపాయలు లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారు. రాష్ట్రంలో మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిన సీఎం వైఎస్ జగన్ మాత్రమే. చంద్రబాబు హయాంలో ఏ రకమైన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు కూడా అమలు జరగలేదు. 2024లో కూడా సీఎం జగనే ముఖ్యమంత్రి అవుతారు. రాష్ట్ర ముఖచిత్రం కూడా మారుతుంది' అని అన్నారు.

## రూ.50 లక్షల కోట్ల బడ్జెట్‌ను.. 12 నిమిషాల్లోనే ఆమోదిస్తారా..!

- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: ప్రధాని ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువల గురించి చాలా మాట్లాడుతుందే తప్పా.. పాటించదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. పార్లమెంటు హౌస్ నుంచి విజయ్ చౌక్ వరకు నిర్వహించిన 'తిరంగా మార్చ్' అనంతరం మీడియా సమావేశంలో ఖర్గే మాట్లాడారు. బడ్జెట్ సెషన్‌ను సాఫీగా నడవనీయకుండా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆరోపించారు. 'పార్లమెంట్‌లో ఎటువంటి చర్చ లేకుండానే.. 12 నిమిషాల్లోనే రూ.50 లక్షల కోట్ల బడ్జెట్‌ను ఆమోదించింది. పైగా ప్రతిపక్ష పార్టీలు సహకరించడం లేదని ఆరోపించింది' అని బీజేపీ ప్రభుత్వంపై ఖర్గే మండిపడ్డారు. అధికార పార్టీ ప్రతినిధులే పార్లమెంటులో గందరగోళం సృష్టించారని ఆరోపించారు. ప్రతిపక్షాలకు సభలో మాట్లాడేందుకు అనుమతించలేదని, తన 52 ఏళ్ల ప్రజాజీవితంలో ఎప్పుడూ ఇలా జరగలేదని పేర్కొన్నారు. అదానీ వ్యవహారంపై పార్లమెంటులో సమాధానం చెప్పకుండా.. బ్రిటన్‌లో చేసిన వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ అందరి దృష్టిని మళ్లించిందన్నారు.

**లోక్‌సభ నిరవధిక వాయిదా..**

అంతకుముందు లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడింది. గురువారం సభ ప్రారంభమైన వెంటనే.. అదానీ వ్యవహారంపై జేపీసీ విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్, డీఎంకే ఎంపీలు నినాదాలు చేస్తూ వెల్లోకి దూసుకొచ్చారు. ఇలాంటి ప్రవర్తన పార్లమెంటరీ వ్యవస్థకు విరుద్ధమని.. సభకు, దేశానికి మంచిది కాదని స్పీకర్ వారించారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో.. సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ తెలిపారు. దీంతో షెడ్యూల్ ప్రకారం లోక్సభ బడ్జెట్ సమావేశాలకు తెరపడింది.

# 2024లో మాదే విజయం..

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ప్రతిపక్షాలు బాద్‌షాహీ ధోరణితో పేదలు, బలహీన వర్గాల ప్రజలను అణిచివేస్తున్నాయని ఘాటు వ్యాఖ్యలు చేశారు. తమ అస్తిత్వం కోసం పోరాడుతున్న కొన్ని పార్టీలు.. బీజేపీకి వ్యతిరేకంగా కుట్రలు పన్నుతూనే ఉన్నాయంటూ కాంగ్రెస్‌పై పరోక్షంగా వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. భారతీయ జనతా పార్టీ 44వ వార్షికోత్సవం సందర్భంగా పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రధాని మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. భక్తి, బలం, సాహసాలతో గౌరవం పొందిన హనుమాన్ నుంచి బీజేపీ స్ఫూర్తి పొందినట్లు చెప్పారు. హనుమాన్ మాదిరిగా సవాళ్లపై పోరాటం చేయడమే కాకుండా దేశ సంక్షేమం కోసం కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు వెనుకాడబోమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. 'బీజేపీకి.. హనుమాన్ ద్వారా మరో ప్రేరణ లభిస్తుంది. రాక్షసులను ఎదుర్కోవటానికి హనుమంతుడు కఠినంగా మారారు. అదే విధంగా అవినీతి, బంధుప్రీతి, శాంతిభద్రతల సమస్యపై అదే విధమైన సంకల్పంతో సామాజిక రుగ్మతల నుంచి దేశానికి విముక్తి కల్పించేందుకు బీజేపీ కృషి చేస్తోంది. హనుమాన్ జీవితమంతా చూస్తే.. ఆయనకు విజయాలను అందించటంలో 'కెన్ డూ' (నేను చేయగలను) వైఖరి ముఖ్యపాత్ర పోషించింది. హనుమాన్ అందరి శ్రేయస్సు కోసం పని చేశారు. తన కోసం ఏదీ చేసుకోలేదు. దీనినే ప్రతి బీజేపీ కార్యకర్త స్ఫూర్తిగా తీసుకోవాలి' అని మోదీ అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలపై ప్రధాని మోదీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రతిపక్షాలు విశాల దృక్పథంలో ఆలోచించలేకపోతున్నాయని.. వారిది సంకుచిత మనస్తత్వమని విమర్శించారు. 'వారు చిన్న లక్ష్యాలను పెట్టుకుని వాటితోనే సంతృప్తి చెందుతున్నారు. బీజేపీ పెద్ద కలలు కనడమే కాకుండా వాటిని నెరవేర్చుతోంది. 2014లో మేం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వారు పేదలు, అణగారిన వర్గాలు, అణచివేస్తూనే ఉన్నారు. ఆర్టికల్ 370 రద్దు అవుతుందని వారు కనీసం ఊహించలేదనుకుంటా. బీజేపీ సాధిస్తున్న వృద్ధిని చూసి వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇప్పుడు వారు మరింత నిరాశకు లోనవుతున్నారు. అందుకే ఏం చేయాలో అర్థం కాక నాకు సమాధి కడతామని బహిరంగంగానే చెబుతున్నారు' అంటూ దుయ్యబట్టారు. తమది కుటుంబ పార్టీ కాదని.. బీజేపీకి పార్టీ కంటే దేశమే ముఖ్యమని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే బీజేపీ అతిపెద్ద పార్టీ అని.. 2024లో ఎన్నికల్లో తమని ఎవరూ ఓడించలేరని ప్రధాని ధీమా వ్యక్తం చేశారు.

## ఆయనది నాలుకా, తాటిమట్టా?

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీకి ఎందుకు వేయాలి ఓటు అని ప్రశ్నలు గుప్పించారు. పేదవాడి ఆకలి మీద రాజకీయాలు చేసే చరిత్ర చంద్రబాబుది అంటూ మండిపడ్డారు. దేశంలోనే అత్యధిక జీడీపీ పెరిగిన రాష్ట్రం ఏపీ అని.. ప్రజల్లో కొనుగోలు శక్తిని పెంచిన ప్రభుత్వం మాది అంటూ బొత్స సత్యనారాయణ అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమం ఈ నాలుగు అంశాల్లో వైసీపీ ప్రభుత్వం ఎక్కడా రాజీపడదన్నారు. రాజకీయాలకు అతీతంగా ఈ నాలుగు అంశాలను అమలు చేస్తామని ఆయన తెలిపారు. చంద్రబాబు పనైపోయిందని.. గ్రామాల్లోకి వెళ్లి ఓటు అడిగే ధైర్యం ఆయనకు ఉందా అంటూ బొత్స ఎద్దేవా చేశారు. జనసేన ఓ సెలెబ్రెటీ పార్టీ.. రాజకీయ పార్టీకి ఉండాల్సిన సిద్ధాంతాలు ఆ పార్టీకి లేవన్నారు. గత ఏడాది జరిగిన పరిణామాలతో ఈ ఏడాది పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. పరీక్షలను కూడా రాజకీయాలకు వాడుకుందామనుకుంటే అంతకన్నా నీచమైన పని ఉండదన్నారు.

## ఒక్కరికి సీటిస్తామంటే.. నలుగురు ఎమ్మెల్యేలు వస్తామంటున్నారు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న ఎమ్మెల్యేల జాబితా చెప్పాలని మంత్రులు డిమాండ్ చేయడం పిచ్చితనమని విమర్శించారు. వైసీపీలో ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రజా వ్యతిరేకతతో మంత్రులు ధర్మాన, బొత్స సత్యనారాయణ ఉద్దేశపూర్వకంగానే బ్యాలెన్స్ తప్పుతున్నారని ఎద్దేవా చేశారు. కనీసం ఒక కానిస్టేబుల్‌ను కూడా ట్రాన్స్‌ఫర్ చేయించుకోలేక పోతున్నామనే బాధ ధర్మాన, బొత్సలకు ఉందని ఆక్షేపించారు. గతంలో ఇద్దరూ ఎప్పుడు మంత్రి అయినా వారికి స్వయం ప్రతిపత్తి ఉండేది, కానీ ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు మహిళల ముందు మీసాలు మెలేస్తున్నారు.. తొడ కొడుతున్నారు. మగాళ్లను పోరంబోకులు అంటూ విపరీత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.

## మళ్లీ సుప్రీం మెట్లెక్కిన అమరావతి రైతులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: ఆర్–5 జోన్ వ్యవహారంపై అమరావతి ప్రాంత రైతులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రైతులు దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) ధర్మాసనం ఎదుట సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు ప్రత్యేకంగా ప్రస్తావించారు. దీనిపై ఈనెల 14న విచారణ చేపడతామని సుప్రీంకోర్టు తెలిపింది. 10న విచారణకు తీసుకోవాలని రైతుల తరపున న్యాయవాది కోరగా.. ఆరోజు కేసుల జాబితా ఇప్పటికే తయారైందని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ తెలిపారు. అందుకే ఈ పిటిషన్‌ను 14న విచారణకు తీసుకుంటామని చెప్పారు. అమరావతి రైతులు ఆర్–5 జోన్‌పై ఇప్పటికే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఉన్నత న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రాష్ట్రంలో ఏ ప్రాంతానికి చెందిన పేదలకైనా రాజధాని అమరావతిలోని 900 ఎకరాల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు వీలుగా బృహత్ ప్రణాళిక(మాస్టర్ ప్లాన్)లో మార్పులు చేస్తూ ఆర్–5 జోన్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయాన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

## పరాజయాలు ఎదుర్కొంటేనే విజయం తథ్యం

(మొదటిపేజీ తరువాయి)

బాల్యంలో లియోనార్డో డావిన్సీ నా రోల్ మోడల్. ఇవాళ నేను విఫలమైతే.. రేపు విజయం సాధిస్తా. ఇంటర్ పరీక్షల్లో నా స్నేహితులు చిట్టీలు తీసుకెళ్లేవారు. ఫెయిలైనా సరే కాపీ కొట్టకూడదని నేను అనుకున్నా. ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యా. కానీ, నైతికంగా నేను విజయం సాధించా. మీ సామర్థ్యాలకు తగిన ఉద్యోగాలు రావాలని కోరుకుంటున్నాను. కళ.. ఏ రాష్ట్రానికి చెందినవారినైనా కలుపుతుంది. మానవత్వం, సంస్కృతి ఒక్కటే మనుషులను ఏకం చేస్తుంది. అందుకే నాటు నాటు పాటకు ప్రాంతాలకు అతీతంగా పాదం కదిపారు.

## నేటి నుంచి 'జగనన్నే మా భవిష్యత్తు'

అమరావతి, ఏప్రిల్ 6 (మనం న్యూస్): 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేశామని వైఎస్సార్సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి వెల్లడించారు. గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, రేపటి నుంచి ఏడు లక్షల మంది గృహ సారథులు కోటి 60 లక్షల ఇళ్లకు వెళ్తారన్నారు. ''మమ్మల్ని మా జగన్ అన్న పంపారు అని చెప్పి పది నిమిషాలు మాట్లాడతారు. జగన్ ఇచ్చిన మెసేజ్ వారికి అందించి వెళ్తారు. అన్ని కులాలు, మతాలు, ఇతర రాజకీయ కుటుంబాలను కూడా కలుస్తారు. గతంలో పాలన ఎలా జరిగింది? ఇప్పుడు ఎలా జరుగుతోందో? వారి అభిప్రాయాలు తీసుకుంటారు. దేశంలో ఎవరూ చేయని కార్యక్రమం మేము చేస్తున్నాం. మీకు ఈ నాలుగేళ్లలో ప్రభుత్వ సాయం అందితేనే తనకు ఓటేయమని జగన్ అంటున్నారు. ప్రపంచంలో ఎవరూ ఇలా ధైర్యంగా అడగలేరు'' అని సజ్జల అన్నారు. ''ఏ నెలలో ఏ సంక్షేమం అందించబోతున్నది కూడా అసెంబ్లీ సాక్షిగా సీఎం ప్రకటించారు. అప్పట్లో జన్మభూమి కమిటీ జలగలు ప్రజల్ని పీడించాయి. ఇప్పుడు లంచాలు లేకుండా అర్హతే ప్రమాణంగా సంక్షేమం అందిస్తున్నాం. గృహ సారథులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లినప్పుడు ఐదు ప్రశ్నలు వేస్తారు. వారి నుండి జగన్ పాలనపై అభిప్రాయాలు తెలుసుకుంటారు'' అని సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

## శ్రీవారి ఆలయంలో వైభవంగా పౌర్ణమి గరుడ సేవ






తిరుమల, ఏప్రిల్ 6, మనం న్యూస్: తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం రాత్రి 7 గంటలకు గరుడ వాహన సేవ ప్రారంభమైంది. సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడునిపై ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు.గరుడ వాహనం – సర్వపాప ప్రాయశ్చిత్తం పౌరాణిక నేపథ్యంలో 108 వైష్ణవ దివ్యదేశాలలోనూ గరుడసేవ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. గరుడవాహనం ద్వారా స్వామివారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడని తెలియజెబుతారు. అంతేగాక జ్ఞానవైరాగ్య ప్రాప్తికోరే మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటికి తెలియజెబుతున్నాడు.వాహన సేవలో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో రమేష్బాబు, విజిఓ బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవం

- మండలంలో బీజేపీ రెండు వర్గాల పోరు
- రెండుగా విడిపోయి బీజేపీ సంబరాలు



చంద్రగిరి, ఏప్రిల్ 6, మనం న్యూస్: చంద్రగిరి పట్టణంలో ఘనంగా బిజెపి 44వ పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. బిజెపి నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి విడివిడిగా రెండు చోట్ల కార్యక్రమం నిర్వహించడం సర్వత్ర చర్చాంశమైంది. చంద్రగిరి నియోజకవర్గం ఇంచార్జ్ మేడసాని పురుషోత్తం నాయుడు ఆదేశాల మేరకు మండల ఇంచార్జ్ మురళి రెడ్డి ఆధ్వర్యంలో చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద , మండల పార్టీ అధ్యక్షుడు దొరస్వామి ఆధ్వర్యంలో వెంకటంపేట వద్ద భారతీయ జనతా పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి మహిళ మోర్చా కార్యవర్గ సభ్యురాలు మేడసాని అన్నపూర్ణ విచ్చేశారు.కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా పార్టీ పతాకాన్ని మేడసాని అన్నపూర్ణ చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో వెంకటేష్ యాదవ్, ప్రియాంక,రమేష్ యాదవ్, మల్లికార్జున, నవీన్ యాదవ్, వంశి యాదవ్, గోపి కృష్ణ నాయుడు, అజిత్ మరియు భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫ్లిప్‌కార్ట్ వ్యాపారి దివాస్ ప్రారంభం



తిరుపతి, ఏప్రిల్ 6, మనం న్యూస్: కిరాణా సభ్యుల కోసం అన్ని ఫ్లిప్కార్ట్ హోల్సేల్లో వ్యాపారి దివస్ ప్రారంబించినట్లు ఆ సంస్థ బిజినెస్ హెడ్ కోటేశ్వర్ ఎల్,ఎన్ తెలిపారు.గురువారం రేణిగుంట రోడ్డు లో ఉన్న షో రూం లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫ్లిప్కార్ట్ గ్రూప్ డిజిటల్ బీ2బి ప్లాట్ఫారమ్ తన సభ్యులకు పొదుపు, లాభాలను వేగవతం చేసే లక్ష్యంతో కెంపెనీ వార్షిక ఫ్లాన్షిప్ ఈవెంట్ అయిన వ్యాపారి దివస్ ను ఏఫ్రిల్ 3 నుంచి 9వ తేది వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ క్యాంపెయిన్ అన్ని ఫ్లిప్కార్ట్ హోల్సేల్ స్టోర్లలో,ఆన్లైన్ ప్లాట్ఫామ్లో వినియోగించుకో వచ్చన్నారు. స్టేపుల్స్,పర్సనల్, హోమ్ కేర్,ఫుడ్, పానీయాలతో సహా అనేక వర్గాలలలో అద్భుతమైన డిలు అందిస్తుందన్నారు. టుటేగా పాయిదే రికార్డ్ అనే ట్యాగ్ లైన్తో,డిస్కవరీ జోన్, వ్యాపారి ఆవన్ స్పెషల్,జైవన్ గెట్ వన్ ఆఫర్, ఫ్లాష్ డీల్స్ తదితర అనేక ఆకర్షణీయమైన ఆఫర్లను క్యాంపెయిన్ లో అందిస్తున్నామన్నారు. దీనితో పాటు మొదటిసారిగా ఫ్లిప్కార్ట్ హోల్సేల్ యాప్,ఇన్–స్టోర్ కొనుగోళ్లు రెండింటిపై సభ్యులకు రూ.9,000 వరకు హామీ ఇచ్చే క్యాష్బ్యాక్ ఉంటుందన్నారు.దీన్ని ప్రతి కిరాణా సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఘనంగా స్ప్రింగ్ బోర్డ్ అకాడమీ వార్షికోత్సవం

- విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చి దిద్దాలి
- మేయర్ డాక్టర్ శిరీష
- తక్కువ ఖర్చుతో అత్యున్నత విద్య
- ఏంబియూ రిజిస్టర్ సారధి




తిరుపతి, ఏప్రిల్ 6, మనం న్యూస్: విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చి దిద్దడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కీలకపాత్ర పోషించాలనీ మేయర్ శిరీష అన్నారు.తిరుపతి నగరంలోని స్థానిక మహతి ఆడిటోరియంలో స్ప్రింగ్ బోర్డ్ అకాడమీ మొదటి వార్షికోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ముందుగా ముఖ్య అతిథులను వేదిక పైకి ఆహ్వానించి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదివినటువంటి విద్యార్థులు భవిష్యత్తు బంగారు భవిష్యత్తుగా మారుతుందని,ఈ ఇన్నోవేషన్ కాలంలో టెక్నాలజీకి తగ్గట్టుగా మనం మారాలని, పిల్లలందరూ పై స్థాయిలో ఉండాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుకోవాలి అని మేము ఆకాంక్షిస్తున్నాము అని తెలిపారు.జీవితంలో విజయం సాధించాలంటే విద్యార్థులు చిన్నప్పటి నుండే కృషి చేయాలని సూచించారు.విద్యార్థులు అందరూ చక్కగా చదువుకొని గొప్ప స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. విద్యాదానం మహాదానం కావున మధ్యతరగతి వారికి తక్కువ ఖర్చుతో అత్యున్నత విద్యను ఈ పాఠశాల ద్వారా అందించడం చాలా గర్వకారణంగా ఉందని తెలిపారు.మోహన్ బాబు యూనివర్సిటీ రిజిస్టర్ సారథి,స్ప్రింగ్ బోర్డు డైరెక్టర్ అరవింద్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పుడు నుంచే భక్తిశ్రద్ధలతో విద్యను అభ్యసించాలని ప్రతి ఒక్క విద్యార్థి ఉన్నత చదువులు చదివి గొప్ప స్థాయిలో ఉండాలని కోరుకుంటున్నామని వారు తెలిపారు.వారికి నాణ్యమైన విద్యను అందించడమే ధ్యేయంగా తాము విద్యాసంస్థలను నిర్వహిస్తున్నట్లు ఆయన అన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలని తగు జాగ్రత్తలు తీసుకొని ఉండాలని కోరారు. తమ పాఠశాలలో నాణ్యమైన విలువతో కూడిన విద్యను అందించడమే కాకుండా దేశ భవిష్యత్ గురించి తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందన్న మాటకు సజీవ సాక్ష్యంగా నిలుస్తుందని చెప్పారు.

మా పాఠశాలలో అగ్రికల్చరల్ డే,క్రిస్మస్, సంక్రాంతి అలా ప్రతి పండు గను విద్యార్థుల చేత చేపించడం మా ఆనవాయి తీ.విద్యలో పాటు గా క్రీడలలో తర్ఫీదు ఇచ్చి దేశ పౌరులుగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు.ఇందు కో సం తల్లిదండ్రులు కూడా సహకరించాలని వేడుకున్నా రు.విద్యార్థులు విద్యార్థి దశలోనే ఉత్తమ లక్షణాలను నిర్దేశించుకుని వాటిని సాధించడానికి కృషి చేయాలన్నారు.చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె అరుణకుమారి, మంచు విష్ణు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సునీల్ చక్రవర్తి, ఏవో హేమాద్రి నాయుడు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో మాస్ కాపీయింగ్

మదనపల్లె, ఏప్రిల్ 6, మనం న్యూస్ క్రైమ్: ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో జోరుగా మాస్ కాఫీయింగ్ జరుగుతున్నట్లు ఆరోపణలు వినబడుతున్నాయి. పరీక్షలు చూసి రాసేందుకు గానూ ఒక్కో విద్యార్థి నుంచి రూ. వెయ్యి చొప్పున నగదు వసూలు చేసినట్లు సమాచారం. దీంతో విద్యార్థులు ఓపెన్ గానే పరీక్ష రాస్తున్నట్లు ప్రచారం జోరుగా జరుగుతోంది. కాగా ఈనెల మూడోతేదీ నుంచి మదనపల్లెలో ఓపెన్ టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు జరుగుతున్నాయి. స్థానిక కోటబడి, బాపూజీ, వివేకానంద మున్సిపల్ హైస్కూల్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, జడ్పీ హైస్కూల్లో రెండు కేంద్రాలతో కలిపి మొత్తం ఆరు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతున్నాయి. అర్థాంతరంగా చదువు ఆగిపోయి, మధ్యలో మానేసిన విద్యార్థుల కోసం ప్రభుత్వం ఓపెన్ పరీక్షలను ప్రవేశపెట్టింది. కాగా రెగ్యులర్ టెన్త్ తరహాలో ఓపెన్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. అయితే ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల, కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు విద్యార్థులను పరీక్షలకు సమాయత్తం చేసేక్రమంలో ఓపెన్ గానే పరీక్షలు రాయించి, అందరినీ పాస్ చేయాలనే ఉద్దేశ్యంతో ఒక్కో విద్యార్థి నుంచి రూ. వెయ్యి చొప్పున నగదు వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఈ మొత్తాన్ని విద్యాశాఖ ఉన్నత అధికారులకు ముట్టచెప్పి వారి అనుమతితో డిపార్ట్ మెంట్ అధికారులు, ఎగ్జామినేషన్ చీఫ్ లతో సమన్వయం చేసుకుని కేంద్రాల్లో ఓపెన్ గా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినబడుతున్నాయి. కిందిస్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి అధికారుల వరకు.. అందరికీ నగదు వాటాలు పంపిణీ చేసి ఓపెన్ పరీక్షలు రాయిస్తున్నట్లు సమాచారం. ఎలాంటి సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ లేకుండా ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా పరీక్షలు నిర్వహిస్తూ.. మాస్ కాఫీయింగ్ కు తెరలేపారు. దీంతో విద్యార్థులు కూడా ధైర్యంగా పరీక్షలు రాస్తున్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. పిల్లల్లో ఎలాంటి ఒత్తిడి, ఆందోళన లేకుండా పరీక్షలకు హాజరు అవుతున్నారన్నారు. ముఖ్యంగా ఓపెన్ గా పరీక్షలు రాస్తుండడంతో బాగా చదివిన, విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. చదివిన విద్యార్థులు టెన్షన్ పడుతుండగా, చదవనివారు హాయిగా పరీక్షలు రాస్తున్నారు. మాస్ కాఫీయింగ్ ఇలాగే కొనసాగితే విద్యార్థుల భవిష్యత్తు ఏంటని పిల్లల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఆశించిన రీతిలో మార్కులు రాకపోగా, ఉన్నత చదువుల్లో ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి మాల్ కాపీయింగ్ నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పైగా మాస్ కాఫీయింగ్ కు పాల్పడిన విద్యార్థులపై. అదేవిధంగా వారికి సహకరించిన డిపార్ట్ మెంట్ అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై డీవైఈవో కృష్ణప్పను వివరణ కోరగా ఓపెన్ టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. ఎక్కడా మాస్ కాఫీ యింగ్ కు చోటివ్వకుండా డిపార్ట్ మెంట్ అధికారులను అప్రమత్తం చేస్తూ పలు సూచనలు, సలహాలు ఇస్తున్నామన్నారు. మాస్ కాఫీయింగ్ పై ఆరోపణలు వస్తున్నాయన్నారు. అవి కేవలం ఆరోపణలే తప్ప.. నిజాలు కాదన్నారు. ఎవరైనా కాఫీయింగ్కు పాల్పడితే సహించేది లేదన్నారు. వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## చిత్తూరు జిల్లా ఉప రవాణా అధికారిగా నిరంజన్ రెడ్డి




చిత్తూరు, ఏప్రిల్ 6, మనం న్యూస్: చిత్తూరు జిల్లా ఉప రవాణా శాఖ అధికారిగా నిరంజన్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. డిటిసి బసి రెడ్డి, అధికారులు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జె టిసి రెడ్డి మాట్లాడుతూ చిత్తూరు జిల్లా ఉప రవాణా శాఖ కార్యాలయంను ఇటీవలే కంప్యూటరైసెడ్ చేయడం జరిగిందన్నారు. అధికారులు కార్యాలయం సిబ్బంది నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన నిరంజన్ రెడ్డికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఇంతకాలం తనకు అన్ని విధాల తోడ్పాటు అందించిన అధికారులకు కార్యాలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడ కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం కమిషనర్ ను కలిసిన అనంతరం పదోన్నతి పొందిన రాయలసీమ జోన్ జెటిసిగా తిరుపతి ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ గతంలో నంద్యాలలో =ూ ఆర్ టి ఓ గా పనిచేస్తూ పదోన్నతిపై చిత్తూరు జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టానని తెలిపారు. గతంలో కొనసాగిన విధి విధానాలను యధాతథంగా కొనసాగిస్తానన్నారు. ప్రజలకు ఏ సమస్య అయినా నేరుగా కార్యాలయంలో వచ్చి సంప్రదించి వాటి సమస్యలను పరిష్కరించుకోవచన్నారు. జిల్లా ఉన్నతాధికారులు అందరి సహకారంతో మరింత బాధ్యతగా తమ విధులను నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎంబీఐలు శివారెడ్డి, ఆర్ వి.మధుసూదన్ వాసు దేవ రెడ్డి, రాజేశ్వరరావు, వి. మధుసూదన్, రవీంద్ర నాయక్, భూసన్ రెడ్డి, ఏ ఎమ్ వి ఐ లు శివకుమార్,ఇస్మాయిల్ ఖాన్, శ్వేత ఏఓ. చక్రపాణి, కార్యాలయ సిబ్బంది టిటిసి కి ఘన స్వాగతం పలికారు.

## న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తా

శ్రీకాళహస్తి , ఏప్రిల్ 6, మనం న్యూస్: శ్రీకాళహస్తి పట్టణంలోని న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ కృషి చేస్తానని శ్రీకాళహస్తి బార్ అసోసియేషన్ అధ్యక్షులు పొన్నేపల్లి వెంకటాచలపతి అన్నారు. గురువారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా అధ్యక్షులుపొన్నేపల్లి వెంకటా చలపతి మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి కృషి చేస్తానని తెలిపారు. బార్ అసోసియేషన్ లో గ్రంథాలయం ఏర్పాటు, సొంత బార్ అసోసియేషన్ భవన నిర్మాణం కోసం, జిల్లా కోర్టు నందు సదుపాయాల సౌకర్యం కోసం కృషి చేస్తానని తెలిపారు. న్యాయవాదులకు ఏ కష్టం వచ్చినా తన కష్టంగా భావించి వారికి అండగా ఉంటానని తెలిపారు. అనంతరం ప్రధాన కార్యదర్శి వీకే రాజేష్ రాయల్, మాజీ అధ్యక్షులు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుమ్మడి శేఖర్, ట్రెజరర్ పి. దుష్యంత్ బాబు, బార్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి లక్ష్మీపతి రెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని దుశ్శాలువులతో పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



## 1.60 లక్షలతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



గుడిపాల, ఏప్రిల్ 6, మనం న్యూస్: గుడిపాల మండలం రామభద్రాపురం గ్రామ పంచాయతీకి చెందిన దాయంవారిపల్లి నందుగల త్రాగునీటి బోరు మోటర్ కు సర్వీసు మరియు ట్రాన్స్ఫర్మర్ జలజీవన్ మిషన్ నిధులతో 1.60 లక్ష అరవై వేల రూపాయలతో గ్రామపంచాయతీ సర్పంచ్ గోళ్ళ హరిణి హేమాద్రి నాయుడు ట్రాన్స్ఫర్మర్ను ఏర్పాటు చేశారు. .ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ట్రాన్స్ఫర్ లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాము డాయం వారి పల్లి. గ్రామం త్రాగునీటి సమస్యను పరిష్కరించిన సర్పంచ్ కి కృతజ్ఞతలు తెలిపారు

## చిరుధాన్యాల సాగుతోనే రైతులకు అధిక లాభం




- జిల్లా అధికారి లక్ష్మి ప్రసన్న

రామకుప్పం, ఏప్రిల్ 6, మనం న్యూస్ : రామకుప్పం మండలంలో గురువారం చిత్తూరు జిల్లా వనర్లు కేంద్రం అధికారిణి లక్ష్మిప్రసన్న పరివేక్షించి జాతీయ ఆహార భద్రత మిషన్ ద్వారా రైతులకు చిరు దాన్యపంటలపై అవగాహన కల్పించారు జిల్లా అధికారిణి లక్ష్మి ప్రసన్న మండల పరిధిలోని గోరివిమాకులపల్లి గ్రామపంచాయితీలోని బాల్దారు పెద్దగేరిగపల్లి గోరివిమాకుల పల్లి గ్రామాల్లో రైతులు పండించిన రాగి సాగును పరిశీలించి రైతులకు సూచనలు సలహాలు ఇచ్చారు అలాగే క్యాబేజి మిరప పంటలను సందర్శించి లీటరు నీటిలో 5 మిల్లీలు వేపనూనే కషాయాన్ని పిచికారి చేసి పంటసాగులో పసుపు నీలం జిగురు అట్టలను కట్టాలని రైతులకు సూచించారు ఈ కార్యక్రమంలో మండల వ్యసాయాధికారిణి కె. అమృత ఎం. పి. ఈ. ఓ అమరేష్ వి. ఎస్. ఏ పరమేష్ జడ్. బి. ఎన్. ఏప్ సి ఏ రామచంద్ర మరియు రైతులు పాల్గొన్నారు

## ఘనంగా 44వ బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

బుచ్చినాయుడు కండ్రిగ, ఏప్రిల్ 6, మనం న్యూస్: మండలంలో భారతీయ జనతా పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు హరిబాబు రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండాను గురువారం ఎగరవేశారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షులు మాట్లాడుతూ 2024వ సంవత్సరంలో ముఖ్యమంత్రి పదవి బిజెపికి దక్కుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. పార్టీ అధికారంలోకి రాగానే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు తేజ, ముని కుమార్, మధు, జిల్లా యువ మోర్చా సోషల్ మీడియా ఇన్చార్జి శివకుమార్, జిల్లా మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు అంకమ్మ, కిసాన్ మోర్చామండల అధ్యక్షుడు తిరుపాలు, మండల ట్రెజరర్ లోకనాదం, మండల మహిళా మోర్చా సభ్యురాలు లక్ష్మి, సీనియర్ నాయకుడు రాజేష్ మరియుకార్యకర్తలు పాల్గొనడం జరిగింది.



# రాజ్యాంగ రక్షణ రణభేరికి తరలిరండి

మదనపల్లె, ఏప్రిల్ 6, మనం న్యూస్: విడుదలై చిరుతైగల్ కట్చి (వీసీకే పార్టీ) ప్రథమ రాష్ట్ర మహాసభను పురస్కరించుకొని, ఈనెల 8వ తేది మదనపల్లె పట్టణంలోని బి.టి. కళాశాల గ్రౌండ్ నందు రాజ్యాంగ రక్షణ రణభేరి పేరుతో నిర్వహిస్తున్న ప్రగతిశీల శక్తుల ఐక్యతా మహాసభకు దేశ ప్రేమికులంతా స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేయాలని, ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీయం. శివప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక బాస్ కార్యాలయం వద్ద శివప్రసాద్ వీసీకే పార్టీ నాయకులతో కలిసి,రాజ్యాంగ రక్షణ రణభేరి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ఎనిమిదేళ్ల బీజేపీ పాలనలో దేశం తిరోగమనం వైపు పయనిస్తోందని, రాజ్యాంగ మూల సూత్రాలను తుంగలో తొక్కి మోదీ ప్రభుత్వం అంబానీ, అదానీలకు దేశ సంపదను దోచి పెడుతోందని విమర్శించారు. ప్రజలందరికీ సమాన అవకాశాలను, సమాన గౌరవాన్ని, మానవ హక్కులను ప్రసాధించిన భారత రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను రద్దుచేసి మళ్ళీ మనుస్మృతిని భారత రాజ్యాంగంగా తీసుకొచ్చి చాతుర్వర్ణ సిద్ధాంతాన్ని అమలు చేయాలని బీజేపీ కుటిల యత్నం చేస్తోందని అన్నారు. అధికారాన్ని పదిల పర్చుకోవడం కోసం కుల, మత హింసను ప్రేరేపించి, మతాన్ని, దేశాన్ని రాజకీయ లబ్ది కోసం బీజేపీ వాడుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. విభజన హామీలను గాలికొదిలేసి, నిధుల కేటాయింపులో మొండిచేయి చూపి ఆంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్తును అంధకారం లోకి నెట్టిన బీజేపీని 2024 ఎన్నికల్లో పాతాలంలోకి తొక్కేయాల్సిన అవసరం ఉందని, ఆవైపుగా ప్రజల్ని చైతన్యవంతం చేయడానికే రాజ్యాంగ రక్షణ రణభేరి మహాసభను నిర్వహించడం జరుగుతోందని చెప్పారు. శనివారం మధ్యాహ్నం 2గంటల నుండి జరిగే ఈ సభకు వీసీకే పార్టీ జాతీయ

అధ్యక్షుడు డాక్టర్ తిరుమావళవన్, ప్రజాయుద్ధనౌక గద్దర్, కర్ణాటక మాజీ స్పీకర్ రమేష్ కుమార్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు లతోపాటు పలు ప్రగతిశీల సంఘాలకు చెందిన నేతలు హాజరౌతున్నారని తెలిపారు. రాజ్యాంగ రక్షణను కోరుకొనే దేశప్రేమికులందరూ ఈసభకు స్వచ్ఛందంగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని శివప్రసా ద్ కోరారు. ఈ కార్యక్రమంలో వీసీకే పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముత్యాల మోహన్, రాష్ట్ర గిరిజన సమాఖ్య అధ్యక్షుడు కోనేటి దివాకర్, వీసీకే నాయకులు సొన్నికం టి రెడ్డెప్ప, పెద్దపాలెం రవిశంకర్, తలారి కృష్ణ, బురు జు జనార్దన్, రాయల్ సూర్య, బురుజు రెడ్డిప్రసాద్, గెరివి మల్లేష్, హైదర్, బురుజు చంద్ర, యర్రవారిపల్లి చిన్నా, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా ఆస్పత్రిలో కోవిడ్ ఐసోలేషన్ వార్డు ఏర్పాటు





మదనపల్లె, ఏప్రిల్ 6, మనం న్యూస్: మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రిలో గురువారం కొవిడ్ ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేశారు. మెడికల్ సూపరింటెండెంట్ పద్మాంజలీదేవి, ఆర్ఎంవో దివాకర్ లు ఆస్పత్రిలోని ఐసీయూ కేంద్రంలో 15 పడకలతోఐసోలేషన్ వార్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో బయటరాష్ట్రాల్లో పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయన్నారు. దీంతో ముందస్తు చర్యలలో భాగంగా డీసీహెచ్ఎస్ చంద్రశేఖర్ఆదేశాల మేరకు 15 పడకలతో కొవిడ్ ఐసోలేషన్ వార్డును ఏర్పాటు చేశామన్నారు. ఈ వార్డులో మందులు, సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ముఖ్యంగా కరోనా పాజిటివ్ కేసులను వార్డులో అడ్మిట్ చేసి మెరుగైన వైద్యం.అందిస్తామన్నారు. అలాగే కేసులు పెరిగితే పడకల సంఖ్య పెంచుతామన్నారు. కరోనా బాధితులు ఆందోళనచెందాల్సిన అవసరం లేదన్నారు. బాధితులు ఆస్పత్రిలో చేరి చికిత్స పొందాలన్నారు. అలాగే ఆస్పత్రిలో కరోనా టెస్టింగ్ కిట్లు, ఇతర వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలంటూ వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ నాగశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీ ప్రభుత్వానికి రాహుల్ గాంధీ అంటే భయం పట్టుకుంది




కుప్పం, ఏప్రిల్ 6, మనం న్యూస్: ఏఐసీసీ మాజీ అధ్యక్షులు, పార్లమెంట్ సభ్యులు రాహుల్ గాంధీ పై అనర్హత వేటును నిరసిస్తూ కుప్పం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏపీ సి సి కార్య నిర్వాహక అధ్యక్షులు జంగా గౌతం మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్య , రాజ్యాంగ విలువలు పాటించకుండా కేవలం ప్రతిపక్ష నేతల పై రాజకీయ కక్ష సాధింపు చర్యలు చేపట్టడం ప్రజాస్వామ్యానికి చేటు లలిత్ మోడీ, నీరవ్ మోడీ వేల కోట్ల రూపాయలు అప్పులు చేసి విదేశాలకి పారిపోయారు అలాంటి వారిని శిక్షించకుండా కళ్ళు మూసుకున్న బిజెపి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన రాహుల్ గాంధీని వేధించడం హేయమని ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలు ఉండకూడదనుకునే నేటి పాలకుల తీరు హేయమని బిజెపి పదే పదే రాహుల్ గాంధీని నిలువరించాలని చూడటం వారి భయాన్ని తెలుపుతుందని, పార్లమెంట్లో రాహుల్ గాంధీ ప్రశ్నలకు జవాబు చెప్పలేక బిజెపి ప్రభుత్వం ఆయన్ను ఇబ్బందికి గురిచేస్తున్నారని, రాహుల్ పై మొన్న అరెస్ట్ వారెంటు జారీ చేయగా, నిన్న పార్లమెంట్ నుండి అనర్హత వేటు వేయటం బిజెపి నైతిక పతనాన్ని సూచిస్తుందని, రాహుల్ గాంధీను ఎన్నిరకాలుగా ఇబ్బందులకు గురిచేసిన ఆయన ప్రజల పక్షాన్న తన పోరాటాన్ని కొనసాగిస్తారు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిసిసి అధ్యక్షుడు డాక్టర్ బి.ఆర్ సురేష్ బాబు వెంకటరమణ బాబు మురుగేష్ డీకే చంద్రశేఖర్ పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు .

## స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి సన్నిధిలో విజయనగరం జిల్లా నెల్లిమర్ల ఎమ్మెల్యే అప్పలనాయుడు



కాణిపాకం, ఏప్రిల్ 6, మనం న్యూస్:శ్రీ స్వామివారిని దర్శించుకున్న విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్ వీ. శ్రీనివాసరావు , మరియు విజయనగరం జిల్లా నెల్లిమర్ల ఎమ్మెల్యే అప్పలనాయుడు , కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు, వీరికి స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేసిన దేవస్థానం కార్యనిర్వాహధికారి వెంకటేశు, ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ శ్రీనివాస్, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## కుప్పంలో ముగిసిన ముత్తు మారి అమ్మవారి ఆలయ కుంభాబిషేకం



కుప్పం, ఏప్రిల్ 6, మనం న్యూస్: కుప్పం మండలం వెండుగాంపల్లి గ్రామం నందు సర్పంచ్ లక్ష్మి దర్మాచారీ ఆధ్వర్యంలో ముత్తుమారెమ్మ ఆలయ కుంభాబిషేకం కనుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల రెవిన్యూ అధికారి పార్వతమ్మ విచ్చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, ఆలయ పూజారులు సాంప్రదాయ పద్ధతిలో ఆమెకు ఘన స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించి, గౌరవప్రదంగా తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగిన కుంభాబిషేకం అమ్మవారి ఆశీర్వాదంతో విజయవంతంగా ముగియడం ఆనందంగా ఉందన్నారు. ఈ రోజు నుండి ఆలయం నందు నిత్య పూజలు జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించారు.

## ప్రారంభమైన జగనన్న నువ్వే మా భవిష్యత్తు కార్యక్రమం




శాంతిపురం, ఏప్రిల్ 6, మనం న్యూస్: మండల పరిధిలో నేటి నుంచి ప్రారంభం కానున్న జగనన్న నువ్వే మా భవిష్యత్తు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలంటూ జిల్లా పరిషత్ సభ్యులు ఎస్ శ్రీనివాసులు ఎంపీపీ కే వసుంధర కోదండ రెడ్డిలు పిలుపునిచ్చారు బుధవారం మండల సచివాలయం కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు గృహ సారథలు కన్వీనర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్న నువ్వే మా భవిష్యత్తు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు జయప్రదం చేయాలని వర్కోరారు అందులో భాగంగా నేటి నుంచి 25 వరకు 14 రోజులపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు మండలంలోని ప్రజాప్రతినిధులు సర్పంచులు ఎంపీటీసీలు గృహసారథులు కన్వీనర్లు ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవాలన్నారు. ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు తెలియజేస్తూ ప్రజా సమస్యల పరిష్కారంగా ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని వారు సూచించారు మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి మాట్లాడుతూ సమయాభావం లేనందున ప్రతి ఒక్కరికి పేరుపేరునా తెలియజేయలేకపోయామని కనుక ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలి అన్నారు. రెస్కో మాజీ చైర్మన్ చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా ఈ కార్యక్రమానికి మనసా వాచా కర్మణా ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేయాలని పార్టీలో మనస్పర్థలు చిన్నచిన్న పొరపాట్లు సహజమని వాటిని పక్కనపెట్టి అంకితభావంతో ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు వైస్ ఎంపీపీ టీవీ పట్టాభి రాష్ట్ర అటవీ శాఖ డైరెక్టర్ కృష్ణమూర్తి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నాగభూషణమ్మ సుబ్బరాజు, కోఆప్షన్ సభ్యుడు బి నిసార్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఎం సుబ్రహ్మణ్యం మండలంలోని ప్రజాప్రతినిధులు పార్టీ అనుబంధ సంఘాల వర్గ నాయకులు తదితరులు.

## నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఉమ్మడి చర్యలు



చిత్తూరు, ఏప్రిల్ 6, మనం న్యూస్: నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం నగరపాలక సంస్థ, పోలీసు శాఖ ఉమ్మడిగా చర్యలు తీసుకుంటున్నట్లు నగర కమిషనర్ డా. జె అరుణ తెలిపారు. నగరంలో ట్రాఫిక్ నియంత్రణ, కొత్త సిగ్నల్ లైట్లు, జీబ్రా క్రాసింగ్ ల ఏర్పాటు తదితర అంశాలపై కమిషనర్ గురువారం జిల్లా ఎస్పీ రిషాంత్ రెడ్డి, ఏఎస్పీ జగదీష్, చిత్తూరు డిఎస్పీ శ్రీనివాసమూర్తిలతో ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. ప్రధానంగా నగరంలోని రద్దీ ప్రాంతాలు, కూడళ్లు, ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ స్థిరీకరణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలపై చర్చించారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో కొత్తగా సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం, నిర్వహణ అంశాలపై మాట్లాడారు. రహదారులపై నిబంధనల ప్రకారం జీబ్రా క్రాసింగ్లు, సిగ్నలింగ్ ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలనే అంశాల పైన చర్చించారు. నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం తీసుకునే చర్యలకు నగరపాలక సంస్థ తరపున సహాయ, సహకారాలు అందిస్తామని కమిషనర్ తెలిపారు.

## రాష్ట్ర ఉప అధ్యక్షుడిగా అరుణ్ మనీ ఏకగ్రీవం



బంగారుపాలెం, ఏప్రిల్ 6, మనం న్యూస్ : రాష్ట్ర ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడుగా అరుణ్ మనీ ని ఏకగ్రీవంగాఎన్నుకున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాదు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం గుంటూరులో జరిగిన ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం సమావేశంలో బంగారు పాలెం మండలానికి చెందిన రాష్ట్ర ఉప అధ్యక్షులుగా అరుణ్ మనీ ఎన్నుకున్నామని తెలిపారు.ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం గుంటూరు నందు గల రాష్ట్ర కార్యాలయంలో జరిగినది. ఈ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కే.వినాయక అధ్యక్షత వహించారు. రాష్ట్ర టీవీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రసాద్ సంఘం యొక్క భవిష్యత్ కార్యక్రమం తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి చిత్తూరు జిల్లాకు చెందినటువంటి ఖ.అరుశ్ మణి గారిని రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కే. వినాయ కం డాక్టర్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఖ.అరుశ్ మణి గారు ఇంతకుమునపు చిత్తూరు జిల్లా అధ్యక్షులుగా పనిచేసి సంఘాన్ని విస్తరింపచేశారని ఆయన కృషికి ఫలితంగా రాష్ట్ర కార్యవర్గంలో తీసుకోవడం జరిగిందని. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రసాద్ ఈ సందర్భంగా తెలియజేశారు. రాష్ట్ర అధ్యక్షులు కే. వినాయకం మాట్లాడుతూ ఖ.అరుశ్ మణి గారుఅంబేద్కర్ ఆశయాలతో ముందుకు వెళుతూ తన స్వగ్రామంలో తన సొంత నిధులతో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుచేసి యువతకు ఆదర్శంగా నిలిచారని కావున అలాంటి వారిని రాష్ట్ర కార్యవర్గంలో తీసుకోవడం చాలా ఆనందదాయకమని. ఇంకా ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘానికి ఖ.అరుశ్ మణి గారు విశిష్టమైన సేవలు అందించి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకోవాలని తెలియజేయడం జరిగినది.

## భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన పార్టీ బీజేపీ



చిత్తూరు, ఏప్రిల్ 6, మనం న్యూస్: భారతదేశ ఖ్యాతిని, ప్రపంచ దేశాల్లో ఇనుమడింపజేసిన పార్టీ భారతీయ జనతా పార్టీ ఏకైక వ్యక్తి ప్రధాని నరేంద్ర మోడీ అని, బిజెపి నాయకులకు కొనియాడారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని,చిత్తూరు బిజెపి పార్టీ కార్యాలయంలో, జిల్లా అధ్యక్షులు రామచంద్రుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, జిల్లా నాయకులు,బిజెపి పతాకాన్ని ఆవిష్కరించి, భారత్ మాతాకు జై అంటూ నినాదాలు చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ప్రధానమంత్రి మోడీ ప్రసంగాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు మాట్లాడుతూ, ప్రపంచంలో అతి పెద్ద పార్టీగా బిజెపి ఎదిగిందన్నారు. పార్టీ కోసం అనేకమంది తమ ప్రాణాలను బలిదానం చేశారన్నారు. వారి సేవలను స్మరించుకుంటూ, బిజెపి ఆసియాలకు అనుగుణంగా పనిచేస్తామని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా భారతీయ జనతా పార్టీ పనిచేస్తుందని తెలిపారు. పండిత్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ దిన దయాల్ ఉపాధ్యాయ అటల్ బీహార్ వాజ్పేయి లాంటి త్యాగధనుల కృషితో భారతీయ జనతా పార్టీ బలియమైన పార్టీగా రూపుదిద్దుతుందన్నారు. 20 రాష్ట్రాల్లో అధికారం చేపట్టి ప్రజా సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ఉందన్నారు. బిజెపిలో వారసత్వ రాజకీయాలు లేదని కేవలం రాజకీయ వాదులు ఉన్నారని అతి సామాన్యుడు కూడా అధికారాన్ని అలంకరించవచ్చని తెలిపారు. రోజుకు 18 గంటల పాటు కృషి చేస్తూ ప్రధాని నరేంద్ర మోడీ ప్రజల క్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు కార్యకర్తలు అందరికీ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా అధ్యక్షులు గురు గణేష్, బిజెపి పోతు పాల రామ్మూర్తి, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు, జిల్లా అధ్యక్షులు డాక్టర్ బాబు, మీడియా ప్రతినిధి, రామభద్ర, తోట పాలెం వెంకటేష్, దుర్గా,రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## గడప గడపలో సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కరిస్తాం



చిత్తూరు, ఏప్రిల్ 6, మనం న్యూస్: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 34వ వార్డు (కన్నయ్య నాయుడు కాలనీ) న్యూ బాలాజీ కాలనీలోనీ మసీదులో ప్రార్ధనలు చేసి చిత్తూరు శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక వైఎస్సార్సీపీ నాయకులు, వార్డు సచివాలయం సిబ్బంది, వార్డు వాలంటీర్స్ తో కలిసి వార్డులో ప్రతి ఇంటి గడప గడపకు వెళ్లి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన ఈ మూడు సంవత్సరాలలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అందింది లేనిది స్వయంగా ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, లైట్లు, కరెంట్ పోల్స్, రోడ్స్, లేవు అని స్థానికులు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యను వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత సచివాలయానికి వెళ్లి వచ్చిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని చెప్పారు. వార్డు యొక్క స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో 24వ డివిజన్ వైఎస్ఆర్సిపి నాయకులు ప్రేమ్ కో ఆప్షన్ మెంబర్ ఆను, ఆగ్రోస్ డైరెక్టర్ రమణ, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, చూడ చైర్మన్ పురుషోత్తం రెడ్డి , మొదలియార్ స్టేట్ డైరెక్టర్ జ్ఞాన జగదీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్ రాజారెడ్డి , వైఎసఆర్సిపి కార్పొరేటర్ల పూర్ణ , చలమత్తు , కో ఆప్షన్ మెంబర్ కొల కిరణ్, వైఎస్ఆర్సిపి నాయకులు హరి, ముస్తాక్, గిరి, షరీఫ్, పాండు, రంగా, శేకర్, గురప్ప, సుగుణ శేఖర్ రెడ్డి, షరీఫ్, శరవణ, నాయకులు, స్థానికులు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సచివాలయ అధికారులు, హౌసింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు, ఎలక్ట్రికల్ అధికారులు, వైఎస్ఆర్సిపి నాయకులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం



కుప్పం, ఏప్రిల్ 6, మనం న్యూస్: కుప్పం మున్సిపాలిటీ వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయం నందు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమములో కుప్పం మున్సిపల్ చైర్మన్ డా.సుధీర్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ లు మునస్వామి అఫీజ్ మరియు మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, మరియు సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ మనమందరం కలిసి ప్రతి గడపను తొక్కుదాం జగనన్న ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించి మళ్లీ జగనన్నను ఆశీర్వదించి రానున్న అసెంబ్లీ ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్ఆర్సిపి పార్టీని అఖండ విజయంతో గెలిపించాలని మనమందరం కలిసికట్టుగా పని చేయాలని అన్నారు

## పీహెచ్సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషయన్ కార్యక్రమం ప్రారంభం



రామకుప్పం, ఏప్రిల్ 6, మనం న్యూస్ : రామకుప్పం మండలం చెల్దిగానిపల్లిలో గురువారం ఎం. పి. పి. సుబ్రమణ్యం వై. సి. పి కో కన్వీనర్ చంద్రారెడ్డి స్థానిక సర్పంచ్ రాజేంద్ర ప్రసాద్ చేతులు మీదగా ప్యామిలీ పిజిషయాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా వీరు మాట్లాడతూ ప్యామిలీ పీజీషియన్ కార్యక్రమం ద్వారా ప్రజలకు వివరిరించారు ప్రతి సచివాలయానికి నెలలో రెండు రోజులు డాక్టర్ ఎం. ఎల్. హెచ్. పి మరియు ఏ. ఎన్. ఎం ఆషా వర్కర్లు వెళ్ళి ఓ. పి ద్వారా మధుమెహం రక్తపోటు గర్భవతులకు పరీక్షలు జరిపి ఉచితంగా మాత్రలు ఇవ్వబడుతుందాన్నారు మధ్యాహ్నం.పైన సచివాలయం పరిధిలోని ఎం. పి. పి మరియు జడ్. పి. హైస్కులు, అంగన్వాడి విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించబడుతుందన్నారు మంచానికి పరిమితమైన దీర్ఘ కాలిక వ్యాదిగ్రాస్తులు పక్షపాతం వచ్చిన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొంది డిస్చార్జీ అయిన రోగులను పరామర్శించి వైద్యం అందించడం జరుగుతుందన్నారు ఈ సదవకాశన్ని ప్రజలు విద్యార్థులు సద్వినియెగం చేసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో రామకుప్పం, విజలాపురం, వీర్నమల, పి. హెచ్. సి డాక్టర్లు దీప డాక్టర్ అల్తాఫ్ హుస్సేన్ డాక్టర్ శశిధర్ ఎం. ఎల్. హెచ్. పి ఐశ్వర్య ఏ. ఎన్. ఎం శోభారాణి సిబ్బంది సుబ్రహ్మణ్యం ఆషా లావణ్యతదితరులు పాల్గొన్నారు

# పశువులు అక్రమంగా కంటైనర్లలో కేరళకు అక్రమ రవాణా



గోరంట్ల, ఏప్రిల్ 6, మనం న్యూస్: వ్యవసాయానికి పనికి వచ్చే ఎద్దులను పాలిచ్చే ఆవులను ఎనుములను పదుల సంఖ్యలో టాటా ఏసీ, బులోరా ఫోర్ నాట్ సెవెన్ వాహనాలతో మార్కెట్ యార్డ్ నుండి మండల పరిధిలోని ఒకచోటకు తీసుకెళ్లి అక్కడ ఒక్కొక్క కంటైనర్ లో 70 నుండి 80 పశువుల దాకా క్రిక్కరిసినట్లు కాళ్లు విరిచి కంటైనర్ లోకి వేసి గాలి కూడా ప ప్రవేశించని విధంగా కంటైనర్ల లో అక్రమంగా తరలిస్తున్న వైనం ప్రతి గురువారం గోరంట్ల పశువుల సంతలో జరుగుతున్న వైనం... ఇది ఇంత జరుగుతున్న సంబంధిత అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నట్లు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న తంతు ప్రతివారం జరుగుతూనే ఉంది. వివరాల్లోకి వెళ్తే ప్రతి గురువారం గోరంట్ల పట్టణంలో పశువుల వారపు సంత మార్కెట్ యార్డులో జరుగుతూ ఉన్నది విదితమే.. కానీ ఇక్కడ వ్యవసాయానికి పనికొచ్చే ఎద్దులు పాలిచ్చే ఆవులు కొనుగోలు అమ్మకాలు నిర్వహించుకోవచ్చునని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. ఇక్కడ వాటికి విరుద్ధంగా వ్యవసాయం పనికొచ్చే ఎద్దులు పాలిచ్చే ఆవులు, చిన్న చిన్న లేగ దూడలు, ఎనుములు బలసిన ఆంబోతులు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారస్తులు ఇక్కడ దళారులతో కుమ్మక్కై రైతులను అమాయక ప్రజలను మోసం చేసి కొనుగోలు చేసి కేరళ తమిళనాడు తదితర రాష్ట్రాలలోని కబేలాలకు అక్రమంగా తరలిస్తున్నారు. ఇక్కడ ఇదివరలోనే మార్కెట్ యార్డ్ లోనికి కంటైనర్లు రాకూడదని, పశువులను అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలించరాదని, స్థానిక పోలీసులు ఆంక్షలు విధించడంతో అక్రమంగా పశువుల తరలిస్తున్న దళారులకు కళ్లెం వేసినట్లయ్యింది, ఇలా సాధ్యం





కాదన్న ఆలోచనతో మార్కెట్ యార్డ్ నుంచి పశువులను బయట ప్రాంతాల్లో ఒకచోటకు తరలించి అక్కడ కంటైనర్ లోకి ఎక్కించి తీసుకుపోతున్న వైనం మీడియా కంటపడింది.

ఈ దృశ్యం మండల పరిధిలోని కరావులపల్లి తాండ ఆంజనేయ స్వామి సమీప పొలాల్లో తండాకు సంబంధించిన వ్యక్తి ఈ వ్యవహారం అంతా నడిపిస్తూ అక్రమంగా పశువులను కంటైనర్ లో ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు మీడియాకు తెలిసింది, ఇలాంటి పశువుల అక్రమ రవాణాను అరికట్టి అడ్డుకట్ట వేయవలసిన సంబంధిత అధికారులు చూచి చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు ఉందని ప్రజలు వాపోతున్నారు. వీటిపై జిల్లా ఉన్నతాధికారులు మరియు పై స్థాయి అధికారులు దృష్టి పెట్టి అరికట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు

## దేశ పురోగతికి బీజేపీ అందించిన సేవలు ఎంతో గొప్పవి



బళ్ళారి, ఏప్రిల్ 6, మనం ప్రతినిధి: భారతదేశ అభివృద్ధి కోసం కేంద్రంలో అధికారాన్ని చేపట్టిన భారతీయ జనతా పార్టీ ఎంతో శ్రమించిందని,ఎమ్మెల్యే గాలి సోమశేఖర్ రెడ్డి అన్నారు.గురువారం వాజపేయి లేఔట్ లోని, బిజెపి జిల్లా కార్యాలయంలో బిజెపి పార్టీ సంస్థాపన దినోత్సవాన్ని వేడుకలుగా ఆచరించారు. బిజెపి నాయకుల చిత్రపటాలకు పుష్పాలు సమర్పించి ఆయన మాట్లాడారు. హిందుత్వ రక్షణ, భారతదేశ అభివృద్ధి కోసం భారతీయ జనతా పార్టీ ఆవిర్భవించిందని,క్లిష్ట పరిస్థితుల్లో అధికారాన్ని చేపట్టిన భాజపాదేశానికి అత్యుత్తమ పాలన అందించడమే కాకుండా, దేశ ఆర్థిక పురోభివృద్ధికి, దేశ భద్రతకు శ్రమించాలన్నారు.ఈ సందర్భంగా కార్యక్రమంలో, భాజపా జిల్లా అధ్యక్షుడు, మురారి గౌడ,రాష్ట్ర రైతు మోర్చా ప్రధాన కార్యదర్శి, గురు లింగన్న గౌడ, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు, కార్పొరేటర్ శ్రీనివాస్ మోత్కర్, గాళి,శంకరప్ప, సుమ రెడ్డి, రామకృష్ణ, జిల్లా కోశాధికారి శంభు ప్రసాద్, జిల్లా అధ్యక్షురాలు, సుగుణ, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గాదిలింగన్ గౌడ,మహబూబ్ బాషా, మీడియా సహసంచాలకుడు, రాజీవ్ తొగరి లతోపాటు పలువురు బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## సజావుగా 10వ తరగతి పరీక్షలు

- కొత్తచెరువు మండల కేంద్రంలోని బాలురు, బాలికల జిల్లా పరిషత్ ఉన్నత , శ్రీవిద్య పాఠశాలలో 10వ తరగతి పరీక్షలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

సత్యసాయి జిల్లా, ఏప్రిల్ 6, మనం ప్రతినిధి: 10వ తరగతి పరీక్షలను సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.బసంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కొత్తచెరువు మండల కేంద్రంలోని బాలురు, బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, శ్రీవిద్య పాఠశాలలో జరుగుతున్న 10వ తరగతి పరీక్షలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయన్నారు. 10వ తరగతి పరీక్షలు ఏప్రిల్ 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహిస్తుండగా, జిల్లాలో 125 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయని, ఎలాంటి ఇబ్బంది లేకుండా పరీక్షలు నిర్వహించడం జరుగుతోందన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, విద్యుత్ సరఫరా, తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిట్టింగ్ స్క్వాడ్ గోపాల్ నాయక్, డిపార్ట్మెంట్ చీఫ్‌కు సుమన, చెన్నకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ముట్టాలలో వైద్యశిబిరం



ఆత్మకూరు, ఏప్రిల్ 6, మనం న్యూస్: మండల పరిధిలోని ముత్తాల గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తూ ఉన్న ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని డాక్టర్లు దయాకర్ సుల్తానా గురువారం మండల పరిధిలోని ముత్తాల గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో 14 రకాల పరీక్షలు నిర్వహించి 105 రకాల మందులను పలు రకాల జబ్బులకు ఇవ్వడం జరిగిందన్నారు 38 మంది గర్భిణీలకు ఏడు మంది బాలింతలకు పరీక్షలు చేసి మందులు ఇవ్వడం జరిగిందన్నారు దీర్ఘకాలం జబ్బులకు మంచం మీద రోగులు రోగంతో ఇబ్బంది పడుతున్న రోగులను పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించమన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ ఫీల్ ప్రొవైడర్స్ నవత రమణమ్మ మల్లమ్మ జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలోకి చేరిన పలువురు బీజేపీ నాయకులు



బళ్లారి, ఏప్రిల్ 6, మనం ప్రతినిధి: రాష్ట్ర విధాన సభ ఎన్నికల జరుగుతున్న నేపథ్యంలో ఒక పార్టీ నుండి మరో పార్టీకి మారడం ఆనవాయితీ. బిజెపి పార్టీ నాయకులు మహమ్మద్ రియాజ్ తో పాటు కాల్ బజార్ పరిధిలోని 30 వార్డులో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే బి నాగేంద్ర సమక్షంలో గురువారం కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు కాజా సాబ్, షేక్ నిశుబుద్దీన్, నజీర్, నవీద్, ముక్తార్, ఇస్మాయిల్ బషీర్ షఫీ షాషాలతో పాటు వందలాది మంది బిజెపి నాయకులు బళ్లారి గ్రామీణ ఎమ్మెల్యే నాగేంద్ర సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరిపోయారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలను కప్పి, ఎన్నికల్లో తన విజయానికి సహకరించాలని కోరారు.

## చిన్నమ్ నగర్‌లో విలేజ్ క్లినిక్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

రాప్తాడు, మనం న్యూస్, ఏప్రిల్ 6: చిత్తశుద్ధి కల్గిన ముఖ్యమంత్రి.. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్రెడ్డి అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ పథకంలో భాగంగా గురువారం రాప్తాడు మండలం చిన్నమ్ నగర్లో విలేజ్ క్లినిక్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ అనే కొత్త కార్యక్రమానికి ముఖ్యమంత్రి గారు శ్రీకారం చుట్టారు. ఇందులో బాగంగా విలేజ్ క్లినిక్‌ను ప్రారంభించాం. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఉన్న ఊరిలోనే ఉచిత వైద్యం అందించేలా ముఖ్యమంత్రి గారు చర్యలు తీసుకున్నారు. వైఎస్ రాజశేఖర్రెడ్డి తర్వాత పూర్తిస్థాయిలో వైద్యంపై దృష్టి పెట్టిన ప్రభుత్వం ఇదే. 99 శాతం రోగాలను ముఖ్యమంత్రిగారు ఆరోగ్యశ్రీ లోకి తీసుకొచ్చారు. ప్రజలను కాపాడుకు నేందుకు ముఖ్యమంత్రి గారు నిరంతరం కష్టపడు తున్నారు. కోవిడ్ను ఎదుర్కొనేందుకు రాష్ట్రంలో 25 వేలమంది వైద్య సిబ్బందిని ప్రభుత్వం నియమించింది.

అందరూ కష్టపడి రేయింబవళ్లు పని చేసి ఓ విపత్తను దాటవేశాం. ఇంత మంచి చేస్తున్న వ్యక్తి గురించి మాట్లాడుకోకపోతే మంచికి విలువ ఉండదు. ప్రజలందరూ గుర్తించాల.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు, ఎంపీపీలు,



జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, చైర్మన్లు, డైరెక్టర్లు, స్టోర్ డీలర్లు, మండల నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నల్లచెరువు మండలంలో మూడవ విడత వైఎస్ఆర్ ఆసరా సంబరాలు



నల్లచెరువు, ఏప్రిల్ 6, (మనం న్యూస్): నల్లచెరువు మండల కేంద్రం స్థానిక గీతా మందిరం నందు నల్లచెరువు మండలానికి చెందిన స్వయం సహాయక సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ ఆసరా సంబరాలలో కదిరి శాసనసభ్యులు డాక్టర్ పీవీ సిద్ధారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆనాడు తన పాదయాత్రలో మహిళలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకొని వరుసగా మూడవ విడత వైయస్సార్ ఆసరా మొత్తాన్ని విడుదల చేయడం జరిగిందన్నారు. నల్లచెరువు మండలంలో గల 575 స్వయం సహాయక సంఘాలలో గల అక్క చెల్లెమ్మలకు రూ 4.18 కోట్ల రూపాయలను వారి ఖాతాలలో జమ చేయడం జరిగిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయనటువంటి సంక్షేమ కార్యక్రమాలు జగన్మోహన్ రెడ్డి చేసి చూపి స్తున్నారు. వీటన్నిటిని కూడా డిపిటి ద్వారా వేల కోట్ల రూపాయలను నేరుగా లబ్ధిదారుల ఖాతాలలో జమ చేయడం జరుగుతున్న దన్నారు. జగనన్న సంక్షేమము, అభివృద్ధి రెండింటిని రెండు కళ్ళుగా భావించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజలందరికీ చేరువయ్యే విధంగా పథకాలను అమలుపరుస్తున్నారా న్నారు. వివక్షతకు తావు లేకుండా అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారునికి లబ్ధి చేకూర్చే విధంగా గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థలను తీసుకువచ్చి 33 సంక్షేమ పథకాలను వాలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే చేరవేయడం జరుగు తున్నదన్నారు. ఒకనాడు ఏ గ్రేడ్ లో ఉన్న మహిళా సంఘాలను తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బి గ్రేడ్ సి గ్రేడ్ లో కి నెట్టేసి, మహిళలను కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకునేందే కాకుండా మరి ఈనాడు విమర్శిస్తున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత స్వయం సహాయ సంఘాలకు పూర్వవైభవం తీసుకొచ్చారన్నారు. జగనన్నకు మహిళలపై గల అపారమైన గౌరవం, ప్రేమ వల్లే వారు ఆర్థికంగా ఎదిగి సమాజంలో మంచి గౌరవం లభించాలన్న ఉద్దేశంతో వారికి సహాయ సహకారాలు అందజేస్తున్నారన్నారు. మహిళల కోసం ఇన్ని కార్యక్రమాలు చేపడు తున్న జగన్మోహన్ రెడ్డి కి మీరంతా తోడు ఉండాలని రాబోయే రోజుల్లో మన కోసం మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలంటే వారు మరిన్ని రోజులు అధికారంలో ఉండే విధంగా ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమణ రెడ్డి, ఎంపీడీవో శకుంతల, ఏపిఎం రమణమ్మ ,వైస్ ఎంపీపీ లు, కోఆప్షన్ సభ్యులు, జెసిఎస్ కన్వీనర్, సర్పంచులు, వివిధ శాఖల చైర్మన్లు, డైరెక్టర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్వయం సహాయక మహిళ సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రైతు భరోసా పథకాన్ని అప్లై చేసుకోండి

- ఏవో సోమశేఖర్



గార్లదిన్నె, ఏప్రిల్ 6, మనం న్యూస్: మండలంలోని రైతు సోదరులందరూ వైఎస్ఆర్ రైతు భరోసా పథకానికి సబంధించి అర్హులై ఉండి పథకం రాకుండా ఉంటే దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సోమ శేకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ గతంలో పట్టాదారు పాసుపుస్తకాలు కొత్తగా వచ్చి ఉండి అర్హత గల రైతులు ఎవరైనా ఉంటే ఆ రైతు భరోసా కేంద్రంలో విఏఏ దగ్గర దరఖాస్తు చేసుకొని లబ్ధి పొందాలన్నారు. ఈ పథకం పొందడానికి అర్హులుగా గుర్తించి అలాగే కుటుంబంలో ఈ పథకం లబ్ధి పొందుతూ ఎవరైనా చనిపోయి ఉంటే అటువంటి వారిపైన ఈ పథకం నిలుపుదల చేయించుకొని తమ కుటుంబ సభ్యులలో వారసత్వం కలిగిన వారికి వచ్చేలా వర్తింపు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ తెలిపారు.

## డయల్ యువర్ ఈవో

తిరుమల, ఏప్రిల్ 6, మనం న్యూస్: డయల్ యువర్ఈవోకార్యక్రమం నేటి ఉదయం 9 నుండి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరుగనుంది. ఈ కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది.ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలను, సూచనలను టిటిడిఈవో ఎవి.ధర్మారెడ్డి గారికి ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి తెలుపవచ్చు. ఇందుకు భక్తులు సంప్రదించవలసిన నెంబరు 0877-2263261.

## ప్రజల చెంతకే మెరుగైన వైద్య సేవలు

నల్లచెరువు, ఏప్రిల్ 6, మనం న్యూస్: నల్లచెరువు మండలం, అల్లుగుండు విలేజ్ హెల్త్ క్లినిక్ నందు ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను కదిరి శాసన సభ్యులు డాక్టర్ పి వి సిద్దా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి నేడు చిలకలూరిపేట మండలం, లింగంగుంట్ల నందు ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రేమ్ ను లాంఛనంగా ప్రారంభించారన్నారు. ఒకనాడు వైద్య సేవల కోసం డాక్టర్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని దానికి పూర్తిగా స్వస్తి చెబుతూ డాక్టరే ప్రజల చెంతకు వెళ్లి వైద్య సేవలను అందజేయడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు.

ప్రతి మండలానికి రెండు పి.హెచ్.సి సెంటర్లు, ప్రతి సెంటర్ కు ఇద్దరు డాక్టర్లను ఇప్పటికే నియమించడం జరిగిందని, ఒక డాక్టర్ పి హెచ్ సి సెంటర్ నందు వైద్య సేవలు



అందజేస్తుంటే మరొక డాక్టర్ గ్రామీణ ప్రాంతాల్లో గల ప్రజల చెంతకు చేరి వైద్య సేవలు అందజేస్తారన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రతి సచివాలయం పరిధిలో కూడా ఒక హెల్త్ క్లినిక్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, వాటితో పాటు ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్టును తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతంలోని మెరుగైన వైద్యాన్ని మరింత సులభతరం చేయడానికి వీలవుతుందన్నారు. కాబట్టి ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎం అండ్ హెచ్ ఓ, మెడికల్ ఆఫీసర్, వైద్య సిబ్బంది, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, కోఆప్షన్ సభ్యులు, జెసిఎస్ కన్వీనర్, సర్పంచులు, వివిధ శాఖల చైర్మన్లు, డైరెక్టర్లు, సచివాలయ కన్వీనర్లు, , వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాయింట్ ఖాతా మ్యుటేషన్‌కు సంబంధించిన దరఖాస్తులను గడువులోపు పరిష్కరించాలి

- ఏప్రిల్ 30 తేదీ నాటికి సర్వే రాళ్ళు నాటే ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి
- జాయింట్ కలెక్టర్



తిరుపతిటౌన్, ఏప్రిల్ 6, మనం న్యూస్: జిల్లాలో ఫేస్ 1 కి సంబంధించిన సర్వే రాళ్ల నాటే ప్రక్రియను ఏప్రిల్ 30 వ తేదీలోపు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేలా సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డి.కె.బాలాజీ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కన్ఫరెన్స్ హాల్ నుండి ఆర్.డి.ఓ. లు, తహశీల్దార్లు, సర్వే అధికారులతో రీ సర్వే, ఓ.టి.ఎస్., సర్వే రాళ్ల నాటే ప్రక్రియ, మ్యూటేషన్, అసైన్ మెంట్ ల్యాండ్స్ తదితర అంశాలపై వీడియో కన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సంధర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. ఎండలు తీవ్రత దృష్ట్యా ఉదయశే నుంచే జిల్లాలో రోజు వారి ప్రణాళికలతో సర్వే రాళ్ల నాటే ప్రక్రియను సంబందిత అధికారులు దృష్టిపెట్టి పూర్తి చేయాలని అన్నారు. సర్వే రాళ్ల సచివాలయం స్టాక్ పాయింట్ నందు అందుబాటులో ఉంటాయని తెలిపారు. వివిధ గ్రామాలలో సర్వే రాళ్ళ సంఖ్య ను బట్టి ఒక్కో రోవర్ కి 3, 4 టీమ్ ల వారీ గా ప్రణాళికలు చేసుకొని పూర్తి చేసేలా ఉండాలని తెలిపారు. తహసిల్దారులందరు సర్వే రాళ్ళ నాటే ప్రక్రియ పై దృష్టి పెట్టి వంద శాతం పురోగతి వచ్చేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని అన్నారు. రీ సర్వే కు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అత్యంత ప్రాముఖ్యత ఇస్తూ సమీక్షిస్తున్నారని, లక్ష్యాలను అందిపుచ్చుకుని పని చేయాలని సూచించారు. సర్వే రాళ్ళ నాటే ప్రక్రియలో భాగంగా ఒక్కో రోవర్ కి ఇద్దరు సర్వేయర్లు చొప్పున లేబర్ ను మొబిలైజ్ చేస్తూ ఎక్కువ మంది టీం వర్క్ తో పని చేస్తే సర్వే రాళ్ల నాటే ప్రక్రియ సకాలంలో పూర్తవు తుందని అన్నారు. జాయింట్ ఖాతా మ్యూటేషన్‌కు సంబందించిన ధరఖాస్తులను బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా గడువులోపు పూర్తి చేయాలని తెలిపారు. ఒన్ టైమ్ సెటిల్ మెంట్ పథకానికి సంబందించి ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసే పనులపై సంబందిత అధికారులు దృష్టి పెట్టాలని అన్నారు. అసైన్మెంట్ ల్యాండ్స్‌కు సంబందించిన ఫైల్స్ ను వీలైనంత తొందరగా పూర్తి చేసి ఆలస్యం లేకుండా ఈరోజు సాయంత్రం లోపు జిల్లా కార్య స్థానానికి పంపించాలన్నారు. ఈ సమావేశంలో డి.ఆర్.ఓ. శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కోదండరామి రెడ్డి, భాస్కర్ నాయుడు, ఏ.డి. సర్వేయర్ జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ గెలుపే లక్ష్యంగా గృహసారథులు పనిచేయాలి

నల్లచెరువు, ఏప్రిల్ 6, (మనం న్యూస్): రాబోవు ఎన్నికల్లో వైకాపా గెలుపే లక్ష్యంగా గృహసారథులు, వాలింటర్లు పనిచెయ్యాలని పంచాయతీ జోనల్ఇంచార్జ్ రమణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం తన కార్యాలయంలో జగనన్నే మాభవిష్యత్తు పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈనెల 7 నుండి 20వతేదీ వరకు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని తెలిపారు. గృహసారథులు, వాళింటర్లు, ప్రజా ప్రతినిధులు, వైకాపా నాయకులు, సమన్వయంతో పనిచేసి కార్యక్రమం జయప్రదం, చేయాలన్నారు. గత ఎన్నికలలో హామీమేరకు ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేశామని పథకాలు అమలు తీరును వివరించి వారి మద్దతు కొరాలన్నారు. వైస్ఎంపీపీ నారాయణస్వామి, సర్పంచులు సంఘం అధ్యక్షుడు దాసరి శ్రీనాథ్



రెడ్డి, తనకల్లు మార్కెట్ యర్డ్ వైస్ చైర్మన్ నాగభూషణం, డైరెక్టర్ ఆదిమూర్తి, మాజీ టెంపుల్ చైర్మన్ ఆనంద్ రెడ్డి, యువ నాయకులు సానేహరినాథ్ రెడ్డి, సర్పంచులు యూసుఫ్, ఎంపిటిసి భాస్కర్ రెడ్డి, యుగంధర్ రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

## ఎమోషన్స్ లేని ఈ ప్రభుత్వానికి 'బలగం' సినిమా చూపించాలి

### బండి సంజయ్ సతీమణి అపర్ణ



హైదరాబాద్, ఏప్రిల్ 6 (మనం న్యూస్): ఎలాంటి ఎమోషన్స్ కూడా లేని ఈ ప్రభుత్వానికి బలగం సినిమా చూపించాలని బండిసంజయ్ సతీమణి అపర్ణ సంచలన వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ జిల్లా బండి సంజయ్‌తో జిల్లా జైలులో కుటుంబ సభ్యులు వెళ్లి కలిసారు. సంజయ్‌ని ఆయన సతీమణి అపర్ణ, సోదరుడు శ్రవణ్, అల్లుడు వెళ్లి కలిశారు. అనంతరం బటకు వచ్చిన బండి సంజయ్ సతీమణి అపర్ణ మాట్లాడుతూ.. మొన్న అరెస్ట్ అయినప్పటి నుంచి తనతో పాటున్న కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. మోదీ పర్యటనను సక్సెస్ చేయాలని కార్యకర్తలను కోరారు. తాను ప్రజాస్వామ్య బద్ధంగా పోరాడుతుంటే అక్రమ అరెస్ట్ చేశారని మండిపడ్డారు. అయితే.. పాలిటిక్స్ ఇంటి బయట ఉండాలి.. ఇంట్లోకి రాకూడదని సంజయ్ చెబుతారని, మేము భయపడతామని కాదు.. పిల్లల దాకా రాకూడదనేది ఆయన అభిప్రాయమన్నారు. ఎలాంటి ఎమోషన్స్ కూడా లేని ఈ ప్రభుత్వానికి బలగం సినిమా చూపించాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే.. పేపర్ లీకేజీ వ్యవహారంలో బండి సంజయ్ సెల్‌ఫోన్ కీలకంగా మారిన విషయం తెలిసిందే. సంజయ్ సెల్ ఫోన్ ఎక్కడ ఉందో తమకు తెలియదని చెప్పారు. తనను అరెస్టు చేస్తున్న సమయంలో ఫోన్‌లో మాట్లాడుతున్నాడని అపర్ణ తెలిపారు. ఆ సెల్‌ఫోన్ ఎవరి వద్ద ఉందో తెలియాల్సి ఉందని అన్నారు. పోలీసుల ఆరోపణలను ఆమె ఖండించారు. తన ఆరోగ్యం బాగానే ఉందని.. మందులు వేసుకున్నట్లు అపర్ణ తెలిపింది. సంజయ్ బెయిల్‌పై బీజేపీ లీగల్ సెల్ చూసుకుంటుందని అన్నారు. 35 లక్షల మంది నిరుద్యోగుల కోసం నేను యుద్ధం చేస్తున్నాను అన్నారు. అంతిమంగా గెలిచేది న్యాయమే అని.. తప్పకుండా విజయం సాధిస్తామని ధీమాను సంజయ్ వ్యక్తం చేశారు. పోరాటాన్ని కొనసాగిస్తున్న కార్యకర్తలకు అభినందనలు తెలిపారు.

## పేపర్ లీకేజీ కేసులో ఎమ్మెల్యే ఈటలకు నోటీసులు




హైదరాబాద్, ఏప్రిల్ 6 (మనం న్యూస్): పదో తరగతి ప్రశ్నపత్రాల కేసులో బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు పోలీసులు నోటీసులు ఇచ్చారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలోని ఆయన నివాసానికి వెళ్లి.. తాఖీదులు అందించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు వరంగల్ డీసీపీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని పేర్కొన్నారు. 160 సీఆర్‌పీసీ కింద నోటీసులు అందించారు. ఈటల రాజేందర్ పీఏలు రాజు, నరేంద్రలకు ఈ నోటీసులను అందించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు నోటీసులపై ఈటల రాజేందర్ స్పందించారు. విచారణకు రావాలని పోలీసులు నుంచి నోటీసులు అందాయని.. తమ న్యాయవాదులతో మాట్లాడి తదుపరి నిర్ణయం తీసుకుంటానని ఆయన పేర్కొన్నారు.హిందీ ప్రశ్నపత్రం లీకేజీకి ముందు రోజే నిందితుడు ప్రశాంత్‌తో కలిసి కుట్ర చేసినట్లు ఆధారాలు లభించడంతోనే ఎంపీ బండి సంజయ్‌ను అరెస్టు చేసినట్లు వరంగల్ కమిషనర్ ఎ.వి. రంగనాథ్ నిన్న మీడియా సమావేశంలో చెప్పారు. ప్రశాంత్ ప్రశ్నపత్రాన్ని బండి సంజయ్తోపాటు ఈటల రాజేందర్‌కు, ఆయన పీఏలకు కూడా పంపినట్లు ఆయన వివరించారు. అనేక మంది బీజేపీ నాయకులకూ లీకేజీ సమాచారం వెళ్లినట్లు తెలిపారు. కానీ బండి సంజయ్, ప్రశాంత్‌ల మధ్య సోమవారం సాయంత్రమే చాటింగ్ జరిగినట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్లాన్ ప్రకారం హిందీ పేపర్ లీకేజీని వైరల్ చేసినట్లు సీపీ స్పష్టం చేశారు. కమలాపూర్లో ముందురోజు తెలుగు బిట్ పేపర్ కూడా బయటికొచ్చినట్లు దర్యాప్తులో తేలినట్లు వివరించారు. ఈనేపథ్యంలో పోలీసులు ఈటల రాజేందర్‌కు 160 సీఆర్పీసీ కింద నోటీసులు అందించారు.

## దొంగలను జైల్లో వేసిన తర్వాత ఏ లీక్ లేదు

### సాఫీగా పది పరీక్షలు

### ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు ఎన్నో కుట్రలు


### ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్, ఏప్రిల్ 6 (మనం న్యూస్): దొంగల్ని అరెస్టు చేసి జైల్లో వేసిన తర్వాత ఇవాళ ఏ లీక్ లేదు.. పది పరీక్షలు సాఫీగా సాగుతున్నాయని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా ధన్సరి విల్లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు స్థాపించి పిల్లలకు మంచి చదువు చెప్పిస్తున్న ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. చదువేలేమో మనం చెప్పిస్తుంటే.. బీజేపీ నేతలేమో పేపర్లు లీక్ చేస్తున్నారు. మొన్న, నిన్న పేపర్లు లీక్ చేశారు. ఇవాళ దొంగల్ని అరెస్టు చేసి జైల్లో వేసిన తర్వాత ఇవాళ ఏ లీక్ లేదు. పది పరీక్షలు సాఫీగా సాగుతున్నాయి. ఎవరైతే పేపర్ లీక్ చేశారో వారిని పోలీసులు దొరికించుకున్నారు. ఆ తర్వాత వారిని జైల్లో వేశారు అని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు బీజేపీ నేతలు ఎన్నో కుట్రలు చేశారని హరీశ్‌రావు గుర్తు చేశారు. హిందూ - ముస్లిం గొడవలు పెట్టాలని చూశారు. అది సాధ్యం కాలేదు. తెలంగాణ గవర్నమెంట్ను పడగొట్టాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యేలను కొనేందుకు యత్నించారు. ఆ దొంగలు దొరికారు. అది కూడా ఫెయిలైంది. అక్కడ కూడా ఫెయిల్ అయ్యామని చెప్పి మనకు పైసలు రాకుండా చేస్తున్నారు.అయితే కూలగొడుతా.. లేదంటే కాలబెడుతా అని అడ్డగోలుగా మాట్లాడుతున్నాడు. వారి మాటలకు జనాలు గందరగోళం కావొద్దు. ప్రజలందరూ ఒక్కసారి ఆలోచించాలి. సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించాలి అని హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు.

### కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదు

### కొత్త పార్టీ అంతా అబద్ధం: ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: తాను కొత్త పార్టీ పెడుతున్నట్లు జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్రెడ్డి స్పష్టం చేశారు. కార్యకర్తలను అయోమయానికి గురిచేసేలా కొందరు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీని తాను వీడే ప్రసక్తే లేదని చెప్పారు. దిల్లీలో కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. పలువురు కేంద్రమంత్రులను కలిసినప్పటికీ అది అభివృద్ధి కార్యక్రమాల కోసమేనని కోమటిరెడ్డి చెప్పారు. వాస్తవాలు తెలుసుకోకుండా ప్రచారం చేయడం తగదన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశిస్తే మళ్లీ ఎమ్మెల్యే, ఎంపీ.. దేనికి పోటీ చేయమంటే దానికి పోటీ చేస్తానని చెప్పారు. తనకు పార్టీ మారే ఉద్దేశముంటే పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వకపోయినపుడే మారే వాడినన్నారు. నిరాధార వార్తలతో కాంగ్రెస్ కార్యకర్తలను గందరగోళానికి గురిచేయొద్దని కోమటిరెడ్డి కోరారు.

# సింగరేణిపై కేంద్రం కుట్రలు

### ప్రైవేటీకరించి చేతులు దులుపుకోవాలనుకుంటున్నారు

### కేంద్రం కుట్రలను అడ్డుకొని తీరుతాం

### మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్

### బొగ్గు బ్లాకుల వేలంపై ఆగ్రహం

### భారీ స్థాయిలో మహాధర్నాలకు పిలుపు



హైదరాబాద్, ఏప్రిల్ 6 (మనం న్యూస్): కేంద్ర ప్రభుత్వం సింగరేణిని పూర్తిగా ప్రైవేటీకరించి చేతులు దులుపుకోవాలన్న కుట్రలకు పాల్పడుతోందని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు మండిపడ్డారు. తాజాగా సింగరేణిలోని మరోసారి బొగ్గు గనుల వేలానికి కేంద్రం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ స్థాయిలో మహా ధర్నా కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. ఈ నెల 8వ తేదీన మంచిర్యాల, భూపాలపల్లి, పెద్దపల్లి, రామగుండం కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సింగరేణి కార్మికులతో కలిసి పెద్దఎత్తున ఈ ధర్నా కార్యక్రమాలను నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ మేరకు సింగరేణి ప్రాంతంలోని జిల్లాల పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలతో మంత్రి కే తారకరామారావు ప్రత్యేకంగా మాట్లాడారు. ఒకవైపు తెలంగాణ ప్రభుత్వం సింగరేణి ప్రైవేటీకరణ ప్రయత్నాలను ఆపాలని కేంద్రానికి అనేకమార్లు విజ్ఞప్తి చేస్తున్న కేంద్రం మాత్రం కుట్రపూరితంగా గనుల వేలం ప్రక్రియను మరోసారి తెరపైకి తీసుకువచ్చిందని కేటీఆర్ అన్నారు. ఇప్పటికే పలుమార్లు గనుల వేలం ప్రక్రియ ప్రయత్నం చేసిన ప్రైవేటు కంపెనీల నుంచి ఎలాంటి స్పందన రాలేదని, మరోవైపు ఇవే గనులని నేరుగా సింగరేణికి కేటాయించాలని అనేక సంవత్సరాలుగా కోరుతున్నామని కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అటు సింగరేణి కార్మికులు తెలంగాణ ప్రజలు ఏకకంఠంతో సింగరేణి కోసం ప్రత్యేకంగా గనులు కేటాయించాలని కోరినా, పట్టించుకోకుండా మరోసారి సత్తుపల్లి బ్లాక్ 3, శ్రావణ పల్లి, పెన గడప గనుల వేలం కోసం మరోసారి నోటిఫికేషన్ కేంద్రం ఇచ్చిందన్నారు. మార్చి 29 నుంచి మే 30 వరకు ఈ గనులకు వేలం ప్రక్రియను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, వేలం ప్రక్రియతో సంబంధం లేకుండా సింగరేణికి నేరుగా బొగ్గు గనులను కేటాయించాలని కేటీఆర్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. సింగరేణి ఒక కంపెనీ మాత్రమే కాదని.. తెలంగాణ రాష్ట్రానికి కొంగుబంగారమని అన్నారు మంత్రి కేటీఆర్. తెలంగాణను దెబ్బ కొట్టాలన్న దురుద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం పదేపదే సింగరేణి ప్రైవేటీకరణ కుట్రలు కొనసాగిస్తోందని దుయ్యబట్టారు. ఇప్పటికే సింగరేణి ప్రైవేటీకరణ ప్రయత్నాలను భారత రాష్ట్ర సమితి తరపున, అలాగే తెలంగాణ ప్రభుత్వం పక్షాన తీవ్రంగా వ్యతిరేకించామని కేటీఆర్ గుర్తు చేశారు. ఈ మేరకు సింగరేణికి అవసరమైన బొగ్గు గనులను నేరుగా కేటాయించాలని గౌరవ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షులు కేసీఆర్ గారు గతంలో కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారని గుర్తు చేశారు. అయితే ఇప్పటికే లాభాల్లో నడుస్తున్న అనేక ప్రభుత్వ రంగ సంస్థలను అప్పనంగా అమ్మేస్తున్న కేంద్ర ప్రభుత్వం సింగరేణిని కూడా తెగ నమ్మాలని కంకణం కట్టుకుందని కేటీఆర్ ఆరోపించారు. లాభాల బాటలో వున్న సింగరేణికి.. భవిష్యత్తులో బొగ్గు గనులు కేటాయించకుండా నష్టాల బాట పట్టించాలన్న కుతంత్రంలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం పావులు కదుపుతుందని దుయ్యబట్టారు. ఆంధ్రప్రదేశ్ లోని వైజాగ్ స్టీల్ ప్లాంట్ కు కూడా గనులు కేటాయించకుండా ఆ సంస్థను దివాలా తీయించిన కేంద్రం..అదే విష ప్రయోగాన్ని ఇక్కడ అమలు చేయాలని చూస్తుందన్నారు..! పోరాటాల పురుటిగడ్డ అయిన తెలంగాణలో.. ఎట్టిపరిస్థితుల్లోనూ కేంద్ర ప్రభుత్వ కుట్రలను అడ్డుకుని తీరుతామని కేటీఆర్ అన్నారు.


సింగరేణి ప్రైవేటీకరణ విషయంలో దాగుడుమూతలు ఆడుతున్న కేంద్ర ప్రభుత్వం పైకోమాట.. అంతర్గతంగా లోపలో కుట్రకు తెర లేపుతుందని కేటీఆర్ అన్నారు. ఇదే కేంద్ర ప్రభుత్వం గుజరాత్ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కి మాత్రం నామినేషన్ పద్ధతిన భారీగా లిగ్నైట్ గనులు కేటాయించిన విషయాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. గుజరాత్ మాదిరిగానే తెలంగాణలోని సింగరేణికి బొగ్గు గనులను కేటాయించాలని ఎన్నోసార్లు తమ ప్రభుత్వం కోరినప్పటికీ కేంద్రం పెడచెవిన పెట్టిందన్నారు. తన సొంత రాష్ట్రం గుజరాత్ పై అపార ప్రేమను కనబరుస్తున్న దేశ ప్రధాని, ప్రగతిశీల తెలంగాణ రాష్ట్రం పట్ల మాత్రం వివక్ష చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.సింగరేణిని ప్రైవేటీకరించమంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన ప్రకటలన్నీ కల్లబొల్లి మాటలేనని తేలిపోయిందని గుర్తుచేశారు. నవంబర్ 12, 2022న రామగుండం పర్యటన సందర్భంగా స్వాక్షాత్తూ ప్రధానమంత్రే.. సింగరేణి బొగ్గుగనులను ప్రైవేటీకరించం అని మాటిచ్చి నిలుపుకోలేకపోయారని గుర్తుచేశారు. ప్రధాని.. హామీకే దిక్కులేకపోతే ఎలా అని సూటిగా ప్రశ్నించారు. ప్రధాని మరోసారి రాష్ట్రానికి రాబోతున్న తరుణంలో దానిపై ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. అటు ఉత్పత్తిలోనూ, లాభాల్లోనూ, పిఎల్ఎఫ్ లోనూ సరికొత్త రికార్డులు సృష్టిస్తున్న సింగరేణిని ప్రైవేటీకరించాల్సిన అవసరం ఏమొచ్చిందో చెప్పే దమ్ము కేంద్ర ప్రభుత్వంలోనే ఏ ఒక్కరికైనా ఉందా అని నిలదీశారు. రైతులతోపాటు రాష్ట్రంలోని దళిత, గిరిజన, కులవృత్తులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్ ఫలాలను గండికొట్టాలని కేంద్రం చూస్తోందన్నారు అందుకే ఉచిత పథకాలను.. అనుచితాలని స్వయంగా ప్రధానమంత్రి ప్రకటించడం ఆయనకు పేదప్రజలపై ఉన్న కక్షపూరిత వైఖరిని వెల్లడిస్తుందన్నారు. కేంద్రం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలను తెలంగాణ బలంగా అడ్డుకోవడం, మోటర్లకు మీటర్లు పెట్టమని తెగేసి చెప్పడంతో కేంద్రం దొడ్డిదారిలో సింగరేణిపై కన్నేసిందని మండిపడ్డారు. గతంలో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం సింగరేణి నుంచే ఉవ్వెత్తున ఎగిసి గమ్యాన్ని ముద్దాడిందన్నారు. ఈ సారి పురుడుపోసుకునే మహోద్యమంతో.. కేంద్ర ప్రభుత్వం కుప్పకూలక తప్పదని మంత్రి కేటిఆర్ హెచ్చరించారు.

# బండి సంజయ్ చేసిన తప్పేంటి?

### అది లీకేజీ ఎలా అవుతుంది

### లంచ్ మోషన్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ

### క్యాష్ పిటిషన్‌పై విచారణ 10వ తేదీకి వాయిదా



హైదరాబాద్, ఏప్రిల్ 6 (మనం న్యూస్): పదో తరగతి పశ్నాపత్రం లీకేజీ కేసులో అరెస్ట్ అయిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ రిమాండ్‌ను రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. 41ఏ నోటీసు ఇవ్వకుండా సంజయ్‌ను అరెస్ట్ చేశారంటూ.. హనుమకొండ కోర్టు విధించిన రిమాండ్ రద్దుపై అత్యవసర విచారణ జరపాలని న్యాయస్థానాన్ని కోరారు. న్యాయవాదుల అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్.. గురువారం మధ్యాహ్నం విచారణ జరిపారు.కరీంనగర్ నుంచి వరంగల్‌కు బండి సంజయ్‌ను తీసుకెళ్లేందుకు 300 కిలోమీటర్లు తిప్పారని ఆయన తరపు న్యాయవాది రామచంద్రరావు కోర్టుకు తెలిపారు. బండి సంజయ్‌పై ఉన్న ఆరోపణలు ఏంటని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. పేపర్ బయటకు వచ్చాక వాట్సాప్‌లో సర్క్యులేట్ చేశాడే తప్ప.. పేపర్ లీకేజీలో అతని ప్రమేయం ఎక్కడుందని ప్రశ్నించింది. క్వశ్చన్ పేపర్ పబ్లిక్ డొమైన్లోకి వచ్చిన తర్వాత అది లీకేజ్ ఎలా అవుతుందని ప్రశ్నించింది. పేపర్ బయటకు వచ్చాక ప్రతిపక్ష నేతగా ఈ అంశాన్ని ఎలా అయినా వాడుకోవచ్చని తెలిపింది.ప్రభుత్వం తరుపున వాదనలు వినిపించిన అడ్వకేట్ జనరల్.. బండి సంజయ్ పేపర్ లీకేజీలో కుట్రదారుడు అన్న విషయం తేలిందన్నారు. ప్రశాంత్‌కు, సంజయ్‌కు మధ్య టెలిఫోన్ సంభాషణ జరిగిందని, కానీ ఆయన ఇంకా తన ఫోన్‌ను ఇవ్వలేదని కోర్టుకు దృష్టికి తీసుకెళ్లారు.. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు.. ఈ కేసులో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది. ఈలోపు బండి సంజయ్ బెయిల్ పిటిషన్ వేసుకోవచ్చని తెలిపింది.అయితే ఇప్పటికే కింది కోర్టులో బెయిల్ పిటిషన్ వేశామని.. దానిపై ఈరోజే తీర్పు వచ్చేలా ఆదేశాలని ఇవ్వాలని న్యాయవాది రామచంద్రరావు తెలిపారు. శనివారం ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో సంజయ్‌పై కింది కోర్టు ఇచ్చిన రిమాండ్ రిజెక్ట్ చేయాలని కోరారు. దీనిపై హైకోర్టు స్పందిస్తూ.. కింది కోర్టులో బెయిల్ రాకుంటే హైకోర్టులో హౌజ్ మోషన్ పిటిషన్ వేసుకోవాలని సూచించింది. రిమాండ్ క్యాష్ పిటిషన్‌పై విచారణను ఈనెల 10కి వాయిదా వేసింది.

బండి సంజయ్ కస్టడీ పిటిషన్ దాఖలు చేసిన పోలీసులు పదో తరగతి పరీక్ష పత్రాలు లేకేజీలో ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి సంజయ్ కస్టడీ పిటిషన్ దాఖలు చేశారు పోలీసులు. పదవ తరగతి పరీక్షలు కొనసాగుతున్నాయని, బండి సంజయ్ కాల్ డేటా పూర్తిగా తీసుకోవాల్సి ఉందని పోలీసులు కస్టడీ పిటిషన్లో పేర్కొన్నారు. అంతేకాకుండా.. కొంతమంది నిందితులు ఇంకా పరారీలో ఉన్నారు. నిజాలను రాబట్టడానికి సాక్ష్యులను విచారించాల్సి ఉందని, బండి సంజయ్‌కు బెయిల్ ఇస్తే లా అండ్ ఆర్డర్ సమస్యలు వస్తాయని పోలీసులు పేర్కొన్నారు.బండి సంజయ్‌కు బెయిల్ ఇస్తే మళ్లీ మాల్ ప్రాక్టీస్ జరిగే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. 10వ తరగతి విద్యార్థుల పేరెంట్స్ బండి సంజయ్‌పై దాడి చేసే అవకాశం ఉందని, పరారీలో ఉన్న నిందితులను ప్రభావం చేసే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. టెక్నికల్ డేటా ఇంకా రికవరీ చేస్తున్నామని, సాక్ష్యాలను తారుమారు చేసే ప్రయత్నం చేయొచ్చని పోలీసుల కస్టడీ పిటిషన్‌లో విన్నవించారు.

## 'పది' పేపర్ లీకేజీ.. ప్రభుత్వం రాసిన స్క్రిప్టే

### బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు




హైదరాబాద్, ఏప్రిల్ 6 (మనం న్యూస్): రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యక్తిగత రాజకీయాలు నడుపుతోందని బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆక్షేపించారు. లక్షలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులకు భరోసా కల్పిం చకుండా రాజకీయం తగదని హితవు పలికారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుమార్‌ను అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. తొలుత కరీంనగర్‌లో ముందస్తుగా అదుపులోకి తీసుకుంటు న్నామని చెప్పి.. అరెస్టు చేశారని రఘునందన్‌రావు ధ్వజమెత్తారు. ఈ విషయాన్ని లోక్సభ స్పీకర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.. బీజేపీని అప్రతిష్ట పాలు చేసేందుకు వరంగల్ సీపీ రంగనాథ్ ప్రస్తావించిన అంశాలన్నీ ప్రభుత్వం చెప్పించినవేనని తప్పుబట్టారు. రాజద్రోహం, దేశద్రోహం అంటూ సీపీ మాట్లాడటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ప్రభుత్వమే కథ అల్లి పోలీసులతో చెప్పించినట్లు భావిస్తున్నామని అన్నారు. శివ గణేశ్ తీసిన ఫొటో మొదట ఎవరికి వెళ్లిందని ప్రశ్నించిన రఘునందన్‌రావు.. ఆ పేపర్ ఎంత మందికి వెళ్లిందో ఆ అందరినీ విచారించారా అని పోలీసులను నిలదీశారు. సాధారణంగా మంత్రులు, ఎమ్మెల్యేలకు సమాచారం ఇవ్వడం రివాజు అన్న ఆయన.. కేటీఆర్, హరీశ్ రావు, రేవంత్ రెడ్డి.. ఇలా అందరికీ మీడియా ప్రతినిధులు సమాచారం ఇస్తూ ఉంటారని చెప్పారు. సమాచారం పంపడమే నేరమా అంటూ మండిపడ్డారు. అధికార పార్టీని సంతృప్తి పరిచేందుకు సీపీ వ్యవరిస్తున్న తీరు సరికాదని పేర్కొన్నారు. ''బండి సంజయ్ కుమార్‌ను అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గం. లక్షలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులకు భరోసా కల్పించకుండా రాజకీయం తగదు. వరంగల్ సీపీ రంగనాథ్ మీడియాకు చెప్పిన అంశాలన్నీ ప్రభుత్వం చెప్పినవే. శివ గణేశ్ తీసిన ఫొటో మొదట ఎవరికి వెళ్లింది. ఆ పేపరు ఎంత మందికి వెళ్లిందో.. ఆ అందరినీ విచారించారా..? అధికార పార్టీని సంతృప్తి పరిచేందుకు సీపీ వ్యవరిస్తున్న తీరు సరికాదు. ఫొటో తీసిన వ్యక్తికి బీజేపీతో ఏమైనా సంబంధం ఉందా..? శివ గణేశ్ ఫోన్ వాట్సప్ వివరాలు బయటపెట్టాలి. ప్రభుత్వమే కథ అల్లి పోలీసులతో చెప్పించినట్లు భావిస్తున్నాం'' అని రఘునందన్ రావు తెలిపారు.

# రాష్ట్రంలో 9231 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్, ఏప్రిల్ 6 (మనం న్యూస్): బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాల విద్యాలయాల సొసైటీ పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తొలిదఫాలో వివిధ కేటగిరీల్లో మొత్తంగా 9231 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ రిక్రూట్మెంట్ బోర్డు (ట్రిబ్) కన్వీనర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఆయా పోస్టుల భర్తీకి సంబంధించి 12వ తేదీ నుంచి దరఖాస్తులను స్వీకరించనుంది.

**మొత్తం పోస్టులు 13వేలకు పైగానే..**

తెలంగాణ ప్రభుత్వం గురుకుల విద్యకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నది. క్రమంగా విస్తరించుకుంటూ పోతున్నది. రాష్ట్ర ఏర్పాటు నాటికి 123 గురుకుల పాఠశాలలు ఉండగా, వాటిని 1011లకు పెంచింది. అంతేగాకుండా వాటిని క్రమంగా పాఠశాల స్థాయి నుంచి ఇంటర్, డిగ్రీ స్థాయికి విస్తరించుకుంటూ పోతున్నది. ఈ క్రమంలో ఆయా గురుకులాల్లో శాశ్వత ప్రతిపాదికన పోస్టుల భర్తీని క్రమంగా చేపడుతున్నది. మూడేళ్ల క్రితమే ఆయా గురుకులాల్లో 10వేల పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టగా, తాజాగా అంతేకు మించి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తంగా ప్రభుత్వం తొలుత 9096పోస్టులను ఖాళీలుగా గుర్తించింది. అటు తరువాత మరో 33 బీసీ గురుకులాలు, 15డిగ్రీ కళాశాలల మంజూరు చేయగా అందుకు సంబంధించిన పోస్టులను కూడా భర్తీ చేయాలని నిర్ణయించింది. దీంతో మరో 3వేల పోస్టులను ప్రభుత్వం మంజూరు చేయగా, మొత్తంగా బోధన, బోధనేతర సిబ్బందికి సంబంధించి 13,530 పోస్టులను ఖాళీలుగా గుర్తించడంతోపాటు అందుకు ప్రభుత్వం అమనుతి సైతం మంజూరు చేసింది. తాజాగా వాటి భర్తీకి ట్రిబ్ చర్యలు చేపట్టింది.



**వారంలో మరో వెయ్యి పోస్టులకు నోటిఫికేషన్..**

మొత్తంగా 13,675 పోస్టుల్లో గ్రూప్3, గ్రూప్ 4 పోస్టుల మినహా మిగతా 10,675 పోస్టుల భర్తీని ట్రిబ్ ద్వారా చేపట్టనున్నారు. అందులో తొలిదఫాగా ప్రస్తుతం 9231 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. మిగతా పోస్టులకు సంబంధించి అందులో కొన్ని కొత్తగా, మెస్ ఇన్చార్జి, మరికొన్ని పోస్టులకు సర్వీస్ రూల్సు రూపొందించాల్సి ఉంది. అదికాకుండా కొన్ని న్యాయపరమైన చిక్కులు ఉన్నాయి. వాటన్నింటినీ పరిష్కరించి మరో వారం రోజుల్లో మిగిలిన పోస్టుల భర్తీకి సైతం నోటిఫికేషన్ జారీ చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇక గురుకులాలకు మంజూరైన ఏఎన్ఎం, స్టాఫ్ నర్స్ పోస్టులను మెడికల్ బోర్డు చేపట్టనుంది. ఆ నేపథ్యంలో ఎలాంటి వివాదాలు లేని పోస్టుల భర్తీ ప్రక్రియను చేపట్టింది.

## తెలంగాణలో రెండు రోజులు భారీ వర్షాలు

### ఆరెంజ్ అలెర్ట్ జారీ..!... హైదరాబాద్‌లో జోరు వర్షం..

### రోడ్లన్నీ జలయం.. వాహనదారుల ఇబ్బందులు



హైదరాబాద్, ఏప్రిల్ 6 (మనం న్యూస్): తమిళనాడు-కర్ణాటక మీదుగా ఉత్తరాది వరకు విస్తరించి ఉన్న ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. చాలా చోట్ల ఉరుములు, పిడుగులతో కూడిన వానలు కురుస్తాయని హెచ్చరించింది.ఈ మేరకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. గురువారం నుంచి శుక్రవారం ఉదయం వరకు ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, మహబూబ్‌గర్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌గర్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో వర్షం కురిసే అవకాశం ఉందంటూ ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. మిగతా జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం తెలిపింది. శుక్రవారం నుంచి శనివారం వరకు ఆదిలాబాద్, కుమ్రుంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డిలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేసింది.

# కంటి వెలుగు పథకం ఓట్ల కోసం పెట్టలేదు

### కోటి పరీక్షలు పూర్తయ్యాయి

### 29 లక్షల మందికి సమస్యలున్నట్లు తేలింది

### ఈ పథకం కోసం రూ. 250 కోట్లు ఖర్చు

### వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, ఏప్రిల్ 6 (మనం న్యూస్): కంటి వెలుగు కావాలని ఎవరు చెప్పలేదని, ఓట్ల కోసం ఈ పథకం పెట్టలేదని మంత్రి హరీశ్ రావ్ అన్నారు. సంగారెడ్డి జిల్లాలో తెలంగాణలో కోటి పరీక్షలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో సదాశివపేటలో కంటి వెలుగు కార్యక్రమాన్ని మంత్రి హరీష్ రావు పరిశీలించారు. కోటి పరీక్షలు పూర్తయిన సందర్భంగా బెలూన్లను గాల్లో ఎగురవేసిన మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. జనవరి 18- 2023న ప్రారంభం అయిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం నేటితో కోటి పరీక్షలు చేయించుకున్నారని ఆనందంగా ఉందని తెలిపారు. కంటివెలుగు పథకాన్ని ప్రతిపక్షాలు కూడా మెచ్చుకున్నాయని అన్నారు. పక్క రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా ఈ పథకాన్ని అభినందించారని తెలిపారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ సింగ్ మాన్ ఇద్దరు ఈ పథకాన్ని మెచ్చుకున్నారని అన్నారు. 1500 మంది బృందం 25 రోజుల్లో 50 లక్షలు, 50 రోజుల్లో కోటి పరీక్షలు పూర్తి చేశారని తెలిపారు.ఇవ్వాళ ఓ గొప్ప ఓ రోజునేటితో కంటివెలుగు పరీక్షలు కోటి పూర్తయ్యాయని అన్నారు. కంటి వెలుగు కావాలని ఎవరు చెప్పలేదు.. ఓట్ల కోసం ఈ పథకం పెట్టలేదని అన్నారు. కంటి సమస్యతో ఎవరు ఇబ్బంది పడొద్దని కేసీఆర్ అనుకున్నారని.. దేశంలో ఇంత పెద్ద పథకం ఎక్కడ లేదని మంత్రి తెలిపారు. డాక్టర్లే పేషేంట్ల దగ్గరికి వచ్చి పరీక్షలు చేస్తున్నారని అన్నారు. ఇంటింటికి మిషన్ భగీరథ నీరిచ్చి ఆడబిడ్డలకు తోబుట్టువుగా నిలిచారు కేసీఆర్ అన్నారు. సంక్షేమ పథకం అందని ఇల్లే లేదు తెలంగాణలో అని ఆనందం వ్యక్తం చేశారు. కోటి మందిలో 29 లక్షల మందికి కంటి సమస్య ఉన్నట్టు తేలిందని అన్నారు. రాష్ట్రంలో 55 శాతం గ్రామాల్లో కంటి వెలుగు పరీక్షలు పూర్తి అయ్యాయని అన్నారు. ఇంకో 50 రోజుల్లో 45 శాతం గ్రామాల్లో పూర్తి చేస్తామన్నారు. 250 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి కంటి వెలుగు కార్యక్రమం చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెంచినామని అన్నారు.ప్రభుత్వ ఆస్పత్రుల్లో 84 శాతం ప్రసవాలు అవుతున్నాయని తెలిపారు. మహేంద్ర నాథ్ అని కేంద్ర మంత్రి తెలంగాణకి వచ్చి నీతులు చెబుతాడని మండిపడ్డారు. ఆయనది యూపీ.. యూపీ వైద్యంలోనే చిట్టచివరన ఉందని ఎద్దేవ చేశారు. మొన్న నిర్మలా సీతారామన్ ని మహిళలు అడ్డుకుని గ్యాస్ ధరలపై నిలదీశారని గుర్తు చేశారు. ఇవ్వక ఇవ్వక తెలంగాణకు ఎయిమ్స్ మెడికల్ కాలేజి ఇస్తే నాలుగేళ్ళ నుంచి పనులు చేస్తనే ఉన్నారని అన్నారు. ఇప్పుడు మళ్లీ మోడీ వచ్చి కొబ్బరి కాయ కొడుతాడట! అంటూ వ్యంగాస్త్రం వేశారు. మీరు ఒక్క మెడికల్ కాలేజి ఇవ్వకున్న 26 మెడికల్ కాలేజీలు నిర్మించుకున్నామని చురకలంటించారు. బీజేపీ వాళ్ళకి పని తక్కువ ప్రచారం ఎక్కువ అంటూ ధ్వజమెత్తారు. ఆఖరి ప్రభుత్వంది ప్రచారం తక్కువ పని ఎక్కువ అని ప్రసంసించారు. మనకి ప్రచారం అవసరం లేదు అని ముఖ్యమంత్రి కేసీఆర్ ఎప్పుడు చెబుతారని మంత్రి హరీశ్ రావు అన్నారు.

## నాణ్యతతో కూడిన పనులు చేయాలి: మంత్రి



సూర్యాపేట టౌన్ ఏప్రిల్ 06 మనంన్యూస్‌: ఎక్కడ రాజీ పడకుండా నాణ్యతతో కూడిన పనులు చేసి కలిసి కట్టుగా పట్టణాన్ని అభివృద్ధి చేయాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. గురువారం మంత్రి క్యాంపు కార్యలయంలో ఇటీవల జరిగిన మున్సిపల్ కాంట్రక్టర్ అసోసియేషన్ నూతన కమిటీ ఏర్పటాయింది. అధ్యక్షుడుగా ఎన్నికైన సయ్యద్ జలీల్ పాషా ఆధ్వర్యంలో ఎన్నికైన ఆ సంఘం సభ్యులు మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..... అభివృద్ధిలో కాంట్రాక్టర్లదే కీలక పాత్ర అని పేర్కొన్నారు. గుత్తేదారుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే పరిష్కారం కొరకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నూతన అధ్యక్షునికి మంత్రి శాలువ కప్పి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుత్తేదారులు యూసుఫ్‌ఖాన్, బాపూజీరావు, దాసరి కిరణ్, శ్రీనివాస్‌రెడ్డి, హరీఫ్, సందీప్, రవి, తదితరులు పాల్గోన్నారు.

## టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో కేటీఆర్‌ను విచారించాలి

### పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి



జగిత్యాల ఏప్రిల్ 06 (మనం న్యూస్): జగిత్యాల జిల్లా కేంద్రం లోని ఇందిరా భవన్ లో ఎంఎల్ సి జీవన్ రెడ్డి ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిఎస్ పిఎస్ సి పేపర్ లీకేజీ కేసులో మంత్రి కే టీ ఆర్ ను విచారించాలని అన్నారు.చైర్మన్ జనార్దన్ రెడ్డిని భర్తరఫ్ చేస్తే కేటీఆర్ బండారం బయట పడుతుందని పేర్కొన్నారు. వాస్తవాలను వెలికి తీసేలా ప్రశ్నిస్తే రేవంత్ రెడ్డి,బండి సంజయ్ కి నోటీసులిచ్చారని,పేపర్ లీకేజీ చర్చ కనుమరుగు చేసేందుకు తెర పైకి బండి సంజయ్ అరెస్ట్ ను ముందుకుతెచ్చారని తెలిపారు..లిక్కర్ స్కాం లో ఎందరినో అరెస్టు చేస్తున్నా కవిత విషయంలో ఎందుకు ఉదాసీనంగా ఉన్నారని ప్రశ్నించారు. 30లక్షల మంది కుటుంబాల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ఎదవ తరగతి ప్రశ్నాపత్రాల లీకేజీలో ప్రభుత్వ అసమర్ధత స్పష్టంగా కనబడుతుందని, సమగ్ర విచారణ జరిపి బాధ్యుల పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గిరి నాగభూషణం, బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## బూరుగడ్డ దేవాలయంలో కొనసాగుతున్న కల్యాణోత్సవాలు

### గోదాదేవికి రూ. 5లక్షల విలువైన వెండిపట్టు చీర బహుకరణ



హుజూర్‌నగర్, ఏప్రిల్6, మనం న్యూస్‌: మండల పరిధిలోని శ్రీ ఆదివరాహ లక్ష్మీనరసింహ వేణుగోపాల స్వామి దేవాలయంలో జరుగుతున్న కల్యాణోత్సవాలలో భాగంగా గురువారం ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అలంకరణలు, పల్లకిసేవ నిర్వహించారు. దేవాలయ మాజీ చైర్మన్ కొత్త నాగరాజు- హరిప్రియ దంపతులు, కొత్త కళావతి, కామిశెట్టి స్వామి, కొండారెడ్డి, కుక్కడపు రామోహన్‌రావు, గెల్లి రంగారావు, మంత్రిప్రగడ వెంకటేశ్వర్‌రావు, అరున్‌కుమార్‌దేశ్‌ముఖ్, ఓరుగంటి పాండు, పిల్లలమర్రి నారాయణ, నాగుబండి విశ్వనాథం, బాసాని సాయిబాబా, మామిళ్ళపల్లి శ్రీనివాసచారి, బొలిశెట్టి నర్సింహరావు, చావా కిరణ్మయి, వీర్లపాటి రమేష్, యరగాని రామస్వామి దాతల సహకారంతో రూ. 5లక్షల 20వేల 1రూపాయల విలువైన 6కేజీల 200ల గ్రాముల వెండి పట్టుచీరను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంపీ. లక్ష్మణ్‌రావు, అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గండు సైదులు, ధర్మకర్తలు బండ్ల పవన్‌కుమార్, ఆకుల గుర్వయ్య, గువ్వల రామకష్ణ, పార్ధనబోయిన మట్టపల్లి, సురభి కుషేలు, నందిగామ అంజమ్మ,అర్చకులు ముడుంబై శ్రీనివాసచార్యులు, సింగరచార్యులు, అనంతచార్యులు, మనోహరచార్యులు, హరిష్‌కుమారచార్యులు, ఆలయ సిబ్బంది గోవిందరెడ్డి, యరగాని రమేష్, కిరణ్, ఉపేందర్ పాల్గొన్నారు

## మరణించిన కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



వరంగల్ టౌన్, ఏప్రిల్ 6, మనం న్యూస్ : వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ గురువారం పలు మరణించిన కుంటుంబాలను పరామర్శించారు. 36 వ డివిజన్ చింతల్ ఆర్ఎస్ నగర్ ప్రాంతానికి చెందిన వడ్డే లక్ష్మి స్వర్గస్థులైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి నివాసానికి వెళ్లి పార్థివదేహానికి పూల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి ఆర్థికసాయం అందజేశారు. 36 వ డివిజన్ చింతల్ ప్రాంతానికి చెందిన సయ్యద్ హుస్సేన్ ఇటీవలే మరణించగా వారి నివాసానికి వెళ్లి హుస్సేన్ కి నివాళులర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అనంతరం 36 వ డివిజన్ చింతల్ ప్రాంతానికి చెందిన రాయపురం భాస్కర్ ఇటీవలే మరణించగా వారి నివాసానికి వెళ్లి చిత్రపటం వద్ద నివాళులర్పించి వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి ఆర్థికసాయం అందజేశారు. ఎమ్మెల్యేతో పాటు బిఆర్ఎస్ నాయకులు మర్రి శ్రీనివాస్, షరతపుద్దీన్, సుల్తాన్ అలీ, ఫసియోద్దీన్, ఖాజా, అజీం, ముజ్జు, అనిల్, ఎల్లయ్య, సురేష్, రమేష్, నరేష్, ఎల్లయ్య, మురళీ, రాజేందర్, నవీన్, సమ్మయ్య, సన్నీ, ఆపిల్, చింటూ తదితరులు ఉన్నారు.

# ఊరూరా అభివృద్ధి... గడపగడపకూ సంక్షేమం

**ఒక్క కేసీఆర్ తోనే తెలంగాణ అభివద్ధి సాధ్యం**

**పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త సైనికునిలా నిలబడాలి**

**జోరుగా బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాలు**



వరంగల్, ఏప్రిల్ 6, మనం ప్రతినిధి : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ప్రతీ సంక్షేమ పథకాన్ని ప్రజల్లోకి మరింత లోతుగా తీసుకువెళ్లాలని బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు, వర్దన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రేటర్ వరంగల్ 1, 2వ డివిజన్ ల బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి రాష్ట్ర జల వనరుల అభివద్ధి సంస్థ చైర్మన్ ప్రకాష్, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్యే అరూరి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గుండ్లసింగారం లోని సాయి కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పార్టీ శ్రేణులు అతిథులకు డప్పు చప్పుల్లు, కోలాటాలుతో ఘన స్వాగతం పలికారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ జండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జల వనరుల అభివద్ధి సంస్థ చైర్మన్ ప్రకాష్ మాట్లాడుతూ పది ఏళ్ల క్రితం తెలంగాణ పల్లెలు ఎలా ఉన్నాయి.... ఇప్పుడు ఎలా ఉన్నాయో మన కళ్ళ ముందు కనిపిస్తుందని అన్నారు. నడి ఎండ కాలంలో కాలువలలో నిండుగా నీళ్లు ఎప్పుడన్నా పోయినయా... ఇంటింటికి నల్లా నీళ్లు వచ్చినయా ప్రజలు ఆలోచించాలని కోరారు. మూడు ఏళ్లలోనే కాళేశ్వరం పూర్తి చేసి తెలంగాణను సస్యశ్యామలం చేసిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందని తెలిపారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి త్రాగు నీరు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం మాత్రమేనని వెల్లడించారు. అందుకే దేశ ప్రజలు సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. అలాంటి గొప్ప విజన్ ఉన్న నాయకుడు మనకు ముఖ్యమంత్రిగా ఉండడం మన అదష్టం అని తెలిపారు. కేంద్రంలోని బిజెపి పార్టీ చేస్తున్న నీతిమాలిన రాజకీయాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే అరూరి రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్





నాయకత్వంలో తొమ్మిదెండ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రజల అవసరాలను ముందుగానే గుర్తించి దానికి అనుగుణంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అని తెలిపారు. వర్దన్నపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దెందుకు శాయశక్తుల కషి చేస్తున్నాని వెల్లడించారు. పార్టీ కోసం నిబద్ధతతో పని చేస్తున్న కార్యకర్తల కషి వెలకట్టలేనిదని అన్నారు. ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. ఇతర రాజకీయ పార్టీలు కేవలం ఎన్నికలు, రాజకీయ ప్రయోజనాలకే పకులడుతున్నాయని విమర్శించారు. తెలంగాణా రాష్ట్రానికి మరోసారి కెసిఆర్ నాయకత్వం అవసరమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, స్థానిక డివిజన్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# తండాలకు పల్లె వెలుగు వచ్చిందోచ్

### 'మనం ' కథనానికి స్పందించిన ఆర్టీసీ అధికారులు



పర్వతగిరి, ఏప్రిల్ 6, మనం న్యూస్ : ఎన్నో ఏళ్లుగా ప్రజలు పడుతున్న కష్టాలకు నేడు ఫులిస్టాఫ్ పడింది. మనం తెలుగు దినపత్రిక చూపిన చొరవ, ఆర్టీసీ అధికారుల స్పందనకు గిరిజన తండాల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి బస్సు సౌకర్యానికి నోచుకోని గ్రామాలకు బుదవారం నుంచి సర్వీసులు ప్రారంభమ య్యా యి. ఎర్రబస్సు ఎరుగని గిరిజన తండాల్లో పల్లె వెలుగు ప్రత్యక్షమైంది. తమ తండాలను కలుపుతూ వరం గల్ -మహబూబాబాద్ వరకు బస్సు సౌకర్యం కోసం స్థానిక గిరిజ నులు గత మార్చి నెలలో ఆందోళన చేపట్టారు.ఈ నేపద్యంలో శీర్షిక మార్చి 14 న తండాలకు రాని 'పల్లె వెలుగు' రోడ్లున్నా బస్సులు సున్నా అనే కథనాన్ని మనం జాతీయ తెలుగు దినపత్రిక ప్రచురించింది. ఎట్టకేలకు కదిలిన ఆర్టీసీ యాజమాన్యం బుధవారం నుంచి పర్వతగిరి మండలంలోని ఇస్లావత్ తండా మీదుగా మహబూబాబాద్ డిపోకు చెందిన బస్సు సర్వీసు కల్పించారు. తమ బాధలను అర్థం చేసుకోని మనం జాతీయ తెలుగు దినపత్రిక ద్వారా వెలుగులోకి తెచ్చిన స్థానిక మనం దినపత్రిక విలేఖరి గడ్డం కరుణాకర్, ప్రతినిధులకు, బస్సు సౌకర్యం




కల్పించిన ఆర్టీసీ అధికారులకు, స్థానిక సర్పంచ్ ఇస్లావత్ రమేష్ నాయక్, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు, మేధావులు, యువజనులు, వివిధ పార్టీల ముఖ్య నాయకులు, యూత్ అసోసియేషన్స్, సామాజిక కార్యకర్తలు, మహిళా సంఘాల నేతలు, పర్వతగిరి మండల మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రి, ఇస్లావత్ అనిల్, నరేష్,రాజేందర్, సునీత, విమల, చంద్రమ్మ, దల్ సింగ్, లోక్య, హస్లీ, కనకమ్మ, ఆగమ్మ, యాకమ్మ, సేవాలాల్ సేన యూత్ అధ్యక్షులు, కార్యదర్శి, యూత్ సభ్యులు కతజ్ఞతలు తెలియజేశారు. అలాగే నర్సంపేట-తొర్రూర్ బస్సు సర్వీసు కల్పించాలని కోరుతున్నారు.

## హాలియా పట్టణ మార్కెట్‌యార్డుని పరిశీలించిన ఎమ్మెల్యే భగత్



హాలియా, ఏప్రిల్ 6 (మనం న్యూస్) : మార్కెట్ యార్డులో అకాల వర్షాల వల్ల మార్కెట్ యార్డ్ లోకి వరద నీరు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించిన ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ గారు. ఈ కార్యక్రమం లో జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దలు, మున్సిపాలిటీ చైర్మన్ పార్వతమ్మ శంకరయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ జువాజీ వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షులు కూరాకుల వెంకటేశ్వర్లు, టౌన్ అధ్యక్షులు చెరుకుపల్లి ముత్యాలు, కౌన్సిలర్లు నల్లబోతు వెంకటయ్య, ప్రసాద్ నాయక్,ఎంపీటీసీ కొండ రమేష్, పులిమామిడి సర్పంచ్ వెంక రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ సురభి రాంబాబు, బీఆర్ఎస్ నాయకులు జింకల ప్రసాద్, చెన్నయ్య, దోరేపల్లి వెంకన్న, సింగారం మహేష్,చెరుకుపల్లి చంద్రశేఖర్,తరి వెంకటయ్య, మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి పువ్వాడ



ఖమ్మం, ఏప్రిల్ 6 (మనం బ్యూరో) : ప్రజల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చిందని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ఖమ్మం నగరం నుండి వివిధ అనారోగ్య కారణాలతో చికిత్స అనంతరం సీఎంఆర్ఎఫ్కి దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరైన 184-చెక్కులను మంత్రి పువ్వాడ తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు. ఖమ్మం నుండి 184 మందికి గాను రూ.66.89లక్షల విలువైన చెక్కులను స్వయంగా పంపిణీ చేశారు. నేటి వరకు 4723 చెక్కులకు గాను రూ.20.27కోట్ల విలువైన చెక్కులు అందజేయడం సంతోషంగా ఉందని మంత్రి పేర్కొన్నారు.పేద, మధ్య తరగతి ప్రజలకు ఆపత్కాలంలో సిఎం రిలీఫ్ ఫండ్ వరంలా మారిందని, ప్రజల ఆరోగ్యానికి తెలంగాణ ప్రభుత్వం భరోసా కల్పిస్తుందన్నారు. సిఎం కెసిఆర్ పేదల ఆరోగ్య పట్ల ప్రత్యేక శ్రద్ధను చూపుతున్నారని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటికే కోట్లాది రూపాయాలను సిఎం సహాయ నిధి నుంచి అందివ్వడం జరిగిందన్నారు. మునుపెన్నడూ ఇంత పెద్ద మొత్తంలో పెద్ద సంఖ్యలో పేదలకు లబ్ధి జరగలేదన్నారు.అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలు స్థానిక నాయకుల ద్వారా మా దృష్టికి తీసుకువచ్చినా, నేరుగా తమ కార్యాలయానికి వచ్చిన వారికి అండగా ఉండి వారి ధరకాస్తును మంజూరు చేసే వరకు మా బాధ్యత అని అన్నారు.

## సివిల్ రైట్స్ డే నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలి: కలెక్టర్ శశాంక



మహబూబాబాద్, ఏప్రిల్ 6 (మనం ప్రతినిధి): సివిల్ రైట్స్ డే నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శశాంక బిజినెస్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని కోరారు.గురువారం ఐడిఓసి లోని కలెక్టర్ సమావేశం మందిరంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం ను కలెక్టర్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రతి నెలలో చివరి రోజు తప్పనిసరిగా సివిల్ రైట్స్ డే నిర్వహించా లన్నారు.ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులపై అవగాహన పరచాలని కమిటీ ఆ దిశగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను పరిచయం చేసుకొని అభినందించారు కమిటీని విజయవంతంగా నడపా లన్నారు. ఈ కమిటీ సమావేశంలో జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ అభివృద్ధి అధికారి సన్యాసయ్య కమిటీ సభ్యులు గుగులోత్ కిషన్ నాయక్ పిల్లి సుధాకర్ నాయకులు సంజీవ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పరీక్ష కేంద్రాలలోకి మొబైల్ ఫోన్లు ఎవరికీ అనుమతి లేదు

### పరిశీలించిన మహబూబాబాద్



జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్

మహబూబాబాద్, ఏప్రిల్ 6 (మనం ప్రతినిధి): పరీక్షా కేంద్రాలలో మొబైల్ ఫోన్లకు ఎవరికి ఎలాంటి అనుమతి లేదని, విద్యార్థుల భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకుని పరీక్ష కేంద్రాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు మహబూబాబాద్ ఎస్పి శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ అన్నారు.గురువారంనాడు కురవి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏకలవ్య మోడెల్ పాఠశాలలోని పదవ తరగతి పరీక్షా కేంద్రాలను మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పరిశీలించారు.పరీక్ష కేంద్రాల లోపలికి వెళ్ళేటప్పుడు గేట్ వద్ద డ్యూటీ చేస్తున్న అధికారులు లోనికి వెళ్లే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని సూచించారు. సెంటర్ కు వెళ్లే సమయంలో తనిఖీలలో భాగంగా లోపలికి వెళ్ళేటప్పుడు ఎస్పీ మొబైల్ ఫోన్, ఇతర సిబ్బంది మొబైల్ ఫోన్స్ సైతం గేట్ బయటే ఉంచి లోనికి

# ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో గ్రామాలకు మహర్దశ

**- పల్లెపల్లెకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు**

**- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి**

హుజూర్‌నగర్,ఏప్రిల్3,మనంన్యూస్‌: ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో గ్రామాలకు మహర్ధశ అని, అన్నివర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్నాయని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని శ్రీనివాసపురం గ్రామంలో రూ. 60లక్షలతో సీసీరోడ్డు పనులు ప్రారంభించి,రూ. 8లక్షల వేయంతో యాదవ్ కమ్యూనిటి హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన, రూ.



20లక్షలతో నిర్మిస్తున్న గ్రామపంచాయితీ కార్యాలయానికి ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల వైపు దేశం యావత్ చూస్తుందని ప్రభుత్వ సంక్షేమ పథకాలను పల్లెపల్లెన ప్రతి ఇంటికి అందించే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన ఉందని అన్ని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో రూ. 3500 కోట్ల రూపాయలతో మూడున్నర సంవత్సరాల కాలంలో ఎన్నో అభివద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, సర్పంచ్ పత్తిపాటి రమ్యానాగరాజు, చావా వీరభద్రరావు, దొంతగాని శ్రీనివాస్, ఎంపీటీసీ విజయలక్ష్మీ, మండల ప్రజాప్రతినిధులు, ముఖ్యానాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామి పాలకవర్గం ప్రమాణస్వీకారం... మండల పరిదిలోని లింగగిరి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ నూతన పాలకవర్గం చే గురువారం దేవదాయ శాఖ అధికారులు, ఎమ్మెల్యే



శానంపూడి సైదిరెడ్డి సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ పరిశీలకులు రమేష్, ఈవో గుజ్జుల కొండారెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఉద్దోజు భిక్షమాచారి, కవిత, లక్ష్మయ్య, అంజయ్య, ప్రధాన అర్చకులు దామోదరచార్యులు, సర్పంచ్ కర్నాటి అంజిరెడ్డి, ఎంపీటీసీ విజయలక్ష్మీ, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

# ఆరేళ్ల తర్వాత అగ్రస్థానం

ఫిఫా ఫుట్‌బాల్ ర్యాంకింగ్స్‌లో అర్జెంటీనా ఆరేళ్ల తర్వాత మళ్లీ అగ్రస్థానాన్ని అధిరోహించింది. ఇటీవలే పనామా, కురాకోతో జరిగిన ఫ్రెండ్లీ మ్యాచ్‌లలో విజయాలు అందుకున్న అర్జెంటీనా 1840. 93 పాయింట్లతో నెంబర్ వన్ స్థానాన్ని ఆక్రమించింది. ఫిఫా ర్యాంకింగ్స్‌లో మెస్సీ సేన ఆరేళ్ల తర్వాత అగ్రస్థానంలో నిలవడం విశేషం.ఇక గతేడాది డిసెంబర్‌లో ఖతార్ వేదికగా జరిగిన ఫిఫా వరల్డ్ కప్‌లో అర్జెంటీనా విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ఫైనల్లో ఫ్రాన్స్‌ను పెనాల్టీ షటౌట్‌లో 4-2తో ఓడించి మూడోసారి విజేతగా నిలిచింది. అన్నీ తానై జట్టును నడిపించిన మెస్సీ తన కోరికను నెరవేర్చుకోవడంతో పాటు అర్జెంటీనా 36 ఏళ్ల నిరీక్షణకు తెరదించాడు.ఇక ఫిఫా వరల్డ్ కప్ రన్నరప్‌గా నిలిచిన ఫ్రాన్స్ 1838.45 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. యుఇఎఫ్‌ఎ యూరో క్వాలిఫైయింగ్‌లో భాగంగా ఫ్రాన్స్.. నెదర్లాండ్స్, రిపబ్లిక్ ఆఫ్ ఐర్లాండ్‌లను ఓడించి ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి దూసుకొచ్చింది. ఇక ఏడాది కాలంగా నెంబర్ వన్ స్థానంలో ఉన్న బ్రెజిల్.. ఫిఫా వరల్డ్ కప్‌లో మొరాకో చేతిలో 2-1తో ఓడింది. ఆ తర్వాత బ్రెజిల్ ఆశించినంతగా ఆడలేక 1834.21 పాయింట్లతో మూడో స్థానానికి పడిపోయింది. ఇక బెల్జియం 1792. 53 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉండగా.. ఇంగ్లండ్ 1792.43 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచింది. నెదర్లాండ్స్ 1731. 23 పాయింట్లతో ఆరో స్థానంలో ఉండగా.. యూరోప్ దేశాలైన క్రొయేషియా, ఇటలీ, పోర్చుగల్, స్పెయిన్ ఆరు నుంచి పది స్థానాల్లో నిలిచాయి.



## ఆర్సీబీ గెలవాలని కోరుకుంటున్నా

### కానీ ఛాంపియన్‌గా నిలిచేది ఆ జట్టే: ఏబీడీ




న్యూఢిల్లీ: ఐపీఎల్-16 రసవత్తరంగా సాగుతోంది. ప్రతి జట్టు నువ్వానేనా అంటూ పోటీ పడుతున్నాయి. దీంతో ఐపీఎల్ 2023 సీజన్ విజేత ఎవరో అన్న అంశంపై అప్పుడే చర్చ మొదలైంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మాజీ ఆటగాడు ఏబీ డివిలియర్స్ ప్రస్తుత సీజన్‌లో ఏ జట్టు విజేతగా నిలుస్తుందో అంచనా వేసేశాడు. తనకు ఆర్సీబీ గెలవాలని ఉన్నా.. హార్ధిక్ పాండ్య సారథ్యం వహిస్తున్న గుజరాత్ టైటన్స్ జట్టు ఛాంపియన్‌గా నిలుస్తుందని జోస్యం చెప్పాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన అతడు ఈ వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుత సీజన్‌లో ఏ జట్టు ఛాంపియన్‌గా నిలుస్తుందని ఏబీడీని ప్రశ్నించగా.. ''చాలా కష్టమైన ప్రశ్న. చాలా రోజుల క్రితం ఐపీఎల్ వేలం సమయంలో.. ఈసారి కూడా గుజరాత్ టైటన్స్ విజయ దుందుభి మోగిస్తుందని చెప్పాను. నిజంగా నేను ఆర్సీబీ గెలవాలని కోరుకుంటున్నప్పటికీ అప్పుడు చెప్పిన మాటలకే కట్టుబడి ఉంటాను. గతేడాది నుంచి జీటీ గొప్ప జట్టును కలిగి ఉంది. మంచి బాలెన్స్, తగినంత శక్తితో ఆ జట్టు బలంగా ఉంది. ఆర్సీబీ కూడా అన్నివిధాలా రాణిస్తుందని ఆశిస్తున్నాను'' అని తెలిపాడు.గతేడాది ఛాంపియన్‌గా నిలిచిన గుజరాత్ టైటన్స్ ప్రస్తుత సీజన్లోనూ దూసుకుపోతోంది. ఇప్పటి వరకు ఆడిన రెండు మ్యాచుల్లో విజయం సాధించింది. ఫాఫ్ డుప్లెసిస్ సారథ్యం వహిస్తున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సైతం బోణీ కొట్టింది. తొలి మ్యాచ్‌లోనే ముంబయిపై ఘనవిజయం సాధించిన ఆర్సీబీ నేడు కోల్‌కతాతో తలపడనుంది.

## టీమిండియాలోకి ఆంధ్ర ఆటగాడు..!

### డబ్ల్యూటీసీ ఫైనల్‌కు శ్రేయస్ అయ్యర్ దూరం




న్యూఢిల్లీ: టీమిండియా వెటరన్ ఆటగాడు, ఆంధ్రా క్రికెట్ జట్టు కెప్టెన్ హనుమ విహారి బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్‌ను కోల్పోయిన సంగతి తెలిసిందే. తాజాగా బీసీసీఐ 2023-24 గాను ప్రకటించిన సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాలో హనుమ విహారికి చోటు దక్కలేదు. దీంతో అతడు మళ్లీ భారత జట్టులోకి రీఎంట్రీ ఇవ్వడం దాదాపు కష్టమని అంతా భావించారు. కానీ విహారి మళ్లీ భారత జట్టులోకి పునరాగమనం చేసే ఇంకా దారులు మూసుకుపోలేదు. ఆస్ట్రేలియాతో జరగనున్న వరల్డ్ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్‌కు భారత జట్టులో హనుమ విహారికి చోటు దక్కనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. డబ్ల్యూటీసీ ఫైనల్‌కు వెన్ను గాయం కారణంగా దూరమైన శ్రేయస్ అయ్యర్ స్థానంలో విహారి ఎంపిక చేయాలని భారత సెలక్టర్లు యోచిస్తున్నట్లు సమాచారం. కాగా విహారీ దేశీవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణిస్తున్నాడు.రంజీ ట్రోఫీ 2022-23 సీజన్లో విహారి అదరగొట్టాడు. ఈ క్రమంలోనే అతడికి మళ్లీ పిలుపునివ్వాలని సెలక్టర్లు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. కాగా గతంలో కూడా టీమిండియా తరుపున ఎన్నో వీరోచిత ఇన్నింగ్స్‌లు ఈ ఆంధ్రా కెప్టెన్ ఆడాడు. లండన్ వంటి స్వింగ్ పిచ్‌లపై అద్భుతంగా ఆడే సత్తా హనుమ విహారికి ఉంది.ఇక ఇదే విషయంపై బీసీసీఐ సీనియర్ అధికారి ఒకరు స్పందిస్తూ.. 'శ్రేయస్ అయ్యర్ మా జట్టులో చాలా కీలమైన ఆటగాడు. అతడు డబ్ల్యూటీసీ ఫైనల్‌కు దూరం మాకు పెద్ద ఎదురుదెబ్బ అనడంలో ఎటువంటి సందేహం లేదు. అతడు చాలా అనుభవజ్ఞుడైన ఆటగాడు. గతంలో ఆస్ట్రేలియా వంటి పిచ్లపై అద్భుతమైన ప్రదర్శన చేశాడు. ఇంగ్లండ్‌లో ఆడిన అనుభవం కూడా అయ్యర్‌కు ఉంది. అతడి స్థానాన్ని మరో అనుభవజ్ఞుడైన ఆటగాడితో భర్తీ చేయాలని భావిస్తున్నాము.మా సెలక్టర్లు హనుమ విహారి పేరును పరిశీలిస్తున్నారు. మే మొదటి వారంలో జరగనున్న సెలక్షన్ మీటింగ్‌లో తుది నిర్ణయం తీసుకుంటారని' పేర్కొన్నారు. కాగా విహారి చివరగా భారత్ తరపున గతేడాది ఇంగ్లండ్‌పై ఆడాడు. అప్పటి నుంచి అతడు జాతీయ జట్టుకు దూరంగా ఉన్నాడు.

## రాజస్థాన్ రాయల్స్‌కు పెద్ద ఝలక్

### ఆ విధ్వంసకర ఓపెనర్ దూరం



న్యూఢిల్లీ: నిన్న పంజాబ్ కింగ్స్ చేతిలో ఓటమిపాలైన రాజస్థాన్ రాయలస్‌కు ఆ బాధ నుంచి కోలుకోకముందే ఒక పెద్ద ఝలక్ తగిలింది. ఏప్రిల్ 7వ తేదీన ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరగనున్న మ్యాచ్‌కు.. ఆ జట్టు విధ్వంసకర ఓపెనర్ జాస్ బట్లర్ దూరం కానున్నాడు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్లో ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో బట్లర్ చేతి వేలుకు గాయమైంది. ఈ గాయం కారణంగానే అతడు ఆ మ్యాచ్లో రాజస్థాన్ రాయల్స్ బ్యాటింగ్ ఇన్నింగ్స్‌లో ఓపెనింగ్‌కు రాలేదు. అతని స్థానంలో అశ్విన్ వచ్చాడు. అయితే.. వెంటనే తొలి వికెట్ పడటంతో బట్లర్ వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కి వచ్చాడు.బ్యాటింగ్ చేస్తున్న సమయంలో బట్లర్ కాస్త ఇబ్బంది పడుతున్నట్టు కనిపించాడు. అప్పటికీ భారీ షాట్లు బాదేందుకు ప్రయత్నించాడు. 19 పరుగులు చేయగలిగాడు. అయితే.. ఆ గాయం తీవ్రమైతే మరిన్ని సమస్యలు ఎదుర్కోవలసి వస్తుంది కాబట్టి, తదుపరి మ్యాచ్‌లో బట్లర్కు విశ్రాంతి ఇవ్వాలని రాజస్థాన్ రాయల్స్ మేనేజ్మెంట్ నిర్ణయించినట్టు తెలిసింది. పోస్ట్ మ్యాచ్ ప్రెజెంటేషన్ సమయంలోనూ.. బట్లర్ పూర్తిగా ఫిట్‌గా లేడని ఆ జట్టు కెప్టెన్ సంజూ శాంసన్ కూడా తెలిపాడు. దీన్ని బట్టి.. ఆ గాయం తీవ్రత ఏంటో అర్థం చేసుకోవచ్చు. అతనికి విశ్రాంతి ఇవ్వడమే సరైన నిర్ణయమని జట్టు యాజమాన్యం భావించింది. బట్లర్ స్థానంలో సౌతాఫ్రికా వికెట్ కీపర్ బ్యాటర్ డోనవాన్ ఫెరీరాను జట్టులో తీసుకోనున్నారని సమాచారం.

## చీరకట్టులో మెరిసన హర్మన్ ప్రీత్ కౌర్



న్యూఢిల్లీ: భారత మహిళా క్రికెట్ జట్టు సారథి హర్మన్ ప్రీత్ కౌర్ కొత్త లుక్‌తో అదరగొట్టింది. ఎప్పుడూ స్పోర్ట్స్ డ్రెస్‌లో కనిపించే ఈ అమ్మడు.. కొత్తగా చీరకట్టులో కనిపించి అభిమానుల ప్యూజులు ఎగరగొట్టింది. భారతీయత ఉట్టిపడేలా చీరకట్టులో తళుక్కుమన్న హర్మన్ ను చూసి నెటిజన్స్ అవాక్కవుతున్నారు. ఈ ఫోటోను హర్మన్ స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో పోస్ట్ చేయగా నెటిజన్స్ నుంచి ఊహించని రెస్పాన్స్ వస్తుంది.కొందరు హర్మన్ ఫోటోను చూసి అచ్చం మళయాళ కుట్టిలా ఉందని అంటుంటే మరికొందరేమో బెంగాళీ భామ అని ఇంకొందరు అచ్చం తెలుగమ్మాలా కనిపిస్తుందని కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి ఈ పోస్ట్ చేసిన గంటల వ్యవధిలోనే లక్షల్లో వ్యూస్.. లైక్స్ రావడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.ఇదిలా ఉంటే ఇటీవలే ముగిసిన మహిళల ఐపీఎల్‌లో అరంగ్రేటం సీజన్‌లో హర్మన్ నేతృత్వంలో ముంబై ఇండియన్స్ మహిళల జట్టు ఛాంపియన్‌గా అవతరించింది. ఆరంభ ఎడిషన్‌లో మొత్తం 10 మ్యాచ్‌లు ఆడిన హర్మన్ 40.41సగటున.. 135 స్ట్రయిక్ రేట్ తో 281 పరుగులు చేసింది. ఇందులో 3 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

## ఐపీఎల్లో చరిత్ర సృష్టించిన ధవన్..




న్యూఢిల్లీ: ఐపీఎల్లో టీమిండియా వెటరన్ ఓపెనర్ శిఖర్ ధవన్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఇంతవరకూ ఏ ఒక్క భారత క్రికెటర్ ఇప్పటివరకూ సాధించని రికార్డ్‌ని తన సొంతం చేసుకున్నాడు. బుధవారం రాత్రి రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అర్థశతకంతో (86) శివాలెత్తిన శిఖర్‌కి ఇది ఐపీఎల్‌లో 48వ అర్ధశతకం. దీంతో.. ఐపీఎల్‌లో అత్యధిక హాఫ్ సెంచరీ లు చేసిన తొలి భారత బ్యాటర్‌గా అతడు రికార్డ్ నెలకొల్పాడు. అయితే.. డేవిడ్ వార్నర్ మాత్రం 54 అర్ధశతకాలతో అగ్రస్థానంలో ఉండగా, కింగ్ కోహ్లీ 45 అర్ధశతకాలతో మూడో స్థానంలో ఉన్నాడు. రాజస్థాన్ రాయల్స్‌పై శిఖర్ ధవన్‌కు ఇదో ఏడో హాఫ్ సెంచరీ. అయితే.. చెన్నై సూపర్ కింగ్స్ జట్టుపై 8 అర్ధశతకాలు చేసి, ఆ జట్టుపై అత్యధిక హాఫ్ సెంచరీలు నమోదు చేశాడు. అనంతరం ప్రస్తుతం తాను ఏ జట్టు (పంజాబ్ కింగ్స్) తరపున అయితే ఆడుతున్నాడో, గతంలో ఆ జట్టుపైనే ఏడు అర్ధశతకాలు బాదాడు. ఇక ముంబై ఇండియన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లపై ఆరు హాఫ్ సెంచరీలు నమోదు చేశాడు.

## సంజూ శాంసన్ దెబ్బ.. ఆల్‌టైమ్ రికార్డ్ అబ్బ



న్యూఢిల్లీ: రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ సంజూ శాంసన్ తాజాగా ఒక అరుదైన ఘనత సాధించాడు. అజింక్యా రహానే పేరిట ఉన్న రాజస్థాన్ రాయల్స్ ఆల్‌టైమ్ టాప్ రన్ స్కోరర్ రికార్డును అతడు బద్దలుకొట్టాడు. బుధవారం (ఏప్రిల్ 5) పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్లో 42 పరుగులతో చెలరేగిన సంజూ.. తన 3 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఈ ఫీట్ నమోదు చేశాడు. రాజస్థాన్ జట్టు తరపున రహానే 3098 పరుగులు చేయగా.. నిన్నటి మ్యాచ్లో చేసిన 42 పరుగులు కలుపుకొని సంజూ 3138 పరుగులు సాధించాడు. రాజస్థాన్ రాయల్స్ తరపున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో సంజూ, అజింక్యా వరుసగా మొదటి రెండు స్థానాల్లో ఉండగా.. వారి తర్వాత షేన్ వాట్సన్ (2474), జోస్ బట్లర్ (2377) ఉన్నారు. మొదటి నుంచి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున ఆడుతున్న కోహ్లీ.. మొత్తం 224 మ్యాచ్లో 6706 పరుగులు సాధించాడు. ఇందులో 5 సెంచరీలు, 45 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

## హనుమాన్ జయంతి సందర్భంగా 'అదిపురుష్' నుంచి పోస్టర్ రిలీజ్



ప్రభాస్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ ఆదిపురుష్. రామయాణం ఆధారంగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో ప్రభాస్ రాముడిగా కనిపిస్తుండగా, కృతిసనన్ సీతగా దర్శనమివ్వనుంది. 400 కోట్ల బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాకు ఓం రౌత్ దర్శకత్వం వహిస్తున్నారు. పాన్ ఇండియా ప్రాజెక్టుగా తెరకెక్కుతున్న ఈ సినిమా 2023 జూన్ 16న విడుదల కానుంది. ఇటీవల రామ నవమి సందర్భంగా 'ఆదిపురుష్' సినిమా కొత్త పోస్టర్‌ని విడుదల చేసిన మేకర్స్ ఇప్పుడు హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ పోస్టర్‌ను విడుదల చేశారు. 'రామ భక్తుడు, రాముడి ఆత్మ.. జై పవన్‌పుత్ర హనుమాన్!' అని క్యాప్షన్ ఇస్తూ, రామభక్తిలో మునిగిపోయిన హనుమంతుని పోస్టర్‌ను షేర్ చేశారు. ఇక ఈ చిత్రంలో హనుమంతుడిగా దేవదత్ నాగే నటించారు. ఈ సినిమా టీజర్ విడుదలైనప్పటినుంచి ఇప్పటికే పలు వివాదాలు చుట్టుముట్టాయి. మొన్నటికి మొన్న రామనవమి సందర్భంగా విడుదల చేసిన లుక్లో కూడా రాముడు, సీత, లక్ష్మణుడి వేషధారణపై పలు విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. మరి తాజాగా విడుదలైన పోస్టర్‌తో ఇంకేమైనా వివాదాలు తలెత్తుతాయా అన్నది చూడాల్సి ఉంది.

## సిల్వర్ స్క్రీన్ మీదకు మరో షార్ట్ ఫిల్మ్ హీరో



మీటర్ సినిమాతో తన కల నెరవేరిందం టున్నాడు నటుడు కుమార్ కాసారం. కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన 'మీటర్' సినిమాలో కుమార్ కాసారంకు మంచి పాత్ర లభించింది. యూట్యూబ్‌లో కుమార్ షార్ట్ ఫిల్మ్ చూసి ఇంప్రెస్ అవ్వడంతో దర్శకుడు రమేశ్ 'మీటర్'లో నటించే అవకాశం ఇచ్చారట. ఇటీవల జరిగిన ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్లో కిరణ్ మాట్లాడుతూ.. కుమార్ కాసారంపై ప్రశంసలు కురించాడు. అతనితో కలిసి చేసిన షార్ట్ ఫిల్మ్ జర్నీని గుర్తు చేసుకుంటూ.. కుమార్ చాలా ప్రతిభావంతుడని కితాబిచ్చాడు. 'మీటర్' ప్రిరిలీజ్ తర్వాత తనకు వరుస ఆఫర్లు వస్తున్నాయని కుమార్ సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. ఇప్పటికే హీరోగా ఓ చిత్రాన్ని పూర్తి చేశానని.. త్వరలోనే ఓ కొత్త బ్యానర్‌లో మరో చిత్రాన్ని చేయబోతు న్నట్లు వెల్లడించారు. సినిమా పరిశ్రమలో వృత్తిని కొనసాగించడానికి తన ఉద్యోగాన్ని సైతం విడిచిపెట్టాడు. మజిలీ, ఓ బేబీ, సర్ కొండ వంటి సినిమాల్లో యాక్టర్‌గా నిడివి తక్కువ ఉన్నప్పటికీ ప్రేక్షకులని బాగా ఆకట్టుకున్నాడు. ఇప్పుడు హీరోగా వరుస సినిమాలు సైన్ చేస్తున్నాడు. మరి షార్ట్ ఫిల్మ్ హీరో సిల్వర్ స్క్రీన్‌పై ఏ మేరకు రాణిస్తాడో చూడాలి.

## నా జీవితంలో అలాంటి స్క్రిప్ట్ చదవలేదు

### నాని30పై మృణాల్ ఆసక్తికర వ్యాఖ్యలు



'సీతారామం'తో అందరి మనసుల్లో చెదరని ముద్ర వేసుకుంది హీరోయిన్ మృణాల్ ఠాకూర్. ఈ సినిమా తర్వాత మంచి చిత్రాలను ఎంపిక చేసుకొని నటిస్తోంది. ఈ అమ్మడు నటించిన తాజా బాలీవుడ్ చిత్రం 'గుమరాహ్'. ఇందులో మృణాల్ పోలీస్ పాత్రలో అలరించనుంది. ఆదిత్య రాయ్ హీరోగా తెరకెక్కిన ఈ సినిమా ఏప్రిల్ 7న విడుదలవ్వనుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్ 'సీతారామం' తనపై ఎంత ప్రభావం చూపిందో చెప్పింది. అలానే నాచురల్ స్టార్ నానితో చేయనున్న సినిమా (నాని30) స్క్రిప్ట్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. 'సీతా రామం'లో నటించడం ఓ గొప్ప అనుభూతి. ఆ సినిమా తర్వాత నేను పెద్ద దర్శకనిర్మాతలను కలిసి వారితో పనిచేయాలని ఉందని అడిగినప్పుడు 'మృణాల్ మీకోసం మంచి పాత్రను సిద్ధం చేస్తాం. 'సీతారామం'లో పాత్ర కంటే గొప్పగా ఉండేలా రాయలంటే కొంచెం సమయం పడుతుంది' అని చెప్పారు. అందుకే నాకు ఆ సినిమా తర్వాత మరొక ప్రాజెక్ట్ ఓకే చేయడానికి ఆరు నెలలు పట్టింది'' అని మృణాల్ చెప్పింది. ఇక నాని 30వ సినిమా గురించి మాట్లాడుతూ తన జీవితంలో అంత మంచి స్క్రిప్ట్‌ను ఇప్పటి వరకు చదవలేదని చెప్పింది. ఈ సినిమా తొలి షెడ్యూల్ పూర్తయినట్లు తెలిపింది. త్వరలోనే రెండో షెడ్యూల్ ప్రారంభమవుతుందని.. ఇంత మంచి సినిమాలో నటిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉందని పేర్కొంది. ఇక మృణాల్ మాటలు నాని అభిమానుల్లో జోష్ నింపుతున్నాయి. నాని 30వ చిత్రంగా రానున్న ఈ సినిమాతో సౌరవ్ అనే కొత్త దర్శకుడు ఇండస్ట్రీకి పరిచయమవుతున్నాడు. ఈ సినిమా రెండో షెడ్యూల్ 40 రోజులపాటు గోవాలో జరగనుందనే వార్తలు వినిపిస్తున్నాయి.

# మనం మూవీ

## రష్మికకు ఉంగరం తొడిగిన విజయ్?



గీత గోవిందం సినిమాతో అభిమానుల మనసులను గెలుచుకున్న జంట విజయ్ దేవరకొండ- రష్మిక మందన్న. ఈ సినిమాలో వీరిద్దరి మధ్య రొమాన్స్ అయితే అప్పట్లో పెద్ద సంచలనాన్నే సృష్టించింది. ఈ చిత్రం తర్వాతే రష్మిక తన ఎంగేజ్ మెంట్‌ను కూడా క్యాన్సిల్ చేసుకుంది. దీనికి కారణం విజయ్ దేవరకొండనే అని రూమర్స్ వచ్చాయి. ఇక గీత గోవిందం తరువాత డియర్ కామ్రేడ్ సినిమాతో మరింత హీట్ పెంచారు. అందులో కూడా లిప్ లాక్‌తో ఇద్దరు అరాచకం సృష్టించారు. ఈ రెండు సినిమాలతో వీరిద్దరి మధ్య ఏదో నడుస్తోందన్న రూమర్స్ పెరిగిపోయాయి. ఎక్కడ చూసిన ఈ జంటనే కనిపించడంతో వీరిద్దరి మధ్య ప్రేమాయణం మొదలయిందని, త్వరలోనే ఈ జంట పెళ్లి చేసుకోబోతుందని పుకార్లు షికార్లు కూడా చేశాయి. అయితే తామిద్దరం మంచి స్నేహితులమే కానీ ప్రేమికులం కాదని వారు చెప్పుకొచ్చినా.. అందులో నిజం లేదని అంటున్నారు అభిమానులు.ఇక ఇలాంటి రూమర్స్‌ను అయితే విజయ్ పట్టించుకోడు కానీ, రష్మిక చాలా సీరియస్‌గా తీసుకుంటుంది. సమయం దొరికినప్పుడల్లా సైలెంట్‌గా సెటైర్లు వేసేస్తూ ఉంటుంది. తాజాగా ట్విట్టర్‌లో ఒక మీడియా అకౌంట్ .. రష్మిక, విజయ్‌ల గురించి ఒక పోస్ట్ పెట్టింది. 'విజయ్- రష్మిక డేటింగ్ చేస్తున్నట్లు వస్తున్న వార్తలు నిజమే. సీరియస్.. విజయ్ తన ఫేవరేట్ రింగ్‌ను రష్మిక చేతికి పెట్టాడు. వారిద్దరూ ఒకే ఇంట్లో ఒకే రూమ్‌లో కలిసి ఉంటున్నారు. మనం త్వరలోనే ఒక గ్రేట్ న్యూస్‌ను వింటాం' అంటూ చెప్పుకొచ్చాడు. ఇక దీనికి రష్మిక బదులు ఇస్తూ.. 'అయ్యో.. అతిగా ఆలోచించకు బాబు' అంటూ కౌంటర్ వేసింది. ప్రస్తుతం ఈ ట్వీట్ నెట్టింట వైరల్‌గా మారింది.

## ఓటీటీలో విష్వక్‌సేన్ 'దాస్ కా ధమ్కీ'..?

విష్వక్‌సేన్ కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన మాస్, యాక్షన్ ఎంటర్‌టైనర్ 'దాస్ కా ధమ్కీ'. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద పర్వాలేదనిపించింది. విష్వక్ నటన, నివేదా అందాలు యువతను ఆకట్టుకున్నాయి. ఇప్పుడు ఈ సినిమా ఓటీటీలో స్ట్రీమింగ్ అయ్యేందుకు సిదమైంది. ప్రముఖ తెలుగు ఓటీటీలో 'ఆహా' వేదికగా ఏప్రిల్ 14వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కానుంది. కథేంటంటే: కష్ణదాస్ (విష్వక్ సేన్) అనాథ. తన మిత్రులు (హైపర్ ఆది, మహేష్) లతో కలిసి ఓ స్టార్ హోటల్లో వెయిటర్‌గా పనిచేస్తుంటాడు. ఒకరోజు అదే హోటల్‌కు వచ్చిన కీర్తి (నివేదా పేతురాజ్)ని చూసి ప్రేమలో పడతాడు. ఆమెకు దగ్గరవ్వాలన్న ఆలోచనతో తాను వెయిటర్ అన్న విషయాన్ని దాచి పెట్టి.. కోటీశ్వరుడిలా నటించడం మొదలుపెడతాడు. తన పేరు సంజయ్ రుద్ర అని.. ఓ పెద్ద ఫార్మా కంపెనీకి సీఈవో అని అబద్ధాలు చెబుతాడు. కీర్తి.. కష్ణ ప్రేమలో పడిందనుకునే సమయంలోనే అతను కోటీశ్వరుడు కాదు వెయిటర్ అన్న నిజం ఆమెకు తెలుస్తుంది. దీంతో అతన్ని ఛీ కొట్టి వెళ్లిపోతుంది. ఆమె కోసం చేసిన పనుల వల్ల హోటల్లో ఉద్యోగాన్ని కూడా కోల్పోతాడు కష్ణదాస్. అదే సమయంలో అతని జీవితంలోకి సిద్ధార్థ్ మల్హోత్రా (రావు రమేష్) ప్రవేశిస్తాడు. తను ఏ సంజయ్ రుద్ర పేరైతే వాడుకున్నాడో.. అతను తన అన్నయ్య



కొడుకని, క్యాన్సర్కు మందు కనిపెట్టాడని, కానీ, అనుకోకుండా ఓ ప్రమాదంలో చనిపోయాడని చెబుతాడు. మరి అవేంటి? నిజంగా సంజయ్ చనిపోయాడా? లేదా? కష్ణ, సంజయ్ ఒకలా ఉండటానికి కారణమేంటి? కష్ణ ప్రేమ కథ ఏమైంది? వంటి ప్రశ్నలకు సమాధానాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే!

## 'దసరా' ధూమ్‌ధామ్ సెలబ్రేషన్స్



నేచురల్ స్టార్ నాని, నూతన దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబోలో తెరకెక్కిన ఊరమాస్ ఎంటర్‌టైనర్ 'దసరా'. మార్చి నెలాఖరులో విడుదలైన ఈ సినిమా సుమారు వారం రోజుల్లోనే రూ.100 కోట్ల వసూళ్ల రాబట్టి బ్లాక్‌బస్టర్ సక్సెస్‌ను సొంతం చేసుకుంది. సినిమా విజయం పట్ల ఫుల్‌ఖుష్‌లో ఉన్న నిర్మాత చెరుకూరి సుధాకర్ చిత్రబృందంతో తన ఆనందాన్ని పంచుకున్నారు. ఈ మేరకు దర్శకుడు శ్రీకాంత్ ఓదెలకు ఖరీదైన బీఎండబ్ల్యూ కారును బహూకరించారు. అలాగే సినిమా కోసం పనిచేసిన వారందరికీ 10 గ్రాముల బంగారు నాణెలను ఇచ్చారు. ఇదే విషయాన్ని బుధవారం జరిగిన 'దసరా' విజయోత్సవాల్లో వ్యాఖ్యాత సుమ వెల్లడించారు. కరీంనగర్ వేదికగా జరిగిన ఈ విజయోత్సవ వేడుకలో నానితో కలిసి సుమ డ్యాన్స్ చేశారు. 'దసరా'లో వెన్నెలగా కీర్తి సురేశ్ చేసిన బారాత్ స్టెప్పులను సుమ రీక్రియేట్ చేయడానికి ప్రయత్నించారు. అలాగే, 'దసరా' టీమ్‌లోని పలువురు సభ్యులు మాస్ డ్యాన్స్‌లు చేసి ప్రేక్షకులను అలరించారు. ప్రస్తుతం ఈ వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. తమ చిత్రానికి సపోర్ట్ చేసిన ప్రభాస్, మహేశ్‌బాబు, రాజమౌళి, సుకుమార్‌లల పాటు ఎంతో మంది సినీ ప్రముఖులకు నాని ఇదే స్టేజ్‌పై ధన్యవాదాలు చెప్పారు.

## వర్కింగ్ స్టిల్స్ ఈ రేంజ్‌లో ఉంటే..



పుష్ప ఎక్కడ..? జైలు నుంచి తప్పించుకున్న పుష్ప ఎక్కడ ఉన్నాడు..? గత రెండు రోజుల నుంచి సోషల్ మీడియా పుష్ప ఎక్కడ..? అనే ప్రశ్నే నడుస్తోంది. సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ నటిస్తున్న చిత్రం పుష్ప 2. పుష్ప చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న ఈ కాంబో ఈసారి మరిన్ని రికార్డులు కొట్టేయడానికి రెడీ అవుతుంది. ఇక రేపు అల్లు అర్జున్ పుట్టినరోజు కావడంతో అభిమానులకు సర్ ప్రైజ్ ఇవ్వడానికి సుకుమార్ గట్టి ప్లాన్ వేశాడు. పుష్ప ఎక్కడ అనే చిన్న గ్లింప్స్‌ను రిలీజ్ చేసి.. అభిమానుల్లో జోష్ పెంచేశాడు. పుష్ప ఎక్కడ ఉన్నదో రేపు చెప్తామని ప్రకటించారు. దీంతో అభిమానులందరూ పుష్ప ఎక్కడ.. ఎక్కడ..? అంటూ ఆలోచించడం మొదలుపెట్టేశారు. ఇక ఈ హీట్‌ను ఇంకా పెంచడానికి మేకర్స్ రోజుకో అప్డేట్‌ను అందిస్తున్నారు. తాజాగా పుష్ప 2 వర్కింగ్ స్టిల్స్‌ను రిలీజ్ చేస్తూ.. 'రేపు బిగ్ రివీల్ చేయడానికి ముందు పుష్ప 2 సెట్‌లో కొన్ని వర్కింగ్ స్టిల్స్ మీకోసం' అని క్యాప్షన్ పెట్టుకొచ్చారు. ఇక ఈ వర్కింగ్ స్టిల్స్‌లో సుకుమార్ హైలైట్ అని చెప్పాలి. ప్రతిదీ పర్ఫెక్ట్‌గా రావాలనుకొనే లెక్కల మాస్టారు.. అందరితోను కూర్చొని తనకు తగ్గ పర్ఫెక్షన్ వచ్చేవరకు చేయిస్తూనే ఉన్నట్లు కనిపించాడు. ఆస్కార్ అవార్డు విన్నర్ చంద్రబోస్, నాటునాటు సాంగ్ కొరియోగ్రాఫర్ ప్రేమ్ రక్షిత్ మాస్టర్, పుష్ప విలన్ షెకావత్ ఆకా ఫాహద్ ఫాజిల్‌కు సీన్స్ వివరిస్తూ కనిపించదు సుక్కు. వర్కింగ్ స్టిల్స్‌లోనే ఈ రేంజ్ లో ఉంటే.. సినిమాను సుకుమార్ ఏ రేంజ్ లో తీశాడో అర్థంచేసుకోవచ్చు. దీంతో అభిమానులు ఎప్పుడెప్పుడు ఈ సినిమా రిలీజ్ అవుతుందా అని ఎదురుచూస్తున్నారు. మరి రేపు పుష్ప లుక్‌తో సోషల్ మీడియాను ఏ రేంజ్‌లో షేక్ ఆడిస్తారో చూడాలి.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sri Vari Printers, D.No: 13-7-954/C1, Korlagunta, Tirupathi-517501, Chittor District (AP), And Published at H.No. 23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet, Guntur (District), AP-522002. CHIEF EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939. Phone No.040-27819999. E-mail Id: editor@manamnews.com.